ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు : fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-8-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 192 పేజీలు: 12 వెల: 6.50

## ఎర్రకోటపై తొలిసారి 'వందేమాతరం'

9లో

## జెపిపిఎస్‌సి మాజీ చైర్మన్ అరెస్టు

# జూనియర్ వైద్యుల సమరశంఖం

### సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన మరింత ఉధృతం

### అత్యవసర సేవలు, తీవ్ర అనారోగ్య విభాగాలకు మినహాయింపు

**గుంటూరు మెడికల్ , ఆగస్టు 10 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో పనిచేస్తున్న జూనియర్ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం దశలవారీ ఆందోళనకు పిలుపునిచ్చింది. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేయనున్నట్లు సంఘం ప్రకటించింది. సంఘం అధ్యక్షుడు డాక్టర్ యు. ఈశ్వర్ శంకర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బలగం దినకర్ సాయి శ్రీనివాస్ తదితరులు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆందోళన కార్యాచరణను వెల్లడించారు. ఇందులో భాగంగా తొలి దశలో రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో పనిచేస్తున్న సంబంధిత జూనియర్ వైద్యులు, వైద్య శిక్షణార్థులు, సూపర్ ప్రత్యేకతల వైద్య శిక్షణార్థులు, సీనియర్ వైద్య శిక్షణార్థులు తదితరులు అత్యవసరం కాని వైద్య సేవలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు



గుంటూరు ప్రభుత్వ వైద్యాశాల ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న జూనియర్ వైద్యులు

నిలిపివేయనున్నట్లు తెలిపారు. తదుపరి దశలో ఆగస్టు 12 నుంచి 15 వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరం కాని వైద్య సేవలను పూర్తిగా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 15న సాయంత్రం 5 గంటలకు ప్రభుత్వ ఉద్యమానికి మద్దతుగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అత్యవసర సేవలకు మినహాయింపుఆందోళన కారణంగా రోగులకు ఇబ్బందులు కలగకుండా అత్యవసర వైద్య సేవలను యథావిధిగా కొనసాగిస్తామని సంఘం స్పష్టం చేసింది. అత్యవసర విభాగాలు, ప్రసవ సేవలు, అత్యవసర శస్త్రచికిత్సలు, అన్ని తీవ్ర అనారోగ్య విభాగాల సేవలకు ఎలాంటి అంతరాయం ఉండదని పేర్కొంది. సమస్యలు పరిష్కారం కాకుంటే మరింత ఉధృతంపై దశల్లో చేపట్టిన ఆందోళనల అనంతరం కూడా సమస్యలు పరిష్కారం కాకపోతే ఆగస్టు 17 నుంచి మూడో దశలో ఆందోళనను మరింత ఉధృతం చేయనున్నట్లు సంఘం వెల్లడించింది. వైద్య శిక్షణ, పరిధి, ఇతర అంశాలపై తమ డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వ వైద్య సేవలకు అంతరాయం కలగకుండా అత్యవసర విభాగాలను కొనసాగిస్తూనే తమ ఆందోళనను చేపట్టనున్నట్లు స్పష్టం చేసింది.

## భూ రికార్డుల ప్రక్షాళనకే

# రెవెన్యూ రిఫార్మ్స్



సోమవారం కలిదిండి సభలో రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందచేస్తున్న సీఎం చంద్రబాబు

### వచ్చే 7 నెలల్లో 68.64 లక్షల పాస్ పుస్తకాల జారీ

### ఆగస్టు చివరకు 32.22 లక్షల పుస్తకాలు రైతులకు అప్పగింత

### పట్టాదారు పాస్ పుస్తకాలకు టెక్నాలజీ రక్షణ కవచం

### పాత రికార్డుల డిజిటైజేషన్ ప్రక్రియ

### డీఎస్సీపై టీచర్లు తిరగబడినా గొడ్డలి పార్టీకి బుద్ధిరాలేదు

### కలిదిండిలో మీ భూమి మీ హక్కు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**ఏలూరు/కలిదిండి, ఆగస్టు 10:ప్రభాతవార్త:** రైతులకు తమ భూమిపై పూర్తి భరోసా కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని, గత పాలనలో అస్తవ్యస్తంగా మారిన భూమి రికార్డుల ప్రక్షాళనకే రెవెన్యూ రికార్డుల రిఫార్మ్స్ 2026 తీసుకొచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారమే అజెండాగా కూటమి ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. 2027 నాటికి రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి రైతులు, భూ యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తామని తెలిపారు. కైకలూరు నియోజకవర్గం కలిదిండిలో మీ భూమి మీ హక్కు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఇకేవైసీ పూర్తి చేసిన అనంతరం నల్లజర్ల దుర్గా భవానీ అనే మహిళా రైతుకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాన్ని సీఎం జారీ చేశారు. రీసర్వే ప్రక్రియకు సంబంధించి కలిదిండిలో నిర్వహించిన గ్రామసభకు హాజరైనట్టుగా సీఎం రిజిస్టర్‌లో సంతకం చేశారు. అనంతరం ప్రజలు, రైతులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ "రాష్ట్రంలో, కేంద్రంలో డబుల్ ఇంజన్ సర్కారు బుల్లెట్ వేగంతో అభివృద్ధి చేస్తోందన్నారు. రెండో ప్రపంచయుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు ఇచ్చిన భూమిని 22ఏలో పెడితే దానిని పరిష్కరించి వారికి పట్టాలు ఇచ్చా

>>2



## 3 డిమాండ్లపై స్పష్టత ఇవ్వండి

### అప్పుడే లోక్‌సభ ప్రతిష్టంభనకు ముగింపు: రాహుల్ గాంధీ

### లోక్‌సభలో అమిత్‌షా వివరణకు మేం సిద్ధమే: కిరణ్ రిజిజు

**న్యూఢిల్లీ,ఆగస్టు 10:** పార్లమెంట్‌లో కొనసాగుతున్న ప్రతిష్టంభనకు తెరపడాలంటే ప్రతిపక్షం పేర్కొన్న మూడు డిమాండ్లపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని లోక్‌సభలో

>>2



## మరుగుతున్న జార్ఖండ్

### అసెంబ్లీకి విద్యార్థుల ర్యాలీ

### జలఫిరంగులతో పోలీసులు

**రాంచి, ఆగస్టు 10:** ఉద్యోగ నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తంగా మారింది. రాంచీలో అసెంబ్లీ వైపు వెళ్లేందుకు విద్యార్థులు బారికేడ్లను దాట

>>2

## నిఘా వైఫల్యంతోనే ఇంతియాజ్ హత్య

### పక్కా ప్లాన్ ప్రకారమే చేశారు

### వైసిపి నేతల ఆగడాలపై మంత్రి టిజి భరత్ మండిపాటు

**కర్నూల్ (హాస్పిటల్), ఆగస్టు 10 ప్రభాతవార్త:** కర్నూలులో వైసిపి రౌడీ మూకలు హత్యలు, హత్యాయత్నాలతో అరాచకాలు చేస్తున్నాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ మండిపడ్డారు. పక్కా పథకం ప్రకారమే టిడిపి కార్యకర్త ఇంతియాజ్ బాషాను దారుణంగా హత్య చేశారని ఆరోపించారు. వైసిపి రాజకీయ హత్యలకు పాల్పడుతోందన్నారు. కర్నూలులో మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడుతూ,

>>2



సోమవారం ప్రియాంక భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న మంత్రి టి.జి.భరత్

## ప్రియాంక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండ

### రూ.20 లక్షల ఆర్థిక సాయం అందజేసిన మంత్రి టిజి భరత్

### ప్రియాంక భౌతికకాయానికి నివాళి, కుటుంబ సభ్యులకు పరామర్శ

**మహబూబ్‌నగర్, ఆగస్టు 10 ప్రభాతవార్త బ్యూరో:** రాజమండ్రిలో ఇద్దరు వ్యక్తులు నిర్లక్ష్యంగా కారు నడిపి ఢీ కొన్న ఘటనలో మృతి చెందిన వైద్య విద్యార్థిని ప్రియాంక కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి టిజి భరత్ పరామర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్పూర్ గ్రామానికి వెళ్లిన మంత్రి, ప్రియాంక

>>2



సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

## ఎఫ్‌సివి పొగాకు రైతుకు

# నష్టం రానివ్వం

### నిర్ణయించిన ధరలకు రేపటి నుంచే కొనుగోళ్లు

### నిబంధనలు పాటించని కంపెనీలపై కఠిన చర్యలు

### ప్రతి పొగాకు రైతుకు రూ.50వేల వడ్డీలేని రుణం

### ఆఫ్‌స్టైల్, లోగ్రేడ్ పొగాకుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సాయం

### వచ్చే సీజన్‌లో 80 మిలియన్ కేజీలకు మించి సాగుకు అనుమతి లేదు

### పొగాకు రైతుల కోసం సిఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎఫ్‌సివి పొగాకు రైతులను ప్రస్తుత సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగానిలుస్తుందని రాష్ట్రవ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గుంటూరులోని పొగాకు బోర్డు కార్యాలయంలో ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లు, ధరలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, పొగాకు పండించే ప్రాంతాల శాసనసభ్యులు, పొగాకు బోర్డు చైర్మన్, ఇడి, కొనుగోలు సంస్థల ప్రతినిధులు, వివిధ ప్రాంతాల రైతులతో సుమారు రెండు గంటలపాటు సుదీర్ఘంగా చర్చించారు. రైతుల సమస్యలు, కంపెనీల కొనుగోలు తీరు, ధరల అమలుపై సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగినట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఈఏడాది ఎఫ్‌సివి పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు అనేక కారణాలు ఉన్నాయని చెప్పారు. పొగాకు బోర్డు 140మిలియన్ కేజీల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా, గత సీజన్ చివరిలో మంచి ధరలు రావడంతో రైతులు ఆశతో సాగును పెంచారని, ఫలితంగా సుమారు 240మిలియన్ కేజీల వరకు పొగాకు ఉత్పత్తి

>>2



# అర్హులందరికీ 'నేతన్న సేవలో' ఆర్థిక సాయం

### కొత్తగా 13,678 దరఖాస్తులు

### అర్హులను గుర్తించి, అందిస్తాం: మంత్రి సవిత వెల్లడి

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** అర్హులైన నేతన్నలందరికీ 'నేతన్నల సేవలో' పథకం కింద ఆర్థిక సహాయం అందిస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. ఇప్పటి వరకూ వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటిలో అర్హులను గుర్తించి, వారం రోజుల్లోగా రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. రాష్ట్ర సచివాయంలోని తన ఛాంబర్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నేతన్నలందరూ గౌరవ ప్రదమైన జీవనం సాగించాలన్నదే సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా చేనేత రంగ అభివృద్ధికి కార్యక్రమాలు చేపడుతూనే, నేతన్నలకు వ్యక్తిగత లబ్ధి కలిగించేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. 50యేళ్లు నిండిన చేనేతలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50యేళ్లు నిండిన 85,678 మంది చేనేతలకు రూ.4 వేల చొప్పున పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినవిధంగా చేనేతలకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామన్నారు. 62,541 మందికి నేతన్నల కుటుంబాలకు ఉచిత విద్యుత్

>>2

## 'రూఫ్ టాప్ సోలార్'లో ఎస్‌పిడిసిఎల్ రికార్డు

### 50 వేల సర్వీసులు గ్రిడ్‌కు అనుసంధానం

### రాష్ట్రంలో తొలి విద్యుత్ పంపిణీ సంస్థగా గుర్తింపు

### దేశంలో 4వ స్థానంలో నిలిచిన ఎస్‌పిడిసిఎల్

### సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సౌర విద్యుత్తును అందుబాటులోకి తీసుకువచ్చే పనులను ఎస్‌పిడిసిఎల్ వేగవంతం చేసింది. ఎస్సీ,ఎస్టీ విద్యుత్ వినియోగదారుల గృహాలపై రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసి, వాటిని గ్రిడ్‌కు అనుసంధానం చేసే క్రమంలో ఎస్‌పిడిసిఎల్ 50వేల సర్వీసుల మైలు రాయిని చేరుకుంది. రాష్ట్రంలోని మూడు విద్యుత్ పంపిణీ సంస్థల పరిధిలో అమలు చేస్తున్న రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ పనుల్లో 50 వేల సర్వీసులను గ్రిడ్‌కు అనుసంధానం చేసిన తొలి విద్యుత్ పంపిణీ సంస్థగా ఎపి ఎస్‌పిడిసిఎల్ నిలిచింది. రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు అంశంలో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ 4వ స్థానంలో నిలవడం గొప్ప విషయం. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న

>>2




## కొలంబియాలో భారీ భూకంపం

# 100 మంది మృతి?

### రిక్టర్ స్కేలుపై తీవ్రత 7.4గా నమోదు

**బొగోటా,ఆగస్టు 10:** పశ్చిమ కొలంబియాలో సంభవించిన 7.4 తీవ్రతతో కూడిన భారీ భూకంపంలో మృతుల సంఖ్య 100కి చేరింది. భూకంప ధాటికి పలు భవనాలు కూలిపోగా, శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు. సోమవారం హటాత్తుగాస ంభవించిన ఈ భూప్రకంపనలతో ప్రజలు భీతిల్లి వీధుల్లోకి పరుగులు తీసారు. అనేక భవనాలు నేలమట్టం అయ్యాయి. ప్రజలు పరుగులుతీస్తూ కొందరు భవనాల శిథిలాల్లోనే చిక్కుకున్నట్లు స్థానిక అధికారుల సమాచారం. సహాయక సిబ్బంది శిథిలాలను తొలగిస్తూ ప్రాణాలతో ఉన్నవారి కోసం గాలిస్తున్నారు. భూకంపం కారణంగా ఇళ్ల నుంచి ప్రజలు బయటకు పరుగులు తీశారు. రాజధాని బొగోటాలోనూ ప్రకంపనలు నమోదయ్యాయి. అమెరికా జియోలాజికల్ సర్వే, కొలంబియా భూగర్భ శాస్త్ర అధికారులు తెలిపిన వివరాల ప్రకారం చోకో ప్రాంతంలోని సుమారు 4,800 మంది జనాభా ఉన్న శాన్ జోసే డెల్ పాల్మార్ సమీపంలో భూకంపం సంభవించింది. బొగోటాకు ఇది సుమారు 400కిలోమీటర్ల దూరంలో ఉంది. భూకంప కేంద్రం 107 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు ఎస్‌జిసి వెల్లడించింది. పొరుగున ఉన్న ఈక్వెడార్, పనామాల్లోనూ ప్రకంపనలు అనిపించాయి. అయితే అక్కడ పరిమిత నష్టం మాత్రమే నమోదైంది. పలు నగరాల్లో భారీ నష్టంపశ్చిమ కొలంబియాలో భూకంపం తీవ్ర నష్టం కలిగించింది. పెరీరాలో 18 మంది, మానిజలెస్‌లో మరో ఇద్దరు మృతి చెందినట్లు స్థానిక అధికారులు తెలిపారు. కాలిలో పలు భవనాలు కూలిపోగా, కనీసం 19 భవనాల్లో ప్రజలు చిక్కుకున్నట్లు మేయర్ అలెజాండ్రో ఎడెర్ తెలిపారు. క్విబ్డోలోనూ భారీగా భవనాలు దెబ్బతిన్నాయి. పెరీరా, కాలి, క్విబ్డో నగరాల్లో ఇళ్లు, చిన్న భవనాలు కూలిపోయిన దృశ్యాలు స్థానిక మీడియాలో ప్రసారమయ్యాయి. మానిజలెస్‌లోని నియోగోతిక్ కేథడ్రల్‌లోని ఓటవర్ కూలి ప్రధాన ప్రార్థనా మం దిరంలో పడిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందినటు

>>2




### తిరుమల శేషాచల కొండల్లో

## 'పవన' విద్యుత్

### రూ.6 కోట్ల వ్యయంతో 800 కిలోవాట్ల సామర్థ్యం

### 1.39 ఎకరాలలో గాలి టర్బైన్స్ ఏర్పాటు

### యేటా 16లక్షల యూనిట్ల ఉత్పత్తి లక్ష్యం

### టిటిడి అధికారుల ముమ్మర కసరత్తు

**తిరుమల, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలం కొండల్లోని తిరుమలలో గాలి ద్వారా విద్యుత్ ఉత్పత్తిని పెంచే దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం కార్యాచరణ రూపొందించింది. ఇప్పటికే

>>2



సోమవారం కలిదిండి సభలో పట్టాదారు పాస్‌పుస్తకాలు అందుకున్న రైతులు

## భూ రికార్డుల ప్రక్షాళనకే రెవెన్యూ రిఫార్మ్స్

>> మన్నారు. మీ భూమి మీ హక్కు దానిపై ఇతరులు పెత్తనం చేయడానికి వీల్లేదు. పాస్ పుస్తకాలపై గత పాలకులు ఫోటోలు ఎలా వేసుకుంటారు. 2019-24 మధ్య గత పాలకులు చేసిన విధ్వంసం కారణంగా రెవెన్యూ రికార్డులు ధ్వంసం అయ్యాయి. వారికి ఇష్టం లేని వ్యక్తుల భూముల్ని, ఆస్తుల్ని డిజిటల్ గా 22ఏలో పెట్టేసి వివాదాస్పదం చేశారు. 2024లో అధికారంలోకి రాగానే ఎక్కడికి వెళ్లినా భారీ ఎత్తున భూ ఫిర్యాదులు అందాయి. అప్పుడే వీటన్నిటినీ పరిష్కరిం చాలని నిశ్చయించుకున్నామన్నారు. ఒక్కొక్కటిగా వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవాలనే ప్రతీ నెలా సమావేశాల ద్వారా వారిని కలుస్తున్నామన్నారు. . కరెన్సీకి ఉండే పటిష్టమైన భద్రతా ఫీచర్లను పట్టా దారు పాస్ పుస్తకాలకు కూడా అమలు చేస్తున్నాం. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా ఆస్తుల వివరాలను ట్యాంపర్ చేయకుండా భద్రత కల్పించాం. క్యూఆర్ కోడ్ సహా ఇతర సాంకేతిక పరమైన భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేశాం. 32.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను ఇప్పటి వరకూ రైతులకు, భూ యజమానులకు అందించాం. వచ్చే ఏడు నెలల్లో 9365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్ పుస్తకాలు జారీ చేస్తాం అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 'ఇప్పటి వరకూ 41 వేల ఎకరాల మేర భూ సమస్యలు క్లియర్ చేశాం. దీని ద్వారా 1.27 లక్షల మందికి పైగా రైతులు, పరిశ్రమలు, ప్రజలకు ప్రయోజన కలిగింది. 1.36 లక్షల ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేశాం. ప్రతీ రైతుకు, భూ యజమానికి రాజ ముద్రతో కూడిన పట్టా దారు పాస్ పుస్తకాలు జారీ చేసే వరకూ విశ్రమించమన్నారు.

కొల్లేరు వద్ద తాగునీటి సమస్యను పరిష్కరించేలా రూ.36 కోట్లను కైకలూరుకు మంజూరు చేశాం. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో పదేపదే మరమ్మత్తులు వచ్చే రహదారులకు కూడా శాశ్వత పరిష్కారం ఉండేలా సిమెంట్ రోడ్లు వేయాలని ఆలోచన చేస్తున్నామన్నారు.

ఓ దౌర్భాగ్యపు పార్టీ కుట్రలు, కుతంత్రాలు చేస్తోంది. గొడ్డలి పార్టీ వల్ల రాష్ట్ర ప్రజలు నష్టపోతున్నారు. నక్సల్స్ నాపై క్లైమోర్ మైన్స్ పేల్చినా కేవలం ప్రజల కోసమే రాజకీయాల్లో కొనసాగుతున్నాను. రాయలసీమలో ఫ్యాక్షన్, హైదరాబాద్‌లో మత విద్వేషాలను కూడా సమర్ధంగా నియంత్రించామన్నారు. ఆ తర్వాతే రాష్ట్రంలో అభివృద్ధి జరిగి సంపద పెరిగిందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 15 వేల టీచర్ల పోస్టులు భర్తీ చేస్తే దానిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. పూర్తి మెరిట్ తో ఉద్యోగాలు సంపాదించిన యువతను కించ పరిచేలా గొడ్డలి పార్టీ వ్యవహరిస్తోందన్నారు. ఢిల్లీలో నీట్ పరీక్ష పేపరు లీక్ అయితే..ఇక్కడ కూడా లోకేష్ రాజీనామా చేయాలని అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారన్నారు. మెగా డీఎస్సీ లో ఉద్యోగాలు పొందిన టీచర్లు రోడ్లపైకి వచ్చి ర్యాలీ చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఎవరు ప్రజలకు ఇబ్బంది కలిగించినా వదిలి పెట్టేది లేదు అని ముఖ్యమంత్రి అన్నారు. అనంతరం రైతులకు ట్రాక్టర్లను పంపిణీ చేశారు. వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కొలుసు పార్ధసారధి, అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, సీఎస్ సాయి ప్రసాద్, సీసీఎల్ఏ జయలక్ష్మి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ తదితరులు హాజరయ్యారు.

## అర్హులందరికీ 'నేతన్న సేవలో' ఆర్థిక సాయం

>> పథకం కింద 200 యూనిట్లు, 500 యూనిట్లు అందజేస్తున్నామన్నారు. చేనేత కుటుంబాలకు మరింత ఆర్థిక మేలు కలుగజేయాలన్న ఉద్దేశంతో సిఎం చంద్రబాబునాయుడు ఇటీవల 'నేతన్నల సేవలో' పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగా 71,536 మందికి రూ.25 వేల చొప్పున్న ఆర్థిక సాయం అందించనున్నారు. అర్హులు ఇంకా ఉన్నారన్న ఉద్దేశంతో దరఖాస్తులు కూడా స్వీకరించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13,678 మంది 'నేతన్నల సేవలో' పథకానికి దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వారిలో అర్హులను గుర్తించి వారం రోజుల్లోగా రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేస్తామని మంత్రి సవిత తెలిపారు.

**ఆర్థిక సాయం అందలేదనే ఫిర్యాదు రాకూడదు:** అంతకుముందు చేనేత, జౌళి శాఖాధికారులతో మంత్రి సవిత తన ఛాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. చేనేతలకు ఆర్థిక దన్ను కల్పించాలన్న సిఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'నేతన్న సేవలో' పథకాన్ని అర్హులకు అందజేయాలన్నారు. ఈ పథకం కింద వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అర్హులను గుర్తించాలన్నారు. తమకు ఆర్థిక సాయం అందలేదని ఫిర్యాదులుగాని, దరఖాస్తులుగాని మరోసారి రాకూడదన్నారు. ఈ సమీక్షా సమావేశంలో చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులు, వర్చువల్‌గా ఆయా జిల్లాలకు చెందిన ఏడీలు పాల్గొన్నారు.

## 'రూఫ్ టాప్ సోలార్'లో ఎస్పిడిసిఎల్ రికార్డు

>> పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద దేశవ్యాప్తంగా ఒక కోటి రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేయాలనే లక్ష్యంలో భాగంగా నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 415 మెగావాట్ల సామర్థ్యంతో 2.07 లక్షల ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల గృహాలపై రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేయడంపై ఏపిఎస్పిడిసిఎల్ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ పనుల్లో భాగంగా ప్రస్తుతం నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ (ఎంఎన్ఆర్ఈ) పోర్టల్ యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్ (యుఎల్ఏ) అధికారిక గణాంకాల మేరకు 203.95 మెగావాట్ల సామర్థ్యంతో 1.01 లక్షల గృహాలపై సోలార్ వ్యవస్థలను ఎస్పిడిసిఎల్ ఏర్పాటు చేసింది. మిగిలిన గృహాలకు కూడా సోలార్ ఏర్పాటు పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు వీలుగా ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల నుంచి అంగీకార పత్రాల స్వీకరణ నుంచి సౌర వ్యవస్థ ఏర్పాటు, తనిఖీ, గ్రిడ్ కు అనుసంధానం చేసే వరకు ప్రక్రియను వేగవంతం చేయడం జరుగుతోంది. అర్హులైన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు తమ గృహాలపై సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని, ఉత్పత్తి చేసిన విద్యుత్తును గ్రిడ్ కు పంపించడం ద్వారా సాంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు అవకాశం ఏర్పడుతోంది.

**అధికారులు, సిబ్బందికి అభినందనలు:** ఏపిఎస్పిడిసిఎల్ పరిధిలో క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బందితో బాటు సంబంధిత ఏజెన్సీల సమన్వయంతో సోలార్ ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తోందని సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత ప్రోత్సహించడంతోపాటు గ్రిడ్‌కు అనుసంధానం పనుల్లో సంస్థ 50 వేల మైలు రాయిని చేరుకోవడం చాలా సంతోషంగా వుంది. ఈ ప్రక్రియలో సంస్థ అధికారులు, సిబ్బంది, సోలార్ ఏజెన్సీల కృషి అభి నందనీయం. ఇప్పటివరకు 1.01లక్ష గృహాలపై సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేశాం. మిగిలిన 1.06 లక్షల గృహాలపై కూడా నిర్ణీత గడువులోగా సోలార్ ఏర్పాటు పనులను పూర్తి చేస్తామని

## తిరుమల శేషాచల కొండల్లో 'పవన' విద్యుత్

>>తిరుమలలో కాకులకొండ ప్రాంతంలో ఏర్పాటుచేసిన ఈ విండ్‌పవర్ టర్బైన్స్‌తో కొంతమేరకు విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో కూడా తిరుమలకొండపై విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండదు. ఇప్పుడు ఈ ఉత్పత్తిని మరింత పెంపొందించే దిశగా టిటిడి బోర్డు, అధికారులు ప్రణాళికలు రూపొందించి అమలుచేస్తున్నారు. ఇప్పటికే తిరుమల శేషాచలంకొండలు పచ్చదనం పెంపుకు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ముందుకు వెళుతున్నారు. తిరుమల కొండలపై పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తిని మరింత పెంచేందుకు టిటిడి సన్నాహాలు చేస్తోంది. గ్రీన్ ఎనర్జీని సమకూర్చుకునేలా నూతన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. జీఎన్‌సి నర్సరీ సమీపంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ ప్రక్కనే ఈ విండ్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు టిటిడి 1.39 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఈ భారీ ప్రాజెక్ట్ కు మూడు నెలల్లో శ్రీకారం చుట్టనున్నారు. వీచే గాలిలోని శక్తిని ఉపయోగించి విద్యుత్‌ను తయారు చేసే పరికరం. తిరుమలలో నూతన విండ్ టర్బైన్ ఏర్పాటు కానుంది. ముంబైకి చెందిన ఓ ప్రముఖ రవాణా, మౌలిక సదుపాయాల సంస్థ ఈ అత్యాధునిక టర్బైన్‌ను టిటిడికి విరాళంగా ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అదనపు ఏర్పాట్లుతో ప్రతి సంవత్సరం దాదాపు 16 లక్షల యూనిట్ల పవన విద్యుత్ ఉత్పత్తి అవుతుందని టిటిడి ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పవన విద్యుత్ విధానంలో మాత్రం పరిమిత స్థలంలో 1.39 ఎకరాల్లోనే 16 లక్షల యూనిట్లను ఉత్పత్తి చేయడానికి టర్బైన్‌ప్లాంట్‌ను నెలకొల్పుతున్నారు. టర్బైన్ ద్వారా ఉత్పత్తి అయ్యే కరెంటును నేరుగా టిటిడి పరిధిలోని 11 కేవీ ఫీడర్‌కు అనుసంధానం చేస్తారు. ముంబైకి చెందిన విష్ విండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎల్‌ఎల్‌పి అనే సంస్థ సుమారు రూ.6 కోట్ల వ్యయంతో 800 కిలోవాట్ల సామర్థ్యం గల పవన విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతోంది. దీని ద్వారా టిటిడికి ఏటా సుమారు రూ.1.45 కోట్ల కరెంటు బిల్లుల భారం తప్పుతుంది. మూడు నెలల్లో ఈ నూతన టర్బైన్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఉన్న తొమ్మిది విండ్ మిల్స్‌కు ఇది అదనంగా చేరుతుంది. ప్రస్తుతం తిరుమలలో వసతి గృహాలు, ఆలయాలు, ఇతర సేవల అవసరాల కోసం టిటిడి ప్రతి సంవత్సరం సుమారు ఆరు కోట్ల యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తోంది. ఇందులో దాదాపు కోటి యూనిట్ల విద్యుత్‌ను ఇప్పటికే ఉన్న పవన విద్యుత్ కేంద్రాల సహాయంతో సొంతంగా ఉత్పత్తి చేసుకుంటోంది. మిగిలిన అయిదు కోట్ల యూనిట్లను ఎపి సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (ఎస్‌పిడిసిఎల్)నుండి కొనుగోలు చేస్తోంది. ఈ విండ్ టర్బైన్ ఏర్పాటైన తరువాత ఈ కొనుగోలు వ్యయం గణనీయంగా తగ్గుతుందనేది భావిస్తున్నారు. విష్ విండ్ ఇన్ ఫ్రా సంస్థే ఈ టర్బైన్‌ను ఉచితంగా అందజేస్తుంది. దీన్ని ఏర్పాటుచేసిన తరువాత రానున్న 25 సంవత్సరాల పాటు ఎలాంటి అదనపు భారం లేకుండా ఉచితంగానే నిర్వహిస్తుంది. పాతికేళ్ల సుదీర్ఘ కాలపరిమితిలో టిటిడికి దాదాపు రూ.36.32 కోట్లు ఆదా అవుతాయనే అంచనా.

## నిఘా వైఫల్యంతోనే ఇంతియాజ్ హత్య




సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

>> గత ఎన్నికల్లో ఇంతియాజ్ బాషా ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారని తెలిపారు. తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలని అప్పట్లో వైసిపి వర్గీయులు ఇంతియాజ్‌ను బెదిరించారని, ఆయన ఇంటికి వెళ్లి గొడవకు దిగారని చెప్పారు. అనంతరం ఇంతియాజ్ టిడిపిలో చేరారని తెలిపారు. ఇంతియాజ్ బాషా హంద్రీ నదిలో వైసిపి కబ్జాలను, అక్రమాలను బయటపెట్టారని మంత్రి పేర్కొన్నారు. వైసిపి అక్రమాలను ప్రశ్నించినందుకే ఇంతియాజ్‌ను హత్య చేశారని ఆరోపించారు. గత రెండేళ్లలో కర్నూలులో మూడు హత్యలు జరిగాయని, ప్రతిహత్యలోనూ వైసిపి ప్రమేయం ఉందని మంత్రి ఆరోపించారు. ఇంతియాజ్‌ను చంపుతామని పరోక్షంగా వారం రోజుల ముందే సోషల్ మీడియాలో పోస్టులు వచ్చినా ఇంటెలిజెన్స్ వర్గాలుఎందుకు అంచనా వేయలేక పోయాయని ప్రశ్నించారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తుందో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా పోలీసులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలి" అని మంత్రి అన్నారు. గతంలో కావాలనే తన కార్యాలయం ఎదురుగా రెచ్చగొట్టే విధంగా వైసిపి నేతలు ర్యాలీలు నిర్వహించారని టిజి భరత్ తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పి, తన కార్యాలయం ఉన్న మార్గంలో కాకుండా ఇతర మార్గాల్లో నిరసనలు చేసుకునేలా చూడాలని కోరినప్పటికీ వైసిపి నేతల ధోరణిలో మార్పు రాలేదన్నారు. పోలీసులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. కర్నూలులో నెలకొన్న పరిస్థితులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి వివరిస్తానని మంత్రి తెలిపారు. వైసిపి ధోరణి ఇలాగే ఉంటే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. 1994 నుంచి 2004 వరకు టిడిపి ప్రభుత్వ హయాంలో కర్నూలులో ఫ్యాక్షనిజాన్ని అదుపులోకి తెచ్చామని టిజి భరత్ గుర్తు చేశారు. అవసరమైతే మళ్లీ కఠిన చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. ఫ్యాక్షన్ రాజకీయాలను అంతమొందించినట్లే, ఇప్పుడున్న రౌడీ మూకలను కూడా తుడిచిపెట్టేలా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి టిజి భరత్ స్పష్టం చేశారు.

## ఎఫ్‌సివి పొగాకు రైతుకు నష్టం రానివ్వం

>> జరిగిందన్నారు. దీనికి తోడు అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, సిగరెట్లకు సంబంధించిన పరిణామాలు తదితర కారణాలతో ధరలు తగ్గాయని పేర్కొన్నారు. పొగాకు బోర్డు ఏర్పడిన తర్వాత రైతుల సమస్యలపై ఈ స్థాయిలో ప్రత్యేక దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి మరొకరు లేరని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే ఆరుసార్లు గంటల తరబడి సమావేశాలు నిర్వహించి, ఎట్టి పరిస్థితుల్లోనైనా ఎఫ్‌సీవీ పొగాకు రైతులను ఈ సంక్షోభం నుంచి బయటపడేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. కేంద్ర వాణిజ్య శాఖతో పాటు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తోను పలుమార్లు చర్చించి సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకొచ్చేందుకు ప్రయత్నించామని చెప్పారు. పొగాకును నాలుగు గ్రేడ్లుగా విభజించి ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే తక్కువకు కొనుగోలు చేయవద్దని కంపెనీలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. బ్రైట్ గ్రేడ్‌కు కిలో రూ.230కు తగ్గకుండా, మీడియం గ్రేడ్‌కు రూ.190కు తగ్గకుండా, ఆఫ్‌స్టైల్‌కు రూ.130కు తగ్గకుండా, లో గ్రేడ్‌కు రూ.110కు తగ్గకుండా కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ నెల 5వ తేదీన ముఖ్యమంత్రి ఈ ధరలపై నిర్ణయం తీసుకున్నారని, అనంతరం కేంద్ర సహాయ మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పొగాకు బోర్డు అధికారులు, ట్రేడర్లతో మాట్లాడి నిర్ణయించిన ధరలకు కొనుగోలు చేయాలని స్పష్టం చేశారని తెలిపారు. రేపటి నుంచి నాలుగు గ్రేడ్లకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అనుగుణంగానే ప్లాట్‌ఫారమ్‌లపై కొనుగోళ్లు జరగాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే తీవ్ర చర్యలు తప్పవు' అని మంత్రి హెచ్చరించారు. పొగాకు బోర్డు రైతులు చెల్లించిన నిధులతోనే నడుస్తున్న నేపథ్యంలో రైతులకు తిరిగి అండగా నిలవాల్సిన బాధ్యత బోర్డుపై ఉందని కేంద్రానికి స్పష్టం చేశామని మంత్రి తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించి ప్రతి రైతుకు రూ.50 వేల చొప్పున రెండు సంవత్సరాలపాటు వడ్డీలేని రుణం అందించేందుకు అంగీకరించారని చెప్పారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. దీనితోపాటు ఆఫ్‌స్టైల్, లో గ్రేడ్ పొగాకు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అండగా నిలవాలని నిర్ణయించిందన్నారు. 94 మిలియన్ కేజీల ఆఫ్‌స్టైల్, లో గ్రేడ్ పొగాకుకు క్వింటాల్‌కు రూ.1,000 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం సహాయం అందించాలని నిర్ణయించిందని, అంటే కిలోకు రూ.10 మేర అదనపు సాయం అందుతుందని తెలిపారు.

## ప్రియాంక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండ

>> మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రియాంక తండ్రి, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.20 లక్షల ఆర్థిక సాయం చెక్కును ప్రియాంక తండ్రికి అందించారు. ఈ సందర్భంగా మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ ప్రియాంక మృతిపట్ల తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ఇందుకు కారణమైన నేరస్థులపై కఠిన చర్యలు తీసుకుని, వారికి కఠిన శిక్షలు పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రియాంక చికిత్స పొందిన సమయంలో ఆసుపత్రిలో అయిన వైద్య ఖర్చులతో పాటు, ఆమె మెడికల్ పీజీ సీటుకు సంబంధించిన ఫీజు ఖర్చులను కూడా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందిస్తామని మంత్రి తెలిపారు. ఈ కష్ట సమయంలో ప్రియాంక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**ముగిసిన అంత్యక్రియలు:** ప్రియాంక మృతదేహానికి సోమవారం గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేశారు. అనంతరం, పార్థివ దేహం జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణానికి చేరుకుంది. అంత్యక్రియల్లో తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని ప్రియాంక మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రియాంక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్టు వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రియాంక కుటుంబానికి అన్ని విధాలుగా అండదండగా ఉంటామని భరోసానిచ్చారు. ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ ప్రియాంక పాడే మోశారు.

## 100 మంది మృతి?

>> మేయర్ జార్జ్ ఎడువార్డో రోజాస్ తెలిపారు. భూకంపం అనంతరం ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు ఇళ్లలోకి వెళ్లకుండా బయటే ఉండాలని ఆయన సూచించారు. **సహాయక చర్యలు ముమ్మరం:** చోకో గవర్నర్ నూబియా కోర్డోబా మాట్లాడుతూ ప్రాంతీయ రాజధాని క్విబ్డోలో పలువురు గాయపడటంతో పాటు భవనాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని గుర్తించేందుకు అత్యవసర బృందాలు రంగంలోకి దిగాయి. నష్ట తీవ్రతను అంచనా వేస్తూ సహాయక చర్యలను అధికారులు ముమ్మరం చేశారు. కొలంబియా అధ్యక్షుడు అబెలార్డో డి లా ఎస్ప్రియెల్లా శాన్ జోసే డెల్ పాల్మార్‌లో సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. మీరు ఒంటరిగా లేరు. ప్రభుత్వం ఇక్కడే ఉంది చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. కొలంబియాలోని మధ్య, పశ్చిమ ప్రాంతాల్లో భూకంపాలు సాధారణమే అయినప్పటికీ, 6కి పైగా తీవ్రతతో కూడిన భూకంపాలు అరుదుగా సంభవిస్తాయి. 1999లో ఆర్మేనియా సమీపంలో 6.2 తీవ్రతతో సంభవించిన భూకంపంలో 1,100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

## 3 డిమాండ్లపై స్పష్టత ఇవ్వండి

>>ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం పునరుద్ఘాటించారు. నీట్ పేపర్ లీకేజీకి సంబంధించిన విద్యార్థుల ఆందోళనల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న కాల్పులపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయడం, విద్యార్థుల ఆందోళనల నిర్వహణపై ప్రధాని నరేంద్ర మోడీ క్షమాపణ చెప్పడం, అయోధ్య రామ మందిరంలో జరిగినట్లు ఆరోపిస్తున్న చోరీపై బాధ్యత వహించడం తమ ప్రధాన డిమాండ్లని తెలిపారు. విద్యార్థులపై కాల్పులు, బలప్రయోగానికి ఎవరు అనుమతిచ్చారో అమిత్ షా స్పష్టం చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. పెల్లెట్ గన్స్ ప్రయోగించారని, విద్యార్థులపై గోళ్లతో కూడిన లాఠీలతో దాడులు జరిగాయని ఆరోపించారు. కాల్పులకు ఆదేశాలు ఇచ్చారా లేదా అన్నది హోంమంత్రి తేల్చి చెప్పాలని అన్నారు. కాల్పులకు ఆదేశాలు ఇచ్చి ఉంటే విద్యార్థులపై కాల్పులకు బాధ్యత వహించాల్సి ఉంటుందని, తెలియకపోతే అది అసమర్థతకు నిదర్శనమని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో ప్రభుత్వం సమాధానం ఇవ్వడం లేదని ఆరోపించారు. విద్యార్థుల ఆందోళనల నిర్వహణపై ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. అమిత్ షా సాధారణ అంశాలపై ప్రసంగం చేయడం తమ డిమాండ్ కాదని, నిర్దిష్ట అంశాలపై స్పష్టమైన సమాధానాలు కావాలని చెప్పారు. అయోధ్య రామ మందిరంలో జరిగినట్లు ఆరోపిస్తున్న చోరీపై కూడా ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలని డిమాండ్ చేశారు. ప్రధానికి అత్యంత సన్నిహితులైన వ్యక్తులు రామ మందిరంలో చోరీకి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. గత 15 రోజులుగా ప్రధాని, హోంమంత్రి పార్లమెంట్‌కు వచ్చి ఈ అంశాలపై సమాధానం చెప్పేందుకు ముందుకు రాలేదని రాహుల్ ఆరోపించారు. ముందుగా కాల్పులకు ఎవరు అనుమతిచ్చారో స్పష్టత ఇవ్వాలని, ఆ తర్వాతే ఇతర అంశాలపై చర్చ జరగాలని అన్నారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యల నేపథ్యంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ విద్యార్థుల ఆందోళనలకు సంబంధించిన అంశాలపై పూర్తి స్థాయి, సమగ్ర చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. హోంమంత్రి ప్రకటన, చర్చ జరుగుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగించకుండా సమాధానాన్ని వినాలని రిజిజు కోరారు. చర్చ ప్రారంభమైన తర్వాత అంశంపై సమగ్రంగా చర్చించవచ్చని తెలిపారు. కొనసాగుతున్న ప్రతిష్టంభనప్రభుత్వం సమగ్ర చర్చకు సిద్ధంగా ఉందని చెబుతుండగా, ప్రతిపక్షం మాత్రం నిర్దిష్ట ప్రశ్నలకు ముందుగా సమాధానాలు ఇవ్వాలని పట్టుబడుతోంది. దీంతో పార్లమెంట్‌లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. అమిత్ షా ప్రకటనతో ఇరు పక్షాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు ముగింపు వచ్చి తదుపరి చర్చలకు వీలవుతుందా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## గ్లోబల్ పర్యాటక పటంలో ఆంధ్రప్రదేశ్ : మంత్రి కందుల దుర్గేష్

**సచివాలయం,ఆగష్టు 10,ప్రభాతవార్త :**దేశంలోనే అత్యంత వైవిధ్యమైన పర్యాటక ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలుస్తుందని రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు.ఏపి పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్ళేందుకు రాష్ట్రాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్,ట్రావెల్ ట్రేడ్ భాగస్వాములు,హోటల్ రంగానికి చెందిన ప్రముఖులతో మంత్రి దుర్గేష్ నేతృత్వంలో ఏపి పర్యాటక శాఖ సోమవారం న్యూఢిల్లీలోని తాజ్ అంబాసిడర్ హోటల్లో రౌండ్ టేబుల్ సమావేశం మరియు విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..రాష్ట్రంలో అపారమైన పర్యాటక అవకాశాలున్నాయని,అధ్యాత్మిక,సాంస్కృతి,చారిత్రక,తీరప్రాంత ప్రకృతి క్రూయిజ్ టూరిజం విరాజిల్లుతోందన్నారు.

## వెయిటింగ్‌లో ఉన్న ఎస్పీ రామాంజనేయులుకు కీలక బాధ్యతలు

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రస్తుతం ఎస్పీ(ఎన్‌సి) వెయిటింగ్‌లో ఉన్న ఎన్.వి రామాంజినేయులును విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటన విభాగంలో ఎస్పీ(ఎన్‌సి)/ఆర్వీఅండ్ ఇఒగా నియమించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. విజయకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎస్పీ (ఎన్‌సి), వెయిటింగ్‌లో ఎన్.వి. రామాంజనేయులు ఉన్నారు. రామాంజనేయులను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలో ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు హోంశాఖ ఆధ్వర్యంలో జిఒ ఆర్టీ నంబర్ 994 ద్వారా జి. విజయకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

## హౌసింగ్ శాఖ కార్యదర్శిగా కొర్లపాటి హెప్సీబా బాధ్యతల స్వీకరణ

కొర్లపాటి హెప్సీబా సోమవారం వెలగపూడి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ శాఖ కార్యదర్శిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె అధికారికంగా బాధ్యతలు చేపట్టి, హౌసింగ్ శాఖ కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమెకు పలువురు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

## పిపిపి పాలసీ -2026ను విడుదల చేసిన ప్రభుత్వం

**విజయవాడ,ఆగస్టు10,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పీపీపీ(పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) పాలసీ 2026ను విడుదల చేసింది. స్వర్ణాంధ్ర విజన్2047కు అనుగుణంగా రాష్ట్రంలో భారీ పెట్టుబడులే ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. రవాణా, లాజిస్టిక్స్, పోర్టులు, విమానాశ్రయాలు, పట్టణ మౌలిక వసతులు, వైద్యం, విద్య, పరిశ్రమలు, పునరుత్పాదక ఇంధనం, పర్యాటకం తదితర రంగాల్లో పీపీపీ ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు రూ.1.23 లక్షల కోట్ల విలువైన పీపీపీ ప్రాజెక్టుల పైప్‌లైన్ ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది.2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.1,500 కోట్ల స్టేట్ వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌ను ప్రభుత్వం కేటాయించింది. ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడంలో కీలక మూలధన అవసరాలకు సర్కార్ భర్తీ చేయనుంది. ప్రారంభ దశలో ఆర్థికంగా లాభదాయకంగా లేని, భవిష్యత్తులో ఆదాయాన్ని సమకూర్చే అవకాశం ఉన్న ప్రాజెక్టులకు ప్రాజెక్ట్ వయబిలిటీ బ్రిడ్జి ఫండ్ ద్వారా వడ్డీలేని రుణాన్ని అందించే విధానాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది.ప్రైవేట్ రంగ పెట్టుబడులు, సాంకేతిక నైపుణ్యం, నిర్వహణ సామర్థ్యాలను వినియోగించుకోవడమే ఈ ప్రాజెక్ట్ ప్రధానఉద్దేశమని పేర్కొంది. నాణ్యమైన ప్రజా సేవలను అందించడంతో పాటు పెట్టుబడిదారులకు అనుకూలమైన మౌలిక వసతుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న పీపీపీ విధానాలను పరిశీలించడంతో పాటు, సంబంధిత స్టేక్‌హోల్డర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పాలసీని రూపొందించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ సంస్థలు, స్వయం ప్రతిపత్తి సంస్థలు పీపీపీ పాలసీ2026ను అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## కీలక అధికారుల బదలీలపై నిషేధం పొడిగింపు

**విజయవాడ,ఆగస్టు10,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో కీలక అధికారుల బదలీలపై నిషేధాన్ని ప్రభుత్వం పొడిగించింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియ నేపథ్యంలో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కీలక ప్రభుత్వ అధికారుల బదిలీలు, పోస్టింగులపై నిషేధాన్ని అక్టోబర్ 3 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు కీలక అధికారుల బదిలీలకు బ్రేక్ పడనుంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు జులై 1, 2026 అర్హత తేదీగా నిర్ణయించారు. ఏపీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం(ఈసీ) సవరించింది. దీని ప్రకారం, జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించనున్నారు. క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ సెప్టెంబర్ 28 వరకు కొనసాగనుంది. అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ సవరించిన షెడ్యూల్ నేపథ్యంలో బదిలీల నిషేధాన్ని ఏపీ ప్రభుత్వం పొడిగించింది. ఈ నిర్ణయం ప్రకారం ఎన్నికల జాబితా సవరణకు సంబంధించిన కీలక అధికారులు అక్టోబర్ 3 వరకు అదే స్థానాల్లో కొనసాగాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఏపీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ పేరుతో జీవోఆర్టీనెం.1545 జారీ అయింది.

## మరుగుతున్న జార్ఖండ్

>> దంతో పోలీసులు వాటర్ కేనన్లు ప్రయోగించారు. అయినా కొందరు విద్యార్థులు నృత్యాలు చేస్తూ ముందుకు కదలడం వీడియోల్లో కనిపించింది. నియామక పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్‌లతో తమ భవిష్యత్తు దెబ్బతింటోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ సోమవారం వేలాది మంది రాంచీకి తరలివచ్చారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రైళ్లు, బస్సులు, ఇతర వాహనాల్లో రాజధానికి చేరుకున్నారు. అసెంబ్లీ ముట్టడికి బయలుదేరే ముందు విద్యార్థి నేత దేవేంద్ర మహతో కీలక సూచన చేశారు. పోలీసులు అడ్డుకున్నప్పుడు వారితో వాగ్వాదానికి దిగొద్దని కోరారు. క్రమశిక్షణతో మరో మార్గం ద్వారా అసెంబ్లీకి చేరేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఝార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లు, అక్రమాలు జరిగాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. 13 పరీక్షలను రద్దు చేసి సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వంతో ఇప్పటికే ఆరు దఫాలుగా చర్చలు జరిగినా పరిష్కారం కాలేదు. తమ డిమాండ్లలో 98 శాతం అంగీకరించామని ప్రభుత్వం చెబుతోంది. అయితే 13 పరీక్షల్లో కేవలం మూడింటినే రద్దు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని విద్యార్థులు అంటున్నారు. ఆందోళనలో భాగంగా ఆరుగురు విద్యార్థులు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు.

## ఏసీబీ అధికారి అంటూ ఘరానా మోసం

### రూ.40 వేల లంచం తీసుకున్న నిందితుడు అరెస్ట్

**పులివెందుల, ఆగస్టు 10: ప్రభాతవార్త:** ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌గా పరిచయం చేసుకొని వీఆర్వోకు డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీలో అనుకూల నివేదిక తెప్పిస్తానని నమ్మబలికి రూ.40 వేల లంచం తీసుకున్న నిందితుడిని పులివెందుల పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. కడప జిల్లా పోలీసు సూపరింటెండెంట్ నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, పులివెందుల ఎస్‌డీపీవో బి. మురళి పర్యవేక్షణలో యూజీ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీరామ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఈ కేసును ఛేదించింది. సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అర్బన్ సీఐ శ్రీరామ్ వివరాలు వెల్లడించారు.

### వారం - వర్జ్యం

11-08-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె,
తి.చతుర్ధశి రా.1.54 న.పునర్వసు ఉ.10.10
వ.సా.5.27-సా.6.54
దు.1. ఉ.8.23-ఉ.9.14
దు.2. రా.11.40-రా.12.31
రాహు. మ.3.00-సా.4.30 శుభ లేదు.

### వార్తాఫలం

**మేషం :** వచ్చిన ఒక సదవకాశమును సద్వినియోగ పరచుకోగలిగితే మేలు జరుగుతుంది. మిత్రుల కలయిక.

**వృషభం :** విధుల నిర్వహణలో గానీ, వ్యాపారములో గానీ, మంచి మార్పులు చోటు చేసుకుంటాయి. ప్రయాణాలు లాభిస్తాయి.

**మిథునం :** రాజకీయములు, సంఘములు, యూనియన్లు మొదలగు కార్యములకు అనుకూలం. కాంట్రాక్టులు లభిస్తాయి.

**కర్కాటకం :** బంధువులతో కుటుంబ సభ్యులతో కలిసి దేవాలయ సందర్శన చేస్తారు. ఆర్థికంగా మెరుగుపడుతుంది.

**సింహం :** మీరు చేపట్టే కార్యక్రమములకు చిన్న, చిన్న ఆటంకములు, ఎదురు అవుతాయి. వాహనయోగం కలదు.

**కన్య :** మీ అభిప్రాయములను కొన్ని సలహాలను ఉన్నతాధికారులు సైతం పాటించడం మీకు సంతృప్తిని కలిగిస్తుంది.

**తుల :** గతములో మీరు పోగుట్టుకున్న ఉద్యోగమును తిరిగి పొందగలుగుతారు. ఆస్తి విషయంలో ఒప్పందాలు కుదురుతాయి.

**వృశ్చికం :** మీ అధికార పరిధి, ఆర్థిక స్థితిగతులు మంచి ఫలితములనిస్తాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**ధనుస్సు :** చిన్ననాటి స్నేహితులను, తండ్రి సమకాలికులను కలుసుకొనుట జరుగుతుంది స్వల్ప ధనలాభం పొందుతారు.

**మకరం :** అవకాశము ఉండీ సమాచారము అందని లోపము వలన ఆత్మీయులకు సాయపడలేనందుకు విచారిస్తారు.

**కుంభం :** సహోదర వర్గముతో ఏకత్వమును సాధించు యత్నములు ఓ దశకు చేరుకుంటాయి. రాజకీయ రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు.

**మీనం :** ముఖ్యమైన కార్యక్రమముల చర్చలు, అమలు చేయు పనులు వాయిదాపడతాయి. సోదరుల కలయిక.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## దేశాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సంకల్పం చేయాలి

### 'అనే నేను శీర్షికతో తమ సంకల్పాన్ని తెలుపుతూ పోస్టు చేయాలి'

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడిని భాగస్వామ్యం చేసే లక్ష్యంతో మన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనే నేను కార్యక్రమంలో రాష్ట్రంలోని ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని సమాచార పౌరసంబంధాల శాఖ డైరక్టర్ కె.ఎస్. విశ్వనాధన్ విజ్ఞప్తి చేశారు. భారతదేశ స్వాతంత్ర్యం లభించి 2047 నాటికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఆరోజు నాటికి వ్యక్తిగా తాము, తమ ప్రాంతం, దేశం ఏవిధంగా చెందాలని కోరుకుంటున్నారో తెలుపుతూ ప్రజలంతా సామాజిక మాధ్యమాలు వేదికగా తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. అదేవిధంగా తమ ప్రాంత, దేశ, రాష్ట్ర అభివృద్ధిలో తాను ఏవిధంగా భాగస్వామ్యం కావాలనుకుంటున్నారో తెలుపుతూ 'అనే నేను' శీర్షికతో సామాజిక మాధ్యమాల్లో పోస్టుల ద్వారా తమ సంకల్పాన్ని తెలియజేయాలని కోరారు. స్వాతంత్ర్య దినోత్సవంలోగా ప్రజలు స్వచ్ఛందంగా తమ అభిప్రాయాలను తెలుపుతూ తమ సామాజిక మాధ్యమ అకౌంట్ల ద్వారా తమ అభిప్రాయాలు తెలియజేయాలన్నారు. పౌరులు తమ అభిప్రాయాలను అధికారిక సైట్లకు పంపాలని యాష్టా టాగ్‌లకు జత చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేయాలని కోరారు.

## 'ఆ జిఒకు ఆ కథనానికి సంబంధం లేదు'

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఫార్చ్యూన్ ఇండియా పత్రికలో మంత్రి నారా లోకేశ్‌పై వ్యాసం కోసం రూ.కోటి పైగా ప్రభుత్వ ధనం ఖర్చు చేశారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ప్రభుత్వం స్పష్టం చేసింది. లోకేశ్‌పై తప్పుడు ప్రచారాన్ని ఖండించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న జీవోకు, ఫార్చ్యూన్ ఇండియా కథనానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. 18-1-2025న జారీ చేసిన జిఒ ప్రపంచ ఆర్థిక సదస్సులో ఎపి పెట్టుబడి అవకాశాల ప్రచారం కోసం ఇచ్చిందని, ఓ ఆంగ్ల ఛానల్‌కు చెల్లింపులు చేయాలని ఇచ్చిన ప్రభుత్వ ఆదేశాలే ఆ జిఒలో ఉన్నాయని ఎపి సర్కార్ వెల్లడించింది. ఫార్చ్యూన్ ఇండియా, సిఎన్‌బిసి, టివి రెండు వేర్వేరు సంస్థలని, రెండింటికీ ఎలాంటి సంబంధం లేదని సర్కార్ వివరణ ఇచ్చింది. జిఒను వక్రీకరించి మంత్రి నారా లోకేశ్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. ప్రజలకు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం అందించడం నేరమని హెచ్చరించింది. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక జారీ చేసింది. తప్పుడు పోస్టులను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్న వారిపైనా చట్టపరమైన చర్యలు తప్పవని ఎపి ప్రభుత్వం స్పష్టీకరించింది.

## డిసిపి కుమార్తె మృతిపై సిఎం, డి.సిఎం సంతాపం

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రోడ్డు ప్రమాదంలో విజయవాడ డిసిపి షరీన్ బేగం కుమార్తె మృతిపై సిఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. షరీన్ బేగం కుమార్తె అసిఫా మృతిచెందడం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. 'అసిఫా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. చిన్న వయస్సులోనే ప్రమాదం బారినపడి దూరమవడం బాధాకరం. ఆసిఫా ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా' అని ఎక్స్ వేదికగా సిఎం స్పందించారు. షరీన్‌బేగం కుమార్తె మృతి పట్ల డి.సిఎం పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. ఇది తీరని వ్యథ అని, షరీన్ బేగం నిబ్బరంగా ఉండాలన్నారు. పలువురు డిసిపిలు, ఎడిసిపిలు, ఎసిపిలు, సిఐలు, ఎస్ఐలు ఇతర సిబ్బంది న్యూరాజ రాజేశ్వరీపేటలోని షిరీన్‌బేగం ఇంటికి వచ్చి ఆమెను పరామర్శించారు. డిజిపి హరీష్‌కుమార్‌గుప్తా ఇతర పోలీసు ఉన్నతాధికారులు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు డిసిపి షిరీన్ బేగంను పరామర్శించి ఆసిఫాకు నివాళి అర్పించారు.

## 17 నుండి అసెంబ్లీ

### - సమావేశాల నిర్వహణపై నోటిఫికేషన్

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈనెల 17వ తేది నుండి జరగనున్నాయి. ఈమేరకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు సంబంధించిన నోటిఫికేషన్ ఉత్వర్వులు జారీ చేశారు. 17వ తేదీ ఉ.9గం.లకు అసెంబ్లీ భవనంలోని అసెంబ్లీ హాల్లో శాసన సభ సమావేశాలు ప్రారంభం అవుతాయి. అదే రోజు శాసన మండలి సమావేశాలు అసెంబ్లీ భవనంలోని కౌన్సిల్ హాల్లో శాసన మండలి సమావేశాలు ప్రారంభవుమతాయని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.




# 'తల్లీబిడ్డ 'ఎక్స్‌ప్రెస్' వాహనాల్లో అత్యాధునిక భద్రతా సదుపాయాలు

### ● '102' వాహనాల్లో ఎయిర్ బ్యాగులు ● సీట్ బెల్టులు, ఫుట్‌రెస్టులు సౌకర్యాల కల్పన - తొలిదశలో 300 అధునాతన వాహనాల రెడీ ● మిగిలిన 200 వాహనాలు త్వరలో సిద్ధం ● వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** తల్లీబిడ్డల సురక్షిత ప్రయాణానికి '102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాల సేవలకు ప్రభుత్వం కొత్త రూపునిస్తోంది. దేశంలోనే తొలిసారిగా తల్లీ బిడ్డల భద్రత, ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక వాహనాలను కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈ మేరకు వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడొక ప్రకటన జారీ చేశారు. ముఖ్య మంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రూపు రేఖలు, బ్రాండింగ్‌ను ఖరారు చేశారు. తల్లులు, నవజాత శిశువులు సులభంగా ఎక్కడం, దిగడం, ప్రయాణంలో భద్రత, అవసరమైన సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని వాహనాలు రూపొందిస్తున్నారు. ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లే సమయంలో తల్లి, శిశువులకు ఎదురయ్యే రవాణా సమస్యను తొలగించడం, ప్రసవానంతర సంరక్షణను మెరుగుపరచడం, అధిక ప్రమాద (హైరిస్క్) గర్భిణులకు అవసరమైన సమయంలో రవాణా అందించడం ద్వారా మాతా, శిశు మరణాలను తగ్గించడమే ఈ సేవల ప్రధాన లక్ష్యం. కొత్త వాహనాల ప్రారంభ కార్యక్రమం ఆగస్టు 11న నరసరావుపేటలో జరగనుంది. మంత్రి సత్యకుమార్ యాదవ్ నూతన వాహన సేవలను ప్రారంభించనున్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి అనుగుణంగా జిల్లాల్లోనూ కొత్త వాహనాల సేవలు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలకు గర్భిణులకు మాత్రమే సేవలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. ఈ మాతా శిశు మరణాలు తగ్గించేందుకు ఈ సేవలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

**ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవించిన వారికి మాత్రమే ఉచిత వాహన సదుపాయం:** రాష్ట్రవ్యాప్తంగా '102' (తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు) సేవల్ని ఆధునిక విధానం మరింత విస్తరించేందుకు ప్రభుత్వం మొత్తం 500 వాహనాలను సమకూర్చుతోంది. తొలిదశలో 300 వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. మిగిలిన 200 వాహనాలను త్వరలో అందుబాటులోకి రానున్నాయి. సదరు జిల్లాల్లో ప్రసవాల ఆధారంగా ఈ వాహనాలు కేటాయించారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవించిన తల్లి, నవజాత శిశువును ఆసుపత్రి నుంచి ఇంటికి చేర్చే డ్రాప్‌బ్యాక్ సేవ పూర్తిగా ఉచితం. తల్లితో పాటు ఇద్దరు సహాయకులు కూడా ప్రయాణించవచ్చు. అధిక ప్రమాద గర్భిణులు, తీవ్ర రక్తహీనతతో రక్తమార్పిడి అవసరమైన గర్భిణులకు ప్రత్యేక పికప్, డ్రాప్‌బ్యాక్ సేవలు అందిస్తారు. 2025-26లో '102' సేవల ద్వారా 2,05,914 ప్రయాణాలు నిర్వహించారు. ఇందులో 1,65,093 ప్రసవానంతర డ్రాప్ బ్యాక్ ప్రయాణాలు, 40,821 హైరిస్క్ గర్భిణుల రవాణా సేవలు ఉన్నాయి. వీటి నిర్వహణ బాధ్యతలను విద్యవేద ఫౌండేషన్ అండ్ మెసర్స్ శ్రీనివాస టూర్స్ అండ్ ట్రావెల్స్‌కు తాజాగా ప్రభుత్వం అప్పగించింది. ఈ సంస్థనే సొంత వాహనాలను నడుపుతోంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో 102సేవల కోసం ప్రభుత్వం రూ.37.40 కోట్ల ప్రతిపాదిత బడ్జెట్‌ను కేటాయించింది.

**భద్రతకు అధునాతన ఫీచర్లు:** కొత్త వాహనాలు ఎయిర్ కండిషన్డ్ ఎస్‌యువి/ ఎంయువి తరహాలో ఉంటాయి. గర్భిణులు, బాలింతలు సులభంగా ఎక్కేందుకు ప్రత్యేక ఫుట్‌రెస్టులు, లోపల పట్టుకునేందుకు హ్యాండ్‌రెయిల్స్ ఏర్పాటు చేశారు. దురదృష్టవశాత్తు జరిగే రోడ్డు ప్రమాదాల్లో రక్షణగా ఉండేందుకు వాహనాల పక్కల కలిపి ఆరు ఎయిర్ బ్యాగులు ఉన్నాయి. వెనుక సీట్లకు సీట్‌బెల్టులు, రివర్స్ పార్కింగ్ సెన్సార్లు, చైల్డ్ లాక్ స్లైడింగ్ డోర్లు, ఎబిఎస్, ఇబిడి, ఇఎస్‌పి, 80కి.మీ. వేగం దాటితే హెచ్చరించే స్పీడ్ అలర్ట్, అగ్నిమాపక పరికరాలు ఉన్నాయి. వాహనాల్లో ఉష్ణోగ్రత నియంత్రణతో ఎసి ఉంటుంది. నవజాత శిశువుకు అనుకూలమైన ఉష్ణోగ్రతఉండేలా దీనిని రూపొందించారు.

**అత్యవసరమైతే.. ఎస్ఓఎస్:** గర్భిణి కూర్చున్న సీటు వద్దే ఎమర్జెన్సీ ఎస్ఓఎస్ బటన్ ఏర్పాటు చేశారు. నొక్కగానే 102 కాల్‌సెంటర్‌కు సమాచారం చేరుతుంది. వాహనం ఉన్న ప్రదేశాన్ని లైవ్ జిపిఎస్ ద్వారా కంట్రోల్ సెంటర్‌కు పంపే వీలుంది. అవసరమైతే సమీప ఆరోగ్య కేంద్రాలతో సమన్వయం చేసి వైద్య సహాయం అందిస్తారు. వాహనాల్లో ఏఐఎస్- 140 ప్రమాణాలకు అనుగుణమైన జిపిఎస్/ విఎల్‌టిడి ట్రాకింగ్ వ్యవస్థ ఉంటుంది. జిపిఎస్‌తో పాటు భారత ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ నావిక్ ద్వారా ద్వంద్వ ఉపగ్రహ కవరేజీ లభిస్తుంది. డ్యూయల్ సిమ్ 4జీ, నెట్‌వర్క్ లేని సమయంలో సమాచారాన్ని నిల్వచేసే ఆఫ్‌లైన్ డేటా సదుపాయం, బ్యాకప్‌బ్యాటరీ ఏర్పాటు చేశారు.

**ప్రయాణంలోనే ఆరోగ్య సూచనలు:** ప్రయాణంలో ఫోన్ ఛార్జ్ చేసుకునేందుకు మొబైల్ ఛార్జింగ్ పోర్టులు, హ్యాండ్ శానిటైజర్, టిష్యూ పేపర్, స్టెయిన్‌లెస్ స్టీల్ డస్ట్‌బిన్, ఫస్ట్‌ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచారు. ప్రత్యేక ఇంటిగ్రేటెడ్ ఆడియో వ్యవస్థ ద్వారా ప్రసవానంతర సంరక్షణ, నవజాత శిశు సంరక్షణ, తల్లిపాలు, శిశువుల పోషణ, టీకాలు, ప్రమాద సంకేతాలు, ఆరోగ్య జాగ్రత్తలపై ప్రభుత్వ సూచనలు వినిపిస్తాయి. డ్రైవర్ యాప్ మ్యాపింగ్, కాల్‌సెంటర్ అనుసంధానం, ఆర్‌సీహెచ్ ధ్రువీకరణలను ఐటీ వ్యవస్థలోకి తీసుకొచ్చారు. జిపిఎస్ ద్వారా వాహనం ఎక్కడ ఉందో తెలుసుకుని, అందుబాటులో ఉన్న వాహనాన్ని అవసరమైన చోటుకు కేటాయించడం, ప్రయాణాన్ని పర్యవేక్షించడం సులభమవుతుంది. రాష్ట్రంలోని ఏ ఫోన్ నుంచైనా టోల్‌ఫ్రీ 102ను సంప్రదించవచ్చు.

## పోలవరం ప్రాజెక్టు తొలిదశ మరో యేడాది పాటు పొడిగింపు

### ● రాజ్యసభలో కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి వెల్లడి



**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టు తొలిదశను మరో ఏడాది పాటు పొడిగించినట్లు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తొలిదశలో 41.15 మీటర్ల వరకు నీటిని నిల్వ చేసేందుకు వీలుందని 2023 ధరల ప్రకారం దీని అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లు కాగా, అందులో రూ.12,157.53 కోట్లు కేంద్రం గ్రాంటుగా వెల్లడించింది. అలాగే 2021-22 నుంచి 2025-26 వరకు ప్రాజెక్టుకు రూ.12,620.53 కోట్లు విడుదల చేసినట్లు కేంద్రం పేర్కొంది. నిర్మాణ పురోగతి విషయానికి వస్తే, స్పిల్‌వే మట్టి పనులు 96.8శాతం, కాంక్రీట్ పనులు 98.8శాతం, స్టీల్ పనులు 92.9శాతం పూర్తయ్యాయి. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ మట్టి పనులు 75.5శాతం, కాంక్రీట్ పనులు 81.9శాతం, స్టీల్ పనులు 81.3శాతం కాగా, ప్రధాన కాలువల మట్టి పనులు 98.9 శాతం, కాంక్రీట్ పనులు 88.4శాతం, స్టీల్ పనులు 55.6 శాతం పూర్తయ్యాయి. మొత్తం ప్రాజెక్టు వల్ల 96,660 మంది నిర్వాసితులు అవుతుండగా తొలిదశ నీటి నిల్వ కారణంగా ముంపునకు గురయ్యే 17,892 మందిని ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ సహాయ పునరావాస చర్యల కోసం ఇప్పటివరకు రూ.1,373.01 కోట్లు ఖర్చు చేయగా, మొదటి దశ పునరావాసం పూర్తి చేయడానికి మరో రూ.1,581.08 కోట్లు అవసరమవుతాయని కేంద్రం స్పష్టం చేసింది. ఇక తాజా నిర్ణయంతో పోలవరం ప్రాజెక్ట్ 2027 మార్చినాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.




## కేంద్ర మంత్రి అమిత్ షాతో టిడిపి ఎంపిలు భేటీ

విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో సోమవారం టిడిపి ఎంపిల బృందం మర్యాదపూర్వకంగా కలిసారు. లోక్‌సభ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బైరెడ్డి శబరి, బికె పార్థసారథి, తెన్నేటి కృష్ణప్రసాద్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్, చింతకాయల విజయ్, ఇతర ఎంపిలు అమిత్‌షాను కలిసారు. ఎపి రాజధాని అమరావతివిజన్, అభివృద్ధి పురోగతి, భవిష్యత్తు ప్రాధాన్యతను కళ్లకు కట్టేలా వివరించే ప్రత్యేక పుస్తకాన్ని కేంద్ర మంత్రికి ఎంపిలు అందజేసారు. అమరావతి గొప్పతనాన్ని వివరించేలా రూపొందించిన పుస్తకాన్ని ఎంపిల చొరవపై అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రాష్ట్రాభివృద్ధికి మరింత సహకరించాలని ఎంపిలు అమిత్‌షాను అభ్యర్థించారు.

# రాజధాని అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డు రెడీ

### ● 13న సిఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం ● ప్రజాప్రతినిధుల నివాసాల టవర్లు అందుబాటులోకి



**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి చేరుకోవడానికి కీలకమైన రాదారుల్లో ఒకటిగా ఉన్న సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం పూర్తయింది. ఈ నెల 13న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా సీడ్ యాక్సెస్ రోడ్డుతో పాటు ప్రజాప్రతినిధుల టవర్లు ప్రారంభం ప్రారంభించనున్నారు. దీంతో ఈ కార్యక్రమానికి సీఆర్డీఏ అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేశారు. విజయవాడ-మంగళగిరి రహదారిని సీడ్ యాక్సెస్ రోడ్డుతో అనుసంధానించేందుకు బకింగ్‌హాం కెనాల్, గుంటూరు ఛానల్లపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలను ముఖ్యమంత్రి మొదట ప్రారంభిస్తారు. అక్కడి నుంచి సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అపార్ట్‌మెంట్ టవర్ల వద్దకు చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 6 ఎమ్మెల్యే టవర్లు, 3 ఎమ్మెల్సీ టవర్లలో మొత్తం 207 అత్యాధునిక ఫ్లాట్లు సిద్ధం చేశారు. వాటి తాళాలను సిఆర్‌డిఎ అధికారులు సీఎంకు అందజేస్తారు. ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ వర్షాకాల సమావేశాల సమయంలో ప్రజాప్రతినిధులకు ఈ ఫ్లాట్లను కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం దొండపాడు నుంచి విజయవాడ - మంగళగిరి రోడ్డు వరకు 18.270 కిలోమీటర్ల మేర 9 వరుసల రహదారిగా సీడ్ యాక్సెస్ రోడ్డును తీర్చిదిద్దుతున్నారు. రాజధానిలో ఉత్తరం నుంచి దక్షిణానికి నిర్మిస్తున్న ప్రతి రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డుతో అనుసంధానమవుతాయి. దీన్ని తొమ్మిది వరుసల రహదారిగా నిర్మించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఈ రహదారిని మణిపాల్ ఆసుపత్రి వరకు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడమే కాకుండా రాజధానిలో ఉత్తర - దక్షిణ రహదారులన్నింటినీ దీనికి అనుసంధానిస్తున్నారు. అత్యాధునిక మౌలిక వసతులతో రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టులు ప్రజలకు వేగవంతమైన పరిపాలనను చేరవేసేందుకు దోహదపడతాయి.

# లండన్‌లో పురపాలక శాఖ మంత్రి నారాయణ

### అమరావతి ఐకానిక్ భవనాల తుది డిజైన్లపై కీలక చర్చలు



**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మించనున్న ఐకానిక్ భవనాల తుది డిజైన్లపై స్పష్టతనిచ్చేందుకు ఎపి పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం లండన్‌లో పర్యటిస్తోంది. లండన్‌లోని 'ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్' కార్యాలయాన్ని సందర్శించింది. అమరావతి రాజధానిలో నిర్మించబోయే ఐకానిక్ భవనాల డిజైన్లను గతంలో ఈ సంస్థే రూపొందించింది.

ఈ పర్యటనలో భాగంగా ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్, హఫీజ్ కాంట్రాక్టర్స్, ఎల్అండ్‌టి ప్రతినిధులతో మంత్రి నారాయణ బృందం సుదీర్ఘంగా సమావేశమై, ఐకానిక్ భవనాల నిర్మాణ పురోగతిపై చర్చించింది. ముఖ్యంగా అమరావతి అసెంబ్లీ భవనంపై ప్రతిపాదించిన అత్యంత ఎత్తైన టవర్ నిర్మాణం గురించి ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. ఈ టవర్‌ను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించే అంశంపై ఎల్అండ్‌టి సంస్థ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చింది. భవనాల వెలుపలి డిజైన్లలో మార్పులు, చేర్పులపై నార్మన్ ఫోస్టర్ ప్రతినిధులు పలు కీలక సూచనలు చేశారు. మంత్రి నారాయణతో పాటు సిఆర్‌డిఎ కమిషనర్ విజయరామరాజు, అడిషనల్ కమిషనర్ అభిషేక్ కుమార్, చీఫ్ ఇంజినీర్లు ఈ లండన్ పర్యటనలో పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం అల్పపీడనంగా ఏర్పడే అవకాశం

### ● మూడు రోజుల పాటు వానలు కురిసే అవకాశం

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** వాయువ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాలపై ఉన్న ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో బుధవారం నాటికి అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు. ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్క జల్లు వానల నుంచి మోస్తరు వర్షాలు పడుతున్నాయి. ఈదురుగాలులు కొన్ని ప్రాంతాల్లో వీస్తున్నాయి. సోమవారం సాయంత్రం 5గంటల నాటికి అనకాపల్లి జిల్లా పరవాడలో 37.5మిమీ, విజయనగరం జిల్లా వేపాడలో 32.9మిమీ, అనకాపల్లి జిల్లా సాలపువానిపాలెంలో 32మిమీ, కొప్పాకలో 27.7మిమీ చొప్పున వర్షపాతం నమోదైందన్నారు. మంగళవారం విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, శ్రీసత్యసాయి, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అలాగే మిగతా జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని సూచించారు. వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ వీలైనంత దూరంగా ఉండాలన్నారు.

# గిరిజన సంస్కృతి పరిరక్షణతో పాటు విద్య, ఉపాధికి సమప్రాధాన్యత

### ● గిరిజన కళలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడమే లక్ష్యం ● గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం. మల్లిఖార్జున నాయక్

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు, కళలు, నృత్య రీతులను పరిరక్షించడంతో పాటు గిరిజన విద్యార్థులు విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించేలా రాష్ట్ర ప్రభుత్వం సమప్రాధాన్యత ఇస్తోందని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం. మల్లిఖార్జున నాయక్ తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో గిరిజన సంక్షేమ శాఖ, గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ మిషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం 2026లో భాగంగా రెండో రోజు ట్రైబల్ డాన్స్ ఫెస్టివల్, ఆర్ట్ ఎగ్జిబిషన్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన కళాకారులు తమ సంప్రదాయ నృత్యాలు, కళారూపాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.మల్లిఖార్జున నాయక్ జ్యోతి ప్రజ్వలన చేసారు. అనంతరం మాట్లాడుతూ గిరిజన సంస్కృతిని కాపాడుకుంటూనే ఆధునిక విద్యను అభ్యసించడం ద్వారా గిరిజనుల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు నాణ్యమైన విద్యను అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. థింసా నృత్యానికి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడంలో గిరిజన సంక్షేమ శాఖ చేసిన కృషిని ఆయన అభినందించారు.



ట్రైబల్ డాన్స్ ఫెస్టివల్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం. మల్లిఖార్జున నాయక్

మిగిలిన గిరిజన నృత్యాలు, కళారూపాలు, కళాకారులకు కూడా అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావడానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్ డైరెక్టర్ డా. మందారాణి స్వాగత ఉపన్యాసం చేస్తూ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (మైసూర్) భాగస్వామ్యంతో ఆరు గిరిజన భాషల్లో ప్రైమర్లు, నిఘంటువులను ఈమాడ్యూల్స్ రూపంలో రూపొందిస్తున్నామని తెలిపారు. సికిల్ సెల్ వ్యాధిపై గిరిజన భాషల్లో అవగాహన మాడ్యూల్స్ రూపొందించి ఐటిడిఎలకు అందించామని చెప్పారు. టెర్రకోట, క్లే మోడలింగ్, వెదురు ఉత్పత్తులు, పూసల తయారీ తదితర రంగాల్లో గిరిజనులకు ఉపాధి శిక్షణలు అందిస్తున్నామని తెలిపారు. గురుకులాల కార్యదర్శి గౌతమి మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, కళలు వారి జీవన విధానంలో అంతర్భాగంగా ఉన్నాయని అన్నారు. వారి ఉజ్వల భవిష్యత్తుకు విద్యే అత్యంత శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకులాల్లో చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్. భార్గవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గొప్ప పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. థింసా, కొమ్ముకోయ, సవర ఆర్ట్, చెంచు చెంచాట, తప్పెటగుళ్లు, లంబాడీ తదితర గిరిజన కళారూపాలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. యోగా తరహాలో గిరిజన నృత్యాలను కూడా పాఠశాల విద్యలో ఒక భాగంగా చేర్చి భావితరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. యానాది, నక్కల, చెంచు వంటి ప్రత్యేక గిరిజన తెగల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎసి సభ్యులు రావుల కొండలు, ఎస్టీ సెల్ నాయకులు ధారూ నాయక్, ట్రైకార్ ఎండి మణికుమార్, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ట్రైబల్ రీసెర్చ్ మిషన్ అధికారులు, గిరిజన కళాకారులు, విద్యార్థులు, కళాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## 'సూపర్‌సిక్స్ హామీలను అమలు చేసాం'

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త:** గత ఎన్నికల్లో కూటమిపార్టీలు ప్రకటించిన సూపర్‌సిక్స్ హామీలను సమర్ధవంతంగా అమలు చేసామని స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం తెలిపారు. విజయవాడలోని 13వడివిజన్‌లో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి సోమవారం రెండేళ్ళ నమ్మకం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రెండేళ్ళ అభివృద్ధిపై రూపొందించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసారు. ఈసందర్భంగా పట్టాభి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని తెలిపారు. టిడిపిని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీకోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో ముమ్మినేని ప్రసాద్, టిడిపి నాయకులు గద్దె ప్రసాద్, చలసాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

VIJAYAWADA MUNICIPAL CORPORATION
'E' Procurement Notice No.18/VMC/CDB/2026-27, Dt.10-08-2026
Roads, Drain, repairs, Monsoon works, maintenance works
(Total 151 works)-Est. Amount Rs.1990.71 Lakhs.
All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of
Further details and any corrigendum can be seen @www.tender.apeprocurement.gov.in.
S/d- For COMMISSIONER

11-8pg4_11-8pg4.qxd 10/Aug/26 10:33 PM Page 1



వార్త


పుస్తకాలు చదవాలనే అభిలాష ఉన్నవారు ఎక్కడ ఉన్నా సుఖంగా ఉంటారు.

న- ఆస్కార్‌వైల్డ్

# మలి ప్రస్థానంలో 'జెన్‌జి'


ఒకటోసారి అనూహ్య విజయం. రెండోసారీ 'జెన్‌జీ'కి తలొగ్గక తప్పలేదు. యువత ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఎవరైనా దిగిరావాల్సిందే. నిన్నమొన్నటి జెఎన్‌జి విజయం మరింత ముందుకు అడుగులు వేసే స్థాయికి యువతను ప్రేరేపిస్తోంది. ఆఫ్టరాల్ 'జెన్‌జి' అంటూ పెదవి విరిచిన వారంతా వామ్మో! అని గొప్పగా చెప్పుకుంటున్నారు. జెన్‌జిని ఇగ్నోర్ చేయలేమని వాళ్ల ఉద్యమం దెబ్బకు రాజీనామా సమర్పించిన నాటి కేంద్రవిద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అంటున్నారు. 'జెన్‌జి' ఉద్యమం విషయంలో తొలుత కేంద్రప్రభుత్వ పెద్దలు మాత్రమే అంచనా వేయలేక అదెంత? అనుకుంటూ కాలయాపన చేసి 'జెన్‌జీ'కి ఓ స్పష్టమైన రూపం బహిర్గతమవడానికి కారణమయ్యారు. తాజాగా ఆర్‌ఎస్‌ఎస్ అధినేత, ప్రధాని మోడీ, మరెందరో ప్రముఖులు జెన్‌జి సత్తాను ఎత్తిపడేస్తున్నారు. దేశ సమగ్ర అభివృద్ధి సాధనలోయువత బాధ్యులుకావాలని ప్రధాని నరేంద్రమోడీ కాక్రోచ్‌ల ఉద్యమానంతరం వాటి గురించి బహిరంగంగా విద్యార్థుల్ని ఉద్దేశించి మాట్లాడడం ఇదే ప్రథమం. ఐఐటి ఢిల్లీ 57వ వార్షికోత్సవ సభలో ప్రధాని మాట్లాడుతున్నారంటే యువత కేరింతలు కొట్టారు. యువత కాలేజీల్లోంచి బయటకు వెళ్తున్నారంటే వారు ఎదురు చూసేది తొలి జాబ్ ఆఫర్ కోసం. అందుకోబోతున్న మొదటి నెల జీతం కోసమేనన్నారు. దాదాపు ప్రపంచమంతా జెన్‌జి ఉద్యమాలతో సతమతమవుతుంటే భారత్ మాత్రం యువతను ఆ మధ్య పెద్దగా పట్టించుకున్నట్లు కనపడలేదు. తీరా ఇప్పుడు పట్టించుకోక తప్పలేదు. వికసిత్ భారత్ సాధనలో జెన్‌జీ తరం అవసరం ఎక్కువగా ఉందని ప్రధాని అభిప్రాయపడ్డారు. యువత అధికంగా వినియోగించే సోషల్ మీడియా యాప్ 'స్నాప్ చాట్' తాజాగా తన అధికారిక చానల్‌ను ప్రారంభించేందుకు కేంద్ర విదేశాంగ శాఖ ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇదే అదనుగా ఇందిరా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అధికార ఎన్‌డిఎ ప్రభుత్వాన్నుద్దేశించి ఒక రాగాలాపన చేశారు. దేశంలో విద్యాప్రమాణాలు పడిపోవడమే కాకుండా యువతలో నైరాశ్యంలో మునిగిపోయిందని ప్రయాగ రాజ్ కెపి గ్రౌండ్స్‌లో జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. యువతకు సామర్థ్యాలున్నా ఉద్యోగావకాశాల్లేవని ఎత్తి చూపారు. ఇప్పుడు 'జెన్‌జి' విజృంభిస్తున్నది కేవలం కేంద్రప్రభుత్వ వ్యవహారశైలి మీదనే కాదు, జార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా ఆ రాష్ట్ర అసెంబ్లీని ముట్టడించారు. నిరసనల సమయంలో పెల్లెట్‌గన్ కాల్పుల, లాఠీచార్జిని ఎదుర్కొన్న ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నేహాబోరా మీద ఓ అంగతకుడు సిరా జల్లి దుర్భాషలు మాట్లాడడం అక్కడ ఉద్రిక్తతలకు దారితీసింది. అదంతా ఉద్యమాన్ని బలహీన పరిచేందుకు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు డ్రామా ఆడుతున్నాయని విమర్శలు వెల్లువెత్తాయి. జెపిఎస్‌సి పరీక్షను రద్దు చేయడమొక్కటే జార్ఖండ్ యువత కోరుకున్నారు. అది కూడా దాదాపు సాధించినట్లే. పేపరు లీక్‌పై విద్యార్థులు చేస్తున్న ఆందోళనపై జార్ఖండ్ సర్కార్ దిగి వచ్చింది. అయినా విద్యార్థుల ఆందోళన ఆగలేదు. సోమవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చి విజయవంతంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ వద్ద ఉద్రికత్త మొదలైంది. ప్రభుత్వం కొన్ని అంశాల్లో తలొగ్గినా జార్ఖండ్ విద్యార్థులు పట్టువదల్లేదు. జెపిఎస్‌సి, జెఎస్‌ఎస్‌సి జడ్ పరీక్షల రద్దుకు ప్రభుత్వం అంగీకరించింది. ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరగడంతో తమ భవిష్యత్ నాశనమౌతోందని విద్యార్థుల ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో యువత కాక్రోచ్ పార్టీ నేతృత్వంలో ఆందోళన చేపట్టింది. అందులో పాల్గొన్న వారంతా యువత కనుక జెన్‌జి ఉద్యమంగా పిలువబడుతోంది. ఎంతో క్రమశిక్షణతో జరిగిన ఆ ఉద్యమం ప్రజల మన్ననలనూ అందుకుంది. రాజకీయులు ఆ ఉద్యమానికి రాజకీయ రంగు పులమాలని చూసినా ఎక్కడా ప్రత్యర్థులకు ఆ అవకాశం చిక్కనీయకుండా జాగ్రత్తపడ్డారు. యువత మలి అడుగు జార్ఖండ్ ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెంట పడింది. ఎలా అయినా ఈ ఉద్యమానికి మచ్చి ఊపుతేవాలని యువజనులంతా తాపత్రయపడ్డారు. జార్ఖండ్‌లో కూడా యువత ఆగ్రహావేశాలు తెంచుకున్నప్పుడు విద్యార్థి నేత దేవేంద్ర మహాతోవారిని అదుపులో ఉంచి పోలీసులతో వాగ్వివాదానికి దిగొద్దని సూచించారు. ఇలాంటి ఉద్యమాల్లో ఎవరూ ఒక మాట మీద నిలబడే అవకాశం ఉండదు. అయినా క్రమశిక్షణగా మెలగడమే విశేషం. రాష్ట్రంలోని ఎన్నో జిల్లాల నుంచి రైళ్ల, బస్సులు, తదితర వాహనాల్లో అసెంబ్లీకి బయలుదేరారు. ఉద్యమాన్ని రక్తి కట్టించారు. పోలీసులు కూడా అసెంబ్లీలోకి ప్రవేశించబోయిన విద్యార్థులపై వాటర్ క్యాన్లు ఉపయోగించారు. బారికేడ్‌లు దాటి వచ్చిన విద్యార్థులను అదుపు చేయడం ఎంతోకష్టమైంది. నియామక ప్రక్రియలో సంస్కరణలు అవసరమని ముక్తకంఠంతో ఎలుగెత్తారు. క్రిమినల్ అంశాలను రాష్ట్ర సిఐడి దర్యాప్తుచేస్తుందని, 2023, 25బ్యాక్‌లాగ్ నియామకాలు అక్రమాల్లో దర్యాప్తు చేస్తామని అంగీకరించారు. ఢిల్లీలో యువత ఆందోళన తర్వాత వివిధ రాజకీయ పార్టీలు వారిని నడిపించే పార్టీలు సైతంయువత ఉద్యమాలపై తమతమఅభిప్రాయాలు మార్చుకున్నాయి. యువతను దేశ నిర్మాణ సాధ నాలుగా మార్చుకోవాలని ఆర్.ఎస్.ఎస్ చీఫ్ డా.మోహన్ భగవత్ పిలుపునిచ్చారు. యువత ప్రశ్నించడాన్ని తప్పుపట్టలేమని, వారి ఆలోచనలను తొక్కి పారేయడం కన్నా దేశాభివృద్ధిలో భాగస్వాములుగా చేయాలని సందేశం సారాంశం.

చదరంగంలో మాదిరిగానే జీవితంలో కూడా ముందు చూపు ఎంతో అవసరం.



వి.జాన్సన్

దురలవాట్లు మొదట్లో సాలెగూళ్ల లాంటివి. తర్వాత అవి ఇనుప గొలుసులై మిమ్మల్ని బంధిస్తాయి.



హెచ్. లాంగ్‌ఫెలో

## ప్రజావాక్కు

### పెరుగుతున్న మందుబాబుల ఆగడాలు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం ప్రియుల ఆగడాలు శృతి మించి పోతూవున్నాయి. బహిరంగ మద్యపానం చేస్తే చర్యలుతప్పవు. ఎవరూ ఆరుబయట ప్రదేశాల్లో తాగొద్దు. మద్యంమత్తులో వాహనాలు నడపొద్దనిఅధికారులుహెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా, క్షేత్రస్థాయిలో ఎలాంటి ఫలితం కనిపించడం లేదు. దీనికితోడు అధికారుల తనిఖీలు అంతంత మాత్రమే. దీంతో మందుబాబులకు పూర్తిస్వేచ్ఛ లభించినట్లయింది. కాస్త చీకటిపడితే జనావాసాల్లోనే మద్యం తాగుతున్నారు. జనసంచారం తక్కువగా ఉండే ప్రదేశాల్లో అయితే ఇక చెప్పనక్కర్లేదు. మద్యం మత్తులో ఏం చేస్తున్నామో తెలియక మందుబాబులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా రహదారులను సైతం అడ్డాగా మార్చుకొని మరీతాగుతున్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో రాత్రి పూట తాగి సీసాలు పగుల గొట్టి, మలమూత్ర విసర్జనచేస్తూ అటు పాటశాలల వాతావరణం కలుషితం చేస్తూ వున్నారు. గది, కిటికీ అద్దాలు పగుల గొట్టడం వస్తువులను దొంగిలిస్తున్నారు.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

### వయిలెంట్‌గా మారుతున్న పిల్లలు

అక్రమ సంబంధాలు పెట్టుకుని భర్తలనుభార్యలు, భార్యలను భర్తలు అంతమొందిస్తున్నారు. కడుపున పుట్టిన పిల్లలు అడ్డుగా ఉన్నారనుకుంటే వారినీ కిరాతకంగా హతమారుస్తున్నారు. కన్నకూతుళ్లపైనే తండ్రులు అత్యాచారాలు చేస్తున్నారు. బాల్యం నుంచే పిల్లలు వాయిలెంట్‌గా ఉంటూ సమాజాన్ని హడలెత్తిస్తున్నారు. కుటుంబ సభ్యుల మధ్య సఖ్యత ఉండటం లేదు. ఆస్తి కోసం డబ్బుల కోసం కలహించుకుంటున్నారు. ఒకర్నొకరు మోసగించుకుంటున్నారు. స్నేహితులు కూడా ఇలానే ఉంటున్నారు. స్వార్థబుద్ధితో ప్రవర్తిస్తారని, దుష్ట ఆలోచనలతో ఉంటారని వీర బ్రహ్మేంద్రే స్వామి ఎప్పుడో చెప్పారు.

- మిథునం, హైదరాబాద్

### సైబర్ నేరగాళ్ళ పట్ల జాగ్రత్త

సైబర్ నేరగాళ్ల రోజుకో కొత్తరకం మోసాలకు పాల్పడుతూ అమాయక ప్రజలు అయిన రైతులు, ఉద్యోగులు, వృద్ధులే లక్ష్యంగా చేసుకుని భయబ్రాంతులకు గురిచేస్తు న్నారు. తెలియని వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉంటూ మీ వ్యక్తిగత వివరాలు ఎవరికి కూడా చెప్పరాదు. అపరిచి తుల వ్యక్తుల పట్ల జాగ్రత్త వహించండి.

### ఇదెక్కడి విచిత్రం

రిజిస్టర్ చేద్దామని పోస్టాఫీసుకు వెళ్తే , డబ్బులు వద్దు ఫోన్ పే చేయండి అని పోస్టల్ వాళ్ళు చెప్తున్నారు. మోడీ వచ్చిన తరువాత రకరకాలుగా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. కేంద్రం తిక్కతిక్క వేషాలు వేస్తుంది. ఇంతకు ముందు రిజిస్టర్‌కు 26 రూపాయలు తీసుకునేవారు. ఇప్పుడది ఎత్తేసి మినిమం 55 రూపాయలు చేశారు. 150 కోట్ల జనాభాలో ఫోన్లు ఉపయోగించుకునేది ఎంతమంది? వారిలో ఫోన్ పే ఎంత మందికి తెలుసు? చదువుకున్నవారిలోనే చాలామందికి అదేంటో తెలియదు. డబ్బులు ఇస్తామంటే కాదు ..ఫోన్ పే చెయ్యాలి అనిచెప్పడం వెనుక ప్రైవేట్ కొరియర్ సర్వీస్‌ను ప్రోత్సహించటమా అనుమానంగా ఉంది. కొన్నిటికి రిజిస్టర్ చెయ్యాలంటే పోస్టల్ స్టాంపులు తీసుకోండి అంటున్నారు. గగతంలో ఇలా లేదు. డబ్బులు తీసుకొని వాళ్లే వేసేవారు. రైల్వే వాళ్ళు కూడా ఈ మధ్య టికెట్ ఇవ్వమంటే ఎదురుగా ప్రైవేట్ వాళ్ళదగ్గరకు వెళ్ళండి అని అంటున్నారు. ఇలాంటి వాటిని గట్టిగా ఎదుర్కోవలసి వస్తుంది.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం

నీట్ పరీక్షాపేపర్ లీక్ ఉదంతం జరిగిన చాన్నళ్ల తరువాత ప్రధాని మోడీ పెదవి విప్పారు. నీట్ పేపర్ లీక్ అవటం మహా పాపమని ఈ పాపానికి ఒడిగట్టిన వారిని శిక్షిస్తామని ఫాస్ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని అన్నారు. అన్నట్లుగానే ఆ పని వెంటన చేశారు. విద్యామంత్రి చేత రాజీనామా కూడా చేయించారు. అయితే ఇవన్నీ చేయడంవల్ల విద్యార్థులకు జరిగిన భారీ నష్టం భర్తీ అవుతుందా? చనిపోయిన వారు బతికి తిరిగొస్తారా? ఇలాంటివి జరగకుండా ముందే జాగ్రత్తపడాలి. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి. అంతా అయిపోయాక ఎన్ని చేసినా ఏంటి ప్రయోజనం?

- శాస్త్రి, హైదరాబాద్

### గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

ఉపాధి హామీ లేక కొత్తగా వచ్చిన వీబీజీరామ్‌జీ పథకంలో భాగం అయిన ఉద్యోగుల కోరిక సహేతుకమైనది. వాళ్ళేమి నెల విడిచి సాము చేయడంలేదు. ఉద్యోగంలో స్థిరత్వం అడుగుతున్నారు. మీరు ఇచ్చిన హామీనే కదా మరి మీరెందుకు నాంచుతున్నారు. వాళ్ల కూడా ప్రభుత్వంలో భాగం కావాలి అనుకుంటున్నారు. మీ ఆలస్యమవుతున్న నిర్ణయం వల్ల వాళ్ళ కుటుంబాలు మాత్రమే కాదు ఉపాధి కూలీలు కూడా నష్ట పోతున్నారు. ఇది గ్రామీణ ఆర్థికవ్యవస్థను అస్థిర పరుస్తుంది.

-భారత అవినాష్, జనగాం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# మట్టి టోకెన్ల నుంచి ప్లాస్టిక్ నోట్ల వరకు..

**గతదశాబ్దంలో ప్రపంచం, ముఖ్యంగా భారతదేశం, పెద్దమార్పునుచూసింది. యూపీఐ, డెబిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ చెల్లింపులు విస్తరించాయి. అయితే ఇవి కొత్త కరెన్సీలుకావు. రూపాయివంటి ప్రస్తుత కరెన్సీలను వినియోగించే కొత్తచెల్లింపు పద్ధతులు మాత్రమే. మట్టి టోకెన్లతో ప్రారంభమైన కరెన్సీ ప్రయాణం లోహనాణేలు, కాగితపునోట్లు, ఇప్పుడు పాలిమర్ నోట్లవరకు చేరుకుంది. ప్రతి దశ వెనుక ఒకే లక్ష్యంఉంది. లావాదేవీలను మరింత సురక్షితంగా, సులభంగా, సౌకర్యవంతంగా మార్చడం. రేపుసాంకేతిక పరిజ్ఞానం మరింత ముందుకు వెళితే కరెన్సీ మరోకొత్త రూపాన్ని సంతరించుకోవచ్చు. అందువల్ల పాలిమర్‌నోట్లు కరెన్సీ పరిణామానికి చివరి మజిలీకావు.**



కృష్ణ బాలాజి పల్లపోతు

ఇటీవల భారత ప్రభుత్వం, రిజర్వు బ్యాంకు ప్రతిపాదనకు ఆమోదం తెలుపుతూ, ప్రస్తుతం చెలామణిలో ఉన్న కాగితపు 10, 20 రూపాయల నోట్లకు అదనంగా పాలిమర్ (ప్లాస్టిక్) నోట్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే ఆస్ట్రేలియా, కెనడా, యునైటెడ్ కింగ్‌డమ్, సింగపూర్ వంటి అనేక దేశాలు పాలిమర్ నోట్లు చెలామణిలో ఉన్నాయి. ఎక్కువకాలం మన్నడం, నీటికి తడవకపోవడం, అనుకరణ మరింత కష్టతరం వంటి ప్రయోజనాల వల్ల ఈ మార్పు ప్రపంచవ్యాప్తంగా వేగం పుంజుకుంటోంది. ఈ నేపథ్యంలో మట్టి టోకెన్ల నుంచి ప్లాస్టిక్ నోట్ల వరకు సాగిన ఈ ఐదు వేల ఏళ్ల కరెన్సీ ప్రయాణాన్ని సింహావలోకనం చేసుకోవడం ఆసక్తికరంగా ఉంటుంది. నాగరికత ప్రారంభంలో ప్రపంచమంతా వస్తు మార్పిడి (బార్టర్) పద్ధతిపైనే ఆధారపడేది. కరెన్సీ అవసరం లేకుండానే, లావాదేవీల నికర విలువ ఆధారంగా వస్తుమార్పిడి జరిగేది. అయితే ఈ విధానంలో ఆర్థికశాస్త్రంలో 'డబుల్ కోఇన్సిడెన్స్ ఆఫ్ వాంట్స్' గా పిలిచే ఒక ప్రధాన సమస్య ఎదురయ్యేది. ఒకే సమయంలో ఇరువురికీ అవతలి వ్యక్తి వద్ద ఉన్న వస్తువే అవసరమై ఉండాలి. ఈ ఇబ్బందే మరింత సమర్థవంతమైన మార్పిడి వ్యవస్థ అవసరాన్ని సృష్టించి, కరెన్సీ పుట్టుకకు నాంది పలికింది. ఆసక్తికరంగా, వస్తు మార్పిడి సూత్రం పూర్తిగా కనుమరుగై పోలేదు. నేటికీ స్టాక్ ఎక్స్ఛేంజీల క్లియరింగ్ వ్యవస్థల్లో, కొన్ని అంతర్జాతీయ వాణిజ్య లావాదేవీల్లో, పరస్పర బాకీల నెట్టింగ్ విధానంలో ఇదే భావన ఆధునిక రూపంలో కనిపిస్తుంది. లావాదేవీలు చాలావరకూ ఒకదానితో వేరొకటి పరిష్కారం అయిపోగా, నికర విలువ మాత్రమే చేతులు మారుతుంది. సుమారు ఐదు వేల సంవత్సరాల క్రితం మెసపొటేమియాకు చెందిన సుమేరియన్, అక్కాడియన్ నాగరికతల్లో ధాన్యం, నూనె, పశువులు వంటి వస్తువుల విలువను సూచించే మట్టి టోకెన్లు ఒక నిర్దిష్ట విలువను సూచించే ప్రతీకలుగా ఉపయోగించబడేవి. వాణిజ్య లావాదేవీలు, గిడ్డంగి నిల్వలు, పన్నులు మొదలైన వాటి లెక్కల నిర్వహణకు టోకెన్లు ఉపయోగపడేవి. వాస్తవానికి ఈటోకెన్ల ఆధారంగా లావాదేవీలను నమోదు చేయాల్సిన అవసరమే మానవ చరిత్రలో 'లిపి' అభివృద్ధికి ప్రధాన కారణాల్లో ఒకటిగా చరిత్రకారులు భావిస్తున్నారు. అందుకే మట్టి టోకెన్లు తొలినాటి కరెన్సీగా మాత్రమే గాక అకౌంటింగ్, పరిపాలన, నాగరికత పరిణామంలో కూడా ఒక కీలక మైలురాయిగా నిలిచాయి. వాణిజ్యం విస్తరించడంతో మరింత విశ్వసనీయమైన మార్పిడి సాధనం అవసరమైంది. ఫలితంగా బంగారం, వెండి, రాగి వంటి లోహాలతోనాణేలు తయారయ్యాయి. లోహానికి సహజసిద్ధమైన విలువ ఉండటం, దీర్ఘకాలం మన్నడం వల్ల అవి వేగంగా ప్రజాదరణ పొందాయి. భారతదేశం కూడా ఈ రంగంలో అగ్రస్థానంలోనే నిలిచింది. ప్రాచీన పంచ్‌మార్క్ నాణేలు, మౌర్యులు, శాతవాహనులు జారీ చేసిన నాణేలు భారతదేశపు సమృద్ధమైన ద్రవ్య చరిత్రకు నిదర్శనం. విజయనగరసామ్రాజ్యం జారీ చేసిన బంగారు పగోడా (వరాహా) నాణేలు దక్షిణ భారతదేశంలోనే కాకుండా హిందూ మహాసముద్ర వాణిజ్యం లోనూ విశ్వసనీయ కరెన్సీగా గుర్తింపు పొందాయి. నాణేలు కేవలం లావాదేవీల సాధనాలుగానే కాకుండా, రాజవంశాల కాలక్రమం, పాలకుల పేర్లు, బిరుదులు, మత విశ్వాసాలు, ఆర్థిక పరిస్థితులను పునర్నిర్మించడంలో చరిత్రకారులకు అమూల్యమైన ఆధారాలుగా ఉపయోగపడ్డాయి. లోహ నాణేలు విశ్వసనీయమైనవే అయినప్పటికీ, వాటిని భారీ



సంఖ్యలో ముద్రించడం, రవాణా చేయడం, పెద్ద మొత్తాల లావాదేవీల్లో వినియోగించడం క్రమంగా భారంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో తోలు, వస్త్రం వంటి ప్రత్యామ్నాయాలను పరిమితంగా ఉపయోగించబడ్డాయి. అయితే తక్కువబరువు, తక్కువ ముద్రణా వ్యయం, సులభమైన రవాణా, పెద్ద మొత్తాల చెల్లింపులకు అనుకూలత కారణంగా కాగితపునోట్లు ప్రపంచవ్యాప్తంగా క్రమంగా విస్తరించాయి. ఈ సందర్భంలో, కరెన్సీ దానికి ఆపాదించిన విలువను ఎలా సంతరించుకుంటుందనేది ఆసక్తికరమైన అంశం. తొలినాళ్లలో బంగారం, వెండి నాణేల విలువ వాటిలోని లోహం విలువకు దగ్గరగా ఉండేది. దీనిని అంతర్గత విలువ (ఇంట్రిన్సిక్ వ్యాల్యూ) కలిగిన ద్రవ్యంగా భావించవచ్చు. కానీ, ఉదాహరణకు ప్రస్తుతం రూ.100 నోటు తయారీ ఖర్చు రూ.100 కాదు. అంత కంటే ఎంతో తక్కువ ఉంటుంది. అంటే, వాటి విలువ లోహంలోనో, కాగితంలోనో లేదు. దానిని జారీ చేసిన ప్రభుత్వం, కేంద్ర బ్యాంకుపై ప్రజలు ఉంచిన విశ్వాసంలోఉంది. ఇలాంటి ద్రవ్యాన్నే టోకెన్‌కరెన్సీ లేదా ఫిడ్యూషియరీ కరెన్సీ అంటారు. ఈవ్యవస్థ అమలులో ఉన్నందు వలన దేశ ఆర్థిక అవసరాలకు అనుగుణంగా ప్రభు త్వాలు కొత్త నోట్లను ప్రవేశపెట్టగలుగుతున్నాయి. పాత నోట్లను ఉపసంహరించుకోగలుగుతున్నాయి. అవసరమైతే కరెన్సీ వ్యవస్థలో సంస్కరణలు చేపట్టగలుగుతున్నాయి. భారతదేశంలో పెద్ద నోట్లరద్దు, బ్రెజిల్, టర్కీవంటి దేశాల్లో తీవ్రమైన ద్రవ్యోల్బణం తరువాత చేపట్టిన కరెన్సీ సంస్కరణలు దీనికి ఉదాహరణలు. ప్రపంచంలో అప్పటికే అమలులో ఉన్న టోకెన్ కరెన్సీ భావనను, భారతదేశంలో అత్యంత సాహసోపేతంగా అమలు చేయడానికి ప్రయత్నించిన పాలకుడు మహమ్మద్ బిన్ తుగ్లక్. 14వ శతాబ్దంలో ఆయన వెండి నాణేలకు ప్రత్యామ్నాయంగా రాగి, ఇత్తడితో టోకెన్ కరెన్సీని హడావిడిగా ప్రవేశపెట్టాడు. అయితే నకిలీనాణేలను అరికట్టే సాంకేతికత, కఠిన నియంత్రణ వ్యవస్థలు లేకపోవడంతో ప్రజలు పెద్దఎత్తున నకిలీనాణేలను తయారుచేశారు. ఫలితంగా ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమై, చివరకు తుగ్లక్ తన ప్రయోగాన్ని ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. కానీ తుగ్లక్ ప్రయోగం టోకెన్ కరెన్సీ విజయవంతం కావాలంటే ప్రజల విశ్వాసాన్ని కాపాడగల సాంకేతికత, సమర్థమైన పరిపాలనా వ్యవస్థ అవసరమనే విషయాన్ని మాత్రం స్పష్టం చేసింది. మన్నిక, పరిశుభ్రత, నకిలీ నిరోధకత వంటి అంశాల్లో కాగితపు నోట్లు ఎదుర్కొంటున్న పరిమితులను అధిగమించేందుకు అనేకదేశాలు పాలిమర్ (ప్లాస్టిక్)నోట్లను ప్రవేశపెడుతున్నాయి. ఇవి ఎక్కువకాలం మన్నుతాయి. నీటికి తడవవు. ఆధునిక భద్రతా లక్షణాల వల్ల నకిలీ చేయడం మరింత కష్టతరం. నోట్ల జీవితకాలం పెరగడంతోదీర్ఘకాలంలోముద్రణ వ్యయం కూడా తగ్గేఅవకాశం ఉంటుంది. సాంకేతిక పరిజ్ఞానం మరింత అభివృద్ధి చెందడం, నకిలీ కరెన్సీని అరికట్టాల్సిన అవసరం పెరగడంవంటి కారణాలతో, ఇంతకు ముందే ప్రతిపాదించిన ఈప్రయత్నం మరోసారి ఊపందుకుంది. 'ప్లాస్టిక్' అనగానే సహజంగానే పర్యావరణంపై సందేహాలు తలెత్తుతాయి. అయితే, పాలి మర్ నోట్లు కాగితపు నోట్లకంటే రెండు నుంచి నాలుగురెట్లు ఎక్కువకాలం మన్నడం వల్ల కొత్త నోట్ల ముద్రణ, రవాణా, భర్తీ ప్రక్రియలకు అవసరమయ్యే ముడి పదార్థాలు, ఇంధన వినియోగం తగ్గే అవకాశం ఉంటుంది. వాటిని పునర్వినియోగం చేయడం కూడా సాధ్యమే. అందువల్ల పర్యావరణ ప్రభావాన్ని కేవలం తయారీ పదార్థం ఆధారంగా కాకుండా, మొత్తం జీవితచక్రం ఆధారంగా అంచనా వేయడం అవసరం. అయితే పాలిమర్ నోట్ల పర్యావరణ ప్రయోజనాలు, వినియోగానంతరం వాటిని సమర్థంగా సేకరించి, పునర్వినియోగం చేయగల వ్యవస్థ ఉన్నప్పుడే పూర్తిగా సాకారమవుతాయి. గతదశాబ్దంలో ప్రపంచం, ముఖ్యంగా భారతదేశం, పెద్దమార్పునుచూసింది. యూపీఐ, డెబిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ చెల్లింపులు విస్తరించాయి. అయితే ఇవి కొత్త కరెన్సీలుకావు. రూపాయివంటి ప్రస్తుత కరెన్సీలను వినియోగించే కొత్త చెల్లింపు పద్ధతులు మాత్రమే. మట్టి టోకెన్లతో ప్రారంభమైన కరెన్సీ ప్రయాణం లోహ నాణేలు, కాగితపు నోట్లు, ఇప్పుడు పాలిమర్ నోట్లవరకు చేరుకుంది. ప్రతి దశ వెనుక ఒకే లక్ష్యంఉంది. లావాదేవీలను మరింత సురక్షితం గా, సులభంగా, సౌకర్యవంతంగా మార్చడం. రేపు సాంకే తిక పరిజ్ఞానం మరింత ముందుకు వెళితే కరెన్సీ మరోకొత్త రూపాన్ని సంతరించుకోవచ్చు. అందువల్ల పాలిమర్‌నోట్లు కరె న్సీ

# బలమైన ప్రతిపక్షం చరిత్రాత్మక అవసరం

సురేష్ కాలేరు

ప్రతిపక్షాల పునర్నిర్మాణమే ప్రజాస్వామ్యానికి బలం భారతదేశ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే, ప్రతి దశలోనూ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా కొత్త రాజకీయ శక్తులు, కొత్త భావజాలాలు ఆవిర్భవించాయి. స్వాతంత్ర్యానంతరం భారత జాతీయ కాంగ్రెస్ దేశ రాజకీయాలను దశాబ్దాల పాటు ప్రభావితం చేసింది. అనంతరం అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) నేపథ్యంలో జనతా పార్టీ ఆవిర్భావం, ప్రాంతీయ పార్టీల ఎదుగుదల, సామాజిక న్యాయ ఉద్యమాల ప్రభావంతో వెనుకబడిన వర్గాల రాజకీయ ప్రాతినిధ్యం పెరగడం వంటి పరిణామాలు భారత ప్రజాస్వామ్యాన్ని మరింత విస్తృతం చేశాయి. మండల్ ఉద్యమం, రైతాంగ పోరాటాలు, దళిత బహుజన ఉద్యమాలు, ప్రాంతీయ స్వాభిమాన ఉద్యమాలు దేశ రాజకీయాలకు కొత్త దిశను చూపించాయి. అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి రావడంద్వారా సమాఖ్య వ్యవస్థ మరింత బలపడింది. కేంద్రరాష్ట్ర సంబంధాలపై కొత్త చర్చలు ప్రారంభమయ్యాయి. అయితే గత దశాబ్దంలో బిజెపి దేశ రాజకీయాల్లో ప్రధాన శక్తిగా ఎదిగింది. బలమైన సంస్థాగత నిర్మాణం, విస్తృత ఎన్నికల వ్యూహం, నాయకత్వ కేంద్రీకరణ, సంక్షేమ పథకాల ప్రచారం, డిజిటల్ ప్రచార వ్యవస్థ వంటి అంశాలు ఆపార్టీ విజయాలకు దోహదపడ్డాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అనేకరాష్ట్రాల్లో కూడా ఆ పార్టీ తన ప్రభావాన్ని విస్తరించగలిగింది. ఇదే సమయంలో ప్రతిపక్ష రాజకీయాలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. భావజాల స్పష్టత లోపించడం, నాయకత్వ విభేదాలు, ప్రాంతీయ ప్రయోజనాలకే పరిమితమవడం, సమన్వయ లోపం, దీర్ఘకాలిక ప్రత్యామ్నాయ కార్యాచరణను ప్రజల ముందుంచడంలో వైఫల్యం వంటి కారణాలు ప్రతిపక్షాల బలహీనతకు దారితీశాయి. కేవలం అధికార వ్యతిరేకత సరిపోదు. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునే విధానాలు, విశ్వసనీయ నాయకత్వం, కార్యాచరణ కూడా అవసరం. ఈనేపథ్యంలో కాంగ్రెస్, వివిధ ప్రాంతీయ పార్టీలు, రైతు, కార్మిక, విద్యార్థి, మహిళా, దళిత, ఆదివాసీ, వెనుకబడిన వర్గాల ప్రజా సంఘాలు పరస్పర సంభాషణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. అయితే అలాంటి సమన్వయం రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య సూత్రాలు, విధానాలపై ఆధారపడాలి. కేవలం ఎన్నికల కూటమిగా మాత్రమే పరిమితం కాకూడదు. దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం, సమాఖ్య వ్యవస్థ, పారదర్శక పరిపాలన, ఉపాధి, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, ఆర్థికాభివృద్ధి వంటిఅంశాలపై ప్రత్యామ్నాయ కార్యాచరణను ప్రజలకు వివరించగలిగితేనే బలమైన రాజకీయ ప్రత్యామ్నాయం ఏర్పడే అవకాశంఉంటుంది. భారత ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే అధికార పక్షంఎంత బలంగా ఉండాలో, అంతేబలమైన, బాధ్యతాయుతమైన ప్రతిపక్షం కూడా అవసరం. అధికారాన్ని ప్రశ్నించే స్వరం ప్రజాస్వామ్యానికి అంతర్భాగం. అదే సమయంలో ప్రతిపక్షం కూడా విమర్శలతో పాటు నిర్మాణాత్మక సూచనలు, అమలు చేయగల విధానాలను ప్రజల ముందుంచాలి. భారత రాజకీ యాల భవిష్యత్తు ఒకే పార్టీ విజయం లేదా ఓటమితో నిర్ణ యించబడదు. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే రాజకీయ వ్యవస్థ, రాజ్యాంగ స్ఫూర్తినికాపాడే ప్రజాస్వామ్య సంస్కృతి, సామాజిక సమానత్వాన్ని బలోపేతం చేసే విధానాలు, బాధ్యతాయుత రాజకీయ పోటీ ఇవే దేశ ప్రగతికి నిజమైన పునాదులు. •

# యువశక్తికి మత్తు సంకెళ్లు - వికసిత్ భారత్‌కు ముప్పు

రామ కిష్టయ్య సంగన భట్ల

సమగ్ర ప్రగతికి, సుస్థిర వికాసానికి, ఆర్థిక పురోగతికి భావి భారత పౌరులే ప్రధాన శక్తులు. 'యువతయే దేశానికి వెన్నెముక' అనే ఆర్యోక్తి ఊరికే రాలేదు. నేడు జగత్తులోనే అత్యధికంగా పాతికేళ్ల లోపు వయస్సు ఉన్న యువజన జనాభా కలిగిన సమ్మోహన శక్తిన కలిగిన ఏకైక దేశం మన భారతదేశం. ఈ అనంతమైన శారీరక, మానసిక, సృజనాత్మక శక్తి సరైన దిశలో పయనిస్తే 'వికసిత భారత్ 2047' స్వప్నం నెరవేరడం తథ్యం. కానీ, సరిగ్గా ఇదే సమయంలో మన దేశ ప్రగతిని దెబ్బతీయడానికి, భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడానికి మాదకద్రవ్యాలనే విషనాగులు సమాజంలోకి జొరబడుతున్నాయి. ఈ వ్యసన భూతం కేవలం ఒక వ్యక్తి ఆరోగ్యానికే పరిమితం కాకుండా కుటుంబ వ్యవస్థను ఛిన్నాభిన్నంచేస్తూ, సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ, అంతిమంగా దేశ ఆర్థిక పురోగతికి తీవ్ర ప్రతిబంధకంగా మారుతోంది. నూతన యుగంలో సాంకేతికత ఎంత వేగంగా విస్తరిస్తోందో, అంతే వేగంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణా వ్యవస్థ రూపాంతరం చెందుతోంది. చీకటి జాలం, గూఢ ధనాలు, సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని కృత్రిమ మత్తు పదార్థాలు, రసాయన మత్తు బిళ్లలు, హెరాయిన్ వంటి ప్రమాదకర పదార్థాలు నేడు విద్యాసంస్థల ముంగిటకు చేరుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా దాదాపు ముప్పై కోట్లకు పైగా ప్రజలు వివిధ రకాల మాదకద్రవ్యాల బారిన పడి ఉన్నారు. భారతదేశ విషయానికి వస్తే, జాతీయ స్థాయిలో నిర్వహించిన సర్వే ప్రకారం దేశంలో సుమారు మూడు కోట్ల మందికి పైగా గంజాయిని, రెండుకోట్ల మందికి పైగా అఫీము ఆధారిత పదార్థాలను, దాదాపు కోటి మందికి పైగా వివిధ రకాల ప్రమాదకర నిద్రమాత్రలను వినియోగిస్తున్నారు. ఇందులో అత్యధిక భాగం పదిహేను నుంచి ముప్పై ఐదు సంవత్సరాల మధ్య వయస్సు గల పాఠశాల, కళాశాల విద్యార్థులు, నిరుద్యోగ యువత, పట్టణ ప్రాంతవాసులే ఉండటం అత్యంత విచారకరం. మత్తు పదార్థాల వ్యాపారం కేవలం స్వదేశీ విక్రేతల వ్యాపారం మాత్రమే కాదు, దీని వెనుక అంతర్జాతీయ నేర ముఠాలు, సరిహద్దు అవతలి శత్రుదేశాల కుట్రలు దాగి ఉన్నాయి. దీనినే 'మత్తు తీవ్రవాదం' అంటారు. పంజాబ్, జమ్మూ కాశ్మీర్, గుజరాత్ తీరప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల సరిహద్దుల గుండావిమాన రహిత యంత్రాలు, సముద్ర మార్గాలు, రవాణా వాహనాల ద్వారా దేశంలోకి వేల కోట్ల రూపాయల విలువైన మత్తు పదార్థాలను తోస్తున్నారు. భారతదేశ యువశక్తిని మానసికంగా, శారీరకంగా వికలాంగులను చేయడం ద్వారా భారత ప్రజాస్వామిక, ఆర్థిక శక్తులను బలహీనపరచాలనేది ఈ దేశ వ్యతిరేక శక్తుల ప్రధాన వ్యూహం. ఒకసారి ఈ వ్యసనంలో కూరుకుపోతే వ్యక్తి ఆలోచనా శక్తి నశిస్తుంది. తీవ్ర మానసిక రుగ్మతలతో పాటు కాలేయం, గుండె, నరాలవ్యవస్థ పూర్తిగా దెబ్బతింటాయి. విద్య, ఉద్యోగాలు కోల్పోయి, నేరపూరిత కార్యకలాపాల వైపు అడుగులు వేయడం ద్వారా కుటుంబ



శ్రేయస్సు పూర్తిగా నాశనమవుతుంది. ఈ తీవ్రమైన సంక్షోభాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణాన్ని ఒక ప్రాధాన్య జాతీయ లక్ష్యంగా నిర్దే శించుకుంది. ఇందులో భాగంగా ప్రధానమంత్రి ఆగస్టు రెండు న అద్భుతమైన 'మత్తు రహిత యువత - వికసిత భారత్ సంకల్ప ఉద్యమం' కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అధికారికం గా ప్రారంభించారు. 'మాదకద్రవ్య రహిత యువతే వికసిత భారత్-2047 లక్ష్యానికి బలమైన పునాది'అని చాటిచెప్పిన ఈ కార్యక్రమంలో ఒకేసారి దేశవ్యాప్తంగా కోటికి పైగా యువత మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ పూనడం అపూర్వ చరిత్రను తిరగరాసింది. ఈ ఉద్యమం కేవలం ఒక ప్రభుత్వ ఆదేశంగా కాక, ప్రజల భాగస్వామ్యంతో కూడిన ఒక చైతన్యవంతమైన ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంది. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని డిజిటల్ వేదికను ఉపయోగించి కోట్ల మంది వాలంటీర్లను ఇందులో భాగస్వాములను చేస్తున్నారు. ఈ ఉద్యమం ద్వారా జాతీయస్థాయి ప్రశ్నోత్తరి, వ్యాసరచన, చిత్రలేఖనం, నినాదాల రచనలు నిర్వహించడం జరుగుతోంది. నాటికలు, అభినయ ప్రదర్శనలు, జానపద గేయాలు, వీధి నాటకాలు, లఘు చిత్రాల ద్వారా మత్తు పదార్థాల దుష్పరిణామాలను గ్రామీణ స్థాయిలోని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. యువతను క్రీడా రంగానికి ఆకర్షితులను చేస్తూ, మానసిక ఉల్లాసానికి స్థానిక క్రీడా పోటీలు, యోగా సాధన, మానసిక పరిపక్వత సలహాలు, ఉచిత వైద్య తనిఖీ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి గ్రామంలో యువజన సంఘాలను ఏర్పాటు చేసి, మత్తుకు బానిసలైన వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు పంపేలా నడిపిస్తున్నారు. ఈబృహత్తర ప్రచార కార్యక్రమం ఆగస్టు పద్నాలుగున నిర్వహించబోయే 'జాతీయ యువ సమ్మేళనం' తో ముగియనుంది. మత్తు రహిత సమాజ స్థాపనకు కేవలం ప్రచారం మాత్రమే సరిపోదు, దీనికి బహుముఖ వ్యూహం అవసరం. ఒకవైపు చట్టపరమైన ఉక్కు పాదం, మరొకవైపు పునరావాసం కలగలిపి పనిచేయాలి. మత్తు పదార్థాల నియంత్రణ సంస్థ, రాష్ట్ర పోలీసులు, తీర రక్షక దళం, సుంకముల శాఖల మధ్య మెరుగైన సమన్వయంతో సరిహద్దులలో నిఘాను తీవ్రతరం చేయాలి. పాఠశాలలు, కళాశాలల సమీపంలో మాదకద్రవ్యాలు విక్రయించే ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంచి, విద్యాసంస్థలను మత్తు రహిత ప్రాంతాలుగా ప్రకటించాలి. వ్యసనపరులను నేరస్థులుగా చూడకుండా, బాధితులుగా పరిగణించి వారికి అవసరమైన మానసిక పరిపక్వత సలహాలు, వైద్య సహాయం అందించాలి. ప్రత్యేక ఉచిత సలహాదారుల ద్వారా సలహాలు అందించాలి. భారతీయ సంస్కృతి ఎల్లప్పుడూ శరీర ధర్మాన్ని, మానసిక పరిశుద్ధతను అత్యున్నతంగా భావించింది. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే ఆర్యోక్తిని స్మరిస్తూ సంస్కారవంతమైన, ఆరోగ్యకరమైన జీవనశైలే వికసిత భారత్‌కు ప్రాణాధారమని గుర్తించాలి. 'మత్తు రహిత యువత - వికసిత భారత్' అనేది కేవలం ప్రభుత్వానికి చెందిన ఒక సంక్షేమ పథకం కాదు. ఇది ప్రతి తల్లిదండ్రి, ఉపాధ్యాయుడు, విద్యాసంస్థ, స్వచ్ఛంద సంస్థ, పౌరుడు స్వీకరించాల్సిన జాతీయ ధర్మం. పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనిస్తూ, వారికి కావలసిన ప్రేమను, మానసిక ధైర్యాన్ని ఇంట్లో అందించాలి. మత్తు వదిలి లక్ష్యం వైపు

గుంటూరు వార్త

## మేనకోడళ్ళపై అసభ్య ప్రవర్తన కేసులో
# మేనమామకు ఐదేళ్ల జైలు,జరిమానా

**గుంటూరు లీగల్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** సొంత మేనకోడళ్ళు అయిన ఇద్దరు బాలికలపై అసభ్యంగా ప్రవర్తించిన మేనమామకు ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ గుంటూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం తాడేపల్లి అంజిరెడ్డి కాలనీకి చెందిన వ్యక్తి కూలి పనులకు వెళ్తుండేవాడు. 2015 సంవత్సరంలో అదే కాలనీకి చెందిన యువతితో వివాహమైంది. వీరికి నలుగురు కుమార్తెలు. సంఘటనకు ఏడాది క్రితం భార్యతో విభేదాలు రావడంతో ఆమె నలుగురు పిల్లలతో పుట్టింటికి చేరుకుంది. 2025 ఏప్రిల్ 16 తేదీ రాత్రి 11 గంటలకు 8 ఏళ్ల వయసున్న రెండో కుమార్తె ఏడ్చుకుంటూ ఇంటి నుంచి బయటకు రావడంతో అదే కాలనీలో నివాసం ఉండే తండ్రి ఏం జరిగిందని ప్రశ్నించాడు. మేనమామ కొండపాటి లంకబాబు తన శరీర భాగాలను స్పృశిస్తూ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని బాలిక చెప్పింది. అదే సమయంలో బయటకు వచ్చిన 9 ఏళ్ల పెద్ద కుమార్తె కూడా తన పట్ల మేనమామ అలాగే ప్రవర్తించాడని చెప్పడంతో బాలికల తండ్రి తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే నెల 18వ తేదీ నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేయగా, అప్పటినుండి గుంటూరు జిల్లా కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా కొనసాగుతున్నాడు. పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తీగల దుర్గాప్రసాద్ నిందితుడిపై నేరం రుజువు చేయడంతో ఐదేళ్ల జైలు శిక్షతోపాటు, రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సుల్తానా బేగం తీర్పు చెప్పారు.

## ప్రతి ఇంటిపైన, ప్రభుత్వ కార్యాలయాల పై ఈనెల 13 నుండి 15 వరకు
# త్రివర్ణ పతాకం ఎగరాలి
### నగర కమిషనర్ మయూర్ అశోక్

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 10, ప్రభాత వార్త :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హార్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13వ నుండి 15వ తేదీ వరకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి వార్డ్ సచివాలయం, ప్రభుత్వ కార్యాలయం,



ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకం ఎగరవేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపులో భాగంగా, జిల్లా కల్లెక్టర్ ఆదేశాల ప్రకారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని, ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించేలా, వారిని దేశ అభివృద్ధిలో భాగస్వాములను చేసేందుకు దేశ నిర్మాణంలో భాగస్వాములు పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు చెప్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకం ఎగురవేయడం, దేశ అభివృద్ధికి సూచనలతో సెల్ఫీలు తీసి పంపించడం చేయవచ్చన్నారు. అలాగే 14వ తేదీన మొక్కలు నాటడం, 14, 15 తేదీల్లో అన్ని ప్రధాన కూడళ్ళు, జిఎంసి ప్రధాన కార్యాలయం, మణిపురం, కంకరగుంట ఫ్లైఓవర్స్ ని త్రివర్ణ కాంతులతో అలంకరిస్తామని తెలిపారు. నగర ప్రజలు హార్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విరివిగా పాల్గొని దేశభక్తిని చాటాలని కోరారు.

## మంగళగిరి శివాలయంలో మంత్రి రవీంద్ర పూజలు

**మంగళగిరి, ఆగస్టు 10, ప్రభాతవార్త :** మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి రవీంద్రకు పురోహితులు వేద ఆశీర్వచనం చేసి ప్రసాదాల అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొగి కోటేశ్వరరావు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు బాపనపల్లి వాసు, తిరుమల శెట్టి మురళీ కృష్ణ, టీడీపీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వాకా మాధవరావు గౌడ్, పురోహితులు పీ శ్యామ సుందర శాస్త్రి,మహేష్‌కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



# జూనియర్ వైద్యుల సమర శంఖం

- నేటి నుండి రాష్ట్ర వ్యాప్తంగా అత్యవసరం కాని వైద్య సేవల నిలిపివేతకు నిర్ణయం...
- సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన మరింత ఉధృతం..
- అత్యవసర సేవలు, తీవ్ర అనారోగ్య విభాగాలకు మినహాయింపు..

గుంటూరు మెడికల్,ఆగస్టు 10,(ప్రభాతవార్త)

రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో పనిచేస్తున్న జూనియర్ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం దశలవారీ ఆందోళనకు పిలుపునిచ్చింది. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేయనున్నట్లు సంఘం ప్రకటించింది.సంఘం




అధ్యక్షుడు డాక్టర్ యు. ఈశ్వర్ శంకర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బలగం దినకర్ సాయి శ్రీనివాస్ తదితరులు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆందోళన కార్యాచరణను వెల్లడించారు. ఇందులో భాగంగా తొలి దశలో రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో పనిచేస్తున్న సంబంధిత జూనియర్ వైద్యులు, వైద్య శిక్షణార్థులు, సూపర్ ప్రత్యేకతల వైద్య శిక్షణార్థులు, సీనియర్ వైద్య శిక్షణార్థులు తదితరులు అత్యవసరం కాని వైద్య సేవలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిలిపివేయనున్నట్లు తెలిపారు.తదుపరి దశలో ఆగస్టు 12 నుంచి 15 వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరం కాని వైద్య సేవలను పూర్తిగా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 15న సాయంత్రం 5 గంటలకు ప్రభుత్వ ఉద్యమానికి మద్దతుగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.అత్యవసర సేవలకు మినహాయింపుఆందోళన కారణంగా రోగులకు ఇబ్బందులు కలగకుండా అత్యవసర వైద్య సేవలను యథావిధిగా కొనసాగిస్తామని సంఘం స్పష్టం చేసింది. అత్యవసర విభాగాలు, ప్రసవ సేవలు, అత్యవసర శస్త్రచికిత్సలు, అన్ని తీవ్ర అనారోగ్య విభాగాల సేవలకు ఎలాంటి అంతరాయం ఉండదని పేర్కొంది.సమస్యలు పరిష్కారం కాకుంటే మరింత ఉధృతంపై దశల్లో చేపట్టిన ఆందోళనల అనంతరం కూడా సమస్యలు పరిష్కారం కాకపోతే ఆగస్టు 17 నుంచి మూడో దశలో ఆందోళనను మరింత ఉధృతం చేయనున్నట్లు సంఘం వెల్లడించింది. వైద్య శిక్షణ, పరిధి, ఇతర అంశాలపై తమ డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వ వైద్య సేవలకు అంతరాయం కలగకుండా అత్యవసర విభాగాలను కొనసాగిస్తూనే తమ ఆందోళనను చేపట్టనున్నట్లు స్పష్టం చేసింది.

## నిషేదిత మాదక ద్రవ్యాలతో
# జీవితాలు నాశనం

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్10, ప్రభాతవార్త:** నిషేదిత మాదకద్రవ్యాలకు అలవాటు పడిన కొంతమంది విద్యార్థులు వారి జీవితాలను నాశం చేసుకోవడమే కాకుండా కుటుంబాలను, సమాజాన్ని సైతం




నాశనం చేస్తున్నారని ఈగల్ విభాగం రాష్ట్ర ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆకే రవికృష్ణ అన్నారు. సోమవారం వర్సిటీలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్‌లో ఏపి ఎగైనెస్ట్ డ్రగ్స్ - అవేర్‌నెస్ టు యాక్షన్ అనే అంశంపై కార్యశాల జరిగింది. ఈ కార్యశాలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆకే రవికృష్ణ మాట్లాడుతూ ఏపిలో విద్యార్థుల తలిదండ్రులు వారి పిల్లల భవిష్యత్ కోసం శ్రమిస్తుంటారని పేర్కొన్నారు. కొంతమంది విద్యార్థులు తెలిసో తెలియకో చెడు స్నేహాలబారిన పడి గంజాయి, హెరాయిన్ వంటి సైకో డ్రగ్స్, సింథటిక్ డ్రగ్స్‌లకు అలవాటు పటి శిక్షలు అనుభవిస్తున్నారని గుర్తు చేశారు. . ఐపిఎస్ మాజీ అధికారి డాక్టర్ గుత్తికొండ కొండలరావు, విభాగాధిపతి ఆచార్య ఎస్.విజయలక్ష్మి, పలువురు డిఎస్‌పిలు, సిఐలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రూ.2 కోట్లతో డ్రెయిన్లు,మంచినీటి పైపులైన్ల నిర్మాణం

- శంకుస్థాపన చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ - అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

**గుంటూరు, ఆగస్టు 10,ప్రభాతవార్త :** అభివృద్ధికి నూతన అధ్యాయం లిఖిస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. సోమవారం స్థానిక జామియా నగర్, అరుంధతి నగర్ ప్రాంతాల్లో అవుట్ ఫాల్ డ్రెయిన్, మంచినీటి పైపు లైన్ల నిర్మాణానికి రూ.2 లక్షలతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో డ్రెయిన్లు, రోడ్లు, మంచినీటి పైపు లైన్ల నిర్మాణం వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. అందులో భాగంగా జామియా నగర్ లో రూ.1.50 లక్షలతో అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మించబోతున్నామని చెప్పారు. అరుంధతి నగర్, మంగళదాస్ నగర్, అంబేద్కర్ నగర్, రాజగోపాల్ నగర్ ప్రాంతాలను కలుపుతూ రూ.50 లక్షలతో మంచి నీటి పైపు లైను ఏర్పాటు చేస్తామన్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో గుంటూరు తూర్పు



నియోజకవర్గంలో అభివృద్ధి పదేళ్ల వెనక్కి వెళ్లిందని విమర్శించారు. ప్రధాన ప్రాంతాల్లో సైతం రోడ్ల నిర్మాణం చేపట్టిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మారుమూల కాలనీలకు మంచినీళ్ల కూడా అందించలేదని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ.350 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. వంద కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటున్నామని, నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చామని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేశామని తెలిపారు. తల్లికి వందనం అమలుతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి బాటలు వేశారన్నారు. ఇప్పటికే గూగుల్ వంటి పెద్ద సంస్థలు రాష్ట్రానికి తరలివచ్చాయని, 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు.

### ఈ నెల 15 నాటికి బృందావన్ గార్డెన్స్ రోడ్డు విస్తరణకు సంబంధించి టౌన్ ప్లానింగ్ అధికారులు
# క్లియరెన్స్ ఇవ్వాలి
### కమిషనర్ మయూర్ అశోక్

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 10, (ప్రభాతవార్త) :** బృందావన్ గార్డెన్స్ రోడ్డు విస్తరణకు సంబంధించి ఈ నెల 15 నాటికి పట్టణ ప్రణాళిక విభాగం నుండి పూర్తి క్లియరెన్స్ చేసి, డ్రైన్, రోడ్ నిర్మాణాలకు మార్కింగ్ ని ఇవ్వాలని నగర కమిషనర్




కే.మయూర్ అశోక్ పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్ లో పట్టణ ప్రణాళిక మరియు ఇంజనీరింగ్, ఏపిసిపిడిసిఎల్ అధికారులతో రోడ్డు విస్తరణ పనుల పురోగతిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరంలో బృందావన్ గార్డెన్స్ నుండి హనుమయ్య కంపెనీ వరకు రోడ్ విస్తరణ పనులు విభాగాల సమన్వయంతో వేగంగా చేపట్టడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా విస్తరణ ప్రభావిత భవనాల తొలగింపుకు ఈ నెల 15 తుది గడువుగా పట్టణ ప్రణాళిక అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. క్లియర్ గా ఉన్న పోర్షన్లలో డ్రైన్ నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ గుర్తించిన ప్రాంతాల్లో ట్రాన్స్ఫార్మర్లు, స్తంభాలు షిఫ్ట్‌చేయాలన్నారు. పనులు జరిగే సమయంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, విస్తరణలో తొలగించిన చెట్లను వెంటనే తరలించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఏ.సి.పి రెహమాన్, ఈఈ విష్ణు, ఏడిహెచ్ శాంతి పాల్గొన్నారు.

## ఇన్నర్ రింగ్ రోడ్డులోని వైపై గెస్ట్ హౌస్ పై
# టాస్క్ పోర్స్ పోలీసుల దాడి

**గుంటూరు, ఆగస్టు 10,ప్రభాతవార్త :** పేకాడుతున్న 28 మంది అరెస్ట్23 లక్షలు స్వాధీనంక్రిష్ణా, ఎన్టీఆర్ జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చి పేకాడుతున్న పేకాటరాయుళ్ళుముందస్తు సమాచారంతో దాడి చేసిన టాస్క్ ఫోర్స్ పోలీసులుభారీ మొత్తంలో నగదు దొరకటంతో కలకలం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

## ప్రజల నుండి అందే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి
### అదనపు కమిషనర్ కిషోర్

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 10, ( ప్రభాతవార్త ) :** ప్రజల నుండి అందే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, పీజీఆర్ఎస్‌లో అధికారులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఐ.కిషోర్ తెలిపారు. సోమవారం నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశాల మేరకు జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఖిప్రజా సమస్యల పరిష్కార వేదికఖి కార్యక్రమంలో అదనపు కమిషనర్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ, పిజిఆర్ఎస్ కు అందే ఫిర్యాదుల్లో




ఎక్కువగా పారిశుధ్యం, డ్రైనేజీ సమస్యలు, త్రాగునీటి సరఫరా వీధి దీపాల వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించినవే వస్తున్నాయని, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే, ఆ విషయాన్ని దరఖాస్తుదారునికి వివరించి, ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందనా న్నరు. పిజిఆర్ఎస్ ద్వారా 44 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 11, ఇంజినీరింగ్ విభాగం 13, రెవెన్యూ విభాగం 11, ప్రజారోగ్య విభాగం 7, ఎలక్షన్ సెల్ విభాగం 1, అకౌంట్స్ విభాగానికి సంబందించి 1 ఫిర్యాదు అందాయన్నారు.కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జి.సాంబశివరావు, సిఎంఒహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, ఎస్ఈ సుందరరామిరెడ్డి పాల్గొన్నారు.

## సమస్యల పై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత


**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్10, ప్రభాతవార్త:** ఏఎన్‌యులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల బృందం సోమవారం ఎంఎల్‌ఏ డి.నరేంద్రకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. విశ్వవిద్యాలయాల్లో వారు



ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమకు సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం 2023 జూన్‌లో ఇచ్చిన జీఓ ఎంఎస్.నెం.20ను రద్దుచేయాలని కోరారు. జీఓ ఎంఎస్ నెం.46, జిఓ ఎంఎస్ నెం.14ల ప్రకారం తమకు యూజిసి పే స్కేల్స్ అమలు చేయాలని, తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని ఆయనకు విన్నవించారు. గత 15-20 ఏళ్ళుగా వర్సిటీలో విధులు నిర్వహిస్తున్న తమకు న్యాయం చేసిన తరువాతే రెగ్యులర్ నియామకాలు చేపట్టేవిధంగా మీ వంతు సహకారం అందించాలని కోరారు. న్యాయమైన మాడిమాండ్‌లను ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, పరిష్కరించాలని కోరారు. మా సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్ళి మీవంతు కృషి చేయాలని విజ్ఞప్తిచేశారు. వినతిపత్రం అందించిన వారిలో వర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సి.హెచ్. తిరుమలరావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ పి.రవి, డాక్టర్ డి.చంద్రమౌళి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ కృష్ణ, ఇసి మెంబర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఎంతో ఉపయోగం
### -ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, ఆగస్టు 10,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని



చింతలపూడి ఎమ్మెల్యే ధూళిపాళ్ళ స్వగృహంలో సోమవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి సహాయనిధిని సక్రమంగా అమలు చేయకుండా తాత్సారం చేశారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారం చేపట్టిన దగ్గరనుండి ముఖ్యమంత్రి సహాయనిధి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి పక్కాగా అమలు చేస్తున్నారన్నారు. మండలంలోని తొమ్మిది మంది లబ్దిదారులకు రూ.8,48,259, పట్టణంలోని ఏడుగురు లబ్దిదారులకు రూ.3,67,726 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులు ప్రభుత్వానికి,మరీ ముఖ్యంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబూరావు, సాక్షి భావనారాయణ స్వామి ధర్మకర్తల మండలి డైరెక్టర్ శిఖాకొల్లి గుర్నాథరావు, వ్యవసాయ మార్కెట్‌యార్డు డైరెక్టర్ తవ్వా విజయ్, ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు కోట రవిశంకర్, మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, తాటికొండ సుధీర్, షేక్ బాజిసాహెబ్,గణిపిశెట్టి రామకృష్ణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డీఎస్సీ పై సిబిఐ విచారణ డిమాండ్ చేస్తూ మంగళగిరిలో భారీ బైక్ ర్యాలీ
### విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని ఆందోళన

**మంగళగిరి, ఆగస్టు 10, ప్రభాతవార్త :** డీఎస్సీలో జరిగిన అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళగిరి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు సయ్యద్ గౌస్, విద్యార్థి విభాగ అధ్యక్షులు పులగం సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ర్యాలీలో పాల్గొని నేత సర్కిల్‌లోని నేతన్న విగ్రహానికి పూలమాలలు, నూలుదండలు వేసి బైక్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం నేతన్న సర్కిల్ నుండి గౌతమ్ బుద్ధ రోడ్డు మీదుగా బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్ఆర్ విగ్రహం, బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేశారు.అంబేద్కర్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీని ముగించారు.ర్యాలీ అనంతరం దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళనలు జరుగుతున్నాయని తెలిపారు. డీఎస్సీ లో జరిగిన మోసంపై సిబిఐ విచారణ చేయాలని, విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ డీఎస్సీలో అర్హత లేని వారికి దొడ్డిదారిన ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. తల్లిదండ్రులు కష్టపడి చదివించిన విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వం వెంటనే స్పందించి సీబీఐ విచారణకు ఆదేశించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.నియోజకవర్గ పరిశీలకులు యార్లగడ్డ మదనమోహనరావు మాట్లాడుతూ, విద్యాశాఖ మంత్రి నియోజకవర్గంలోనే ఇంత పెద్ద ర్యాలీ జరిగితే రాష్ట్రంలో ఇంకెంత జరిగి ఉంటుందో మీరు ఊహించు కోవచ్చు



అన్నారు. నిజంగానే మీరు తప్పు చేయలేదనే ఉద్దేశం ఉంటే సిబిఐ విచారణకు సహకరించాలనీ, లేకుంటే మీరు తప్పు చేసినట్లే అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఆప్కో చైర్మన్ చిర్లపల్లి మోహన్ రావు, నియోజకవర్గ పరిశీలకులు యార్లగడ్డ మదన్ మోహనరావు, వైకాపా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వీఎంఎం జిల్లా సమన్వయకర్తగా యాతం సౌజన్య

-బాపట్ల జిల్లాకు డిజిటల్ కోఆర్డినేటర్‌గా నియామకం -విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, విజ్ఞానంపై ఆసక్తి పెంపునకు కృషి

బాపట్ల,ఆగస్టు10,ప్రభాతవార్త,ప్రతినిధి:

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, విజ్ఞానశాస్త్రంపై ఆసక్తిని ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహిస్తున్న విద్యార్థి విజ్ఞాన్ మంథన్ కార్యక్రమంలో బాపట్ల జిల్లాకు జిల్లా సమన్వయకర్త (డిజిటల్)గా యాతం సౌజన్య నియమితులయ్యారు. ఈ మేరకు విజ్ఞాన భారతి ఆధ్వర్యంలోని విద్యార్థి విజ్ఞాన్ మంథన్ జాతీయ కార్యాలయం నుంచి ఆగస్టు 7న అధికారిక నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి.వృక్షనగర్‌కు చెందిన యాతం సౌజన్య ప్రస్తుతం ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడం, భారతీయ శాస్త్రవేత్తలు, పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధిపై అవగాహన కల్పించడం వంటి లక్ష్యాలతో దేశవ్యాప్తంగా నిర్వహించే వీఎంఎం కార్యక్రమాల్లో ఆమె బాపట్ల జిల్లాకు సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు.

**వీఎంఎం ద్వారా ప్రతిభకు ప్రోత్సాహం**

విద్యార్థి విజ్ఞాన్ మంథన్‌ను విజ్ఞాన భారతి ఆధ్వర్యంలో జాతీయ విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి జాతీయ విజ్ఞాన సంగ్రహాలయాల మండలి సహకారంతో నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్రంపై ఆసక్తిని పెంచడంతో పాటు శాస్త్రీయ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతోంది.

**విస్తృత బాధ్యతలు..**

బాపట్ల జిల్లా సమన్వయకర్త (డిజిటల్)గా నియమితులైన సౌజన్య జిల్లాలో వీఎంఎం 2026 27 కార్యక్రమాల అమలును సమన్వయం చేయనున్నారు. కార్యక్రమానికి సంబంధించిన కార్యకలాపాలను నిర్వహించడం , పురోగతిని పర్యవేక్షించడం, అవసరమైన సమాచారాన్ని కేంద్ర నిర్వహణ బృందానికి నివేదించడం వంటి బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. అదేవిధంగా జిల్లాలోని సంబంధిత పాఠశాలలు, విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు, ఇతర భాగస్వామ్య



సంస్థలతో సమన్వయం చేస్తూ వీఎంఎం కార్యక్రమాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. ముఖ్యంగా వీఎంఎం 2026 27‘ ప్రచారం, అవగాహన కార్యక్రమాలు, విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను జిల్లాలో విస్తృతంగా నిర్వహించాల్సి ఉంటుంది.

**విద్యార్థులకు శాస్త్రీయ వేదిక**

విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రీయ ప్రతిభను వెలికితీసేందుకు వీఎంఎం ఒక మంచి వేదికగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. పాఠ్యపుస్తక పరిజ్ఞానంతో పాటు పరిశీలన, తార్కిక ఆలోచన, శాస్త్రీయ దృక్పథాన్ని విద్యార్థుల్లో పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.బాపట్ల జిల్లాకు జిల్లా సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించిన సౌజన్యకు వీఎంఎం జాతీయ కన్వీనర్ ప్రశాంత్ కొడ్గిరే, విజ్ఞాన భారతి సెక్రటరీ జనరల్ పి.ఏ. వివేకానంద పై శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు, పాఠశాలలు, ఉపాధ్యాయులు వీఎంఎం కార్యక్రమంలో భాగస్వాములు కావడానికి ఆమె సమన్వయంతో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యం : చిల్లపల్లి

**మంగళగిరి, ఆగస్టు 10, ప్రభాతవార్త :** పేదల ఆరోగ్య సమస్యలకు అండగా నిలిచి, ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ ఎం ఎస్ఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు.ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి అందిన సీఎంఆర్ఎఫ్ అర్జీలను పరిశీలించి, అర్హులైన బాధితులకు సత్వర సహాయం అందేలా చర్యలు తీసుకున్నారు.ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఇద్దరు బాధితులకు మొత్తం రూ.8.30 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఏపీ ఎం ఎస్ ఐ డి సి ఛైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు అందజేశారు.ఈ సందర్భంగా బాధితులు తమ క్లిష్ట సమయంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ సమస్యలను గుర్తించి స్పందించి, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు వారు హృదయపూర్వక ధన్య వాదాలు తెలిపారు. అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అండగా నిలిచేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు.





## ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలి




**యడ్లపాడు, అగస్టు 10, ప్రభాతవార్త :** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని బాపట్ల వ్యవసాయ కళాశాల ఎల్‌నినో కంబాట్ టీమ్ శాస్త్రవేత్తలు సూచించారు. వర్షాధార ప్రాంతాల్లో పంటల ఎంపిక, విత్తన సమయం, నేలలో తేమ సంరక్షణ, నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా ఎల్‌నినో ప్రభావాన్ని కొంతవరకు అధిగమించవచ్చని తెలిపారు. యడ్లపాడు మండలంలోని లింగారావుపాలెం, సొలస, చంగిస్‌ఖాన్‌పేట, కొండవీడు గ్రామాల్లో ఎల్‌నినో కంబాట్ టీమ్ శాస్త్రవేత్తలు పర్యటించి రైతులతో మాట్లాడారు. వర్షపాతం లోటు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా దీర్ఘకాలిక పొడి పరిస్థితులు ఏర్పడి పంటలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో తక్కువ నీటితో సాగు చేయగల పంటల వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. వరి, చెరకు వంటి అధిక నీటి అవసరం ఉన్న పంటలపై నీటి కొరత ప్రభావం ఎక్కువగా ఉండవచ్చని తెలిపారు. విత్తనాలు మొలకెత్తడంలో ఆలస్యం, పుష్పించే దశలో తేమ కొరత, దిగుబడులు తగ్గడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ఒకే పంటపై ఆధారపడకుండా ప్రధాన పంటతోపాటు అనుకూలమైన అంతర పంటలు, పప్పుధాన్యాలను సాగు చేయడం ద్వారా వాతావరణ ప్రతికూలతల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. పంటల కీలక దశల్లో నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకుని సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. నేలలో తేమను సంరక్షి ంచేందుకు తగిన పద్ధతులు పాటిస్తూ అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు. ఈ క్షేత్ర పరిశీలనలో బాపట్ల వ్యవసాయ కళాశాల కీటక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్ఆర్ కోటేశ్వరరావు, వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె సుశీల, యడ్లపాడు మండల వ్యవసాయాధికారి ఏ హరిప్రసాద్, విలేజ్ అసిస్టెంట్లు గోపి, వినయ్, జ్యోస్న, పీహెచ్‌డీ విద్యార్థులు దివ్య, తన్విత, సోమి, సాయి ప్రసాద్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## పైప్ లైన్‌లు కాదు..సైడ్ డ్రైన్‌ల నిర్మాణం చేపట్టాలి

**యడ్లపాడు, అగస్టు 10, ప్రభాతవార్త :** మండలంలోని బోయపాలెం నుంచి ఉన్నవ వరకు చేపట్టిన సీసీ రోడ్డు విస్తరణ, నూతన బీటీ రోడ్డు, మురుగు కాలువల నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా నిర్వహిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రూ.కోట్లు వెచ్చించి చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బోయపాలెం పరిధిలో అక్రమణల తొలగింపు గుత్తేదారులకు శిరోభారంగా మారింది. దీంతో రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతూ. నెలల తరబడి కొనసాగుతున్నాయి అక్రమణ తొలగింపు నిరాకరించిన కొన్నిచోట్ల పోలీసులు బందోబస్తుతో ఆక్రమణలు తొలగించాల్సి న పరిస్థితి తలెత్తింది. రోడ్డు విస్తరణలో భాగంగా ఇటీవల నూలుమిల్లు దాటిన తర్వాత దక్షి ణం వైపు అడ్డ బజారులోకి ప్రవేశించటానికి పైపు కల్వర్టు నిర్మించారు. దీనిపై స్థానిక కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రల్వర్టు పైపులు వాటం లేకుండా మురుగునీరు కిందకు సాగి పోవటానికి వీలు లేని విదంగా ఏర్పాటు చేశారని విమర్శిస్తున్నారు. పైగా పైపు కల్వర్టుపై మట్టివేసి పూడ్చకుండా వదిలేయటంతో కాలనీలోకి రాకపోకలు నిలిచిపోయాయని, దీంతో కాలనీవాసులేదు సొంతగా కల్వర్టుపై మట్టి పోసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేసుకున్నట్లు వెల్లడించారు. విధి నిర్వహణలో అధికారుల అలసత్వంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కల్వర్టును సక్రమంగా నిర్మించాలని కాలనీవాసి సాంబిరెడ్డి కోరారు.



సైడ్ డ్రైన్ పైపులు వేసి పూడ్చని చిత్రం

## డ్వాక్రా మహిళల నగదు జమలో నకిలీ రూ.100 నోటు




**యడ్లపాడు, అగస్టు 10, ప్రభాతవార్త :** డ్వాక్రా మహిళల ఖాతాల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా నగదు జమ చేసే సమయంలో నకిలీ రూ.100 నోటు రావడంతో యడ్లపాడు ఎస్‌బిఐ బ్యాంకు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో నగదు లావాదేవీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు అధికారులు సూచించారు. నగదు తీసుకునే సమయంలో ప్రతి నోటును పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం మాత్రమే స్వీకరించాలని తెలిపారు. ముఖ్యంగా రూ.100 నోట్ల విషయంలో అనుమానం ఉంటే నోటును జాగ్రత్తగా పరిశీలించి, అది అసలైనదేనని నిర్ధారించుకున్న తర్వాతే తీసుకోవాలని సూచించారు. నకిలీ నోట్లు చలామణిలోకి రాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని బ్యాంకు అధికారులు కోరారు.

## గిరిజన ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు కృషి చేయాలి



**యడ్లపాడు, అగస్టు 10, ప్రభాతవార్త :** విద్య, ఆర్థిక అసమానతలు, అమాయకత్వం, సామాజిక సృహ లేకపోవడం గిరిజన గిరిజన ప్రజలు అభివృద్ధి చందలలేదని, వారి అభ్యున్నతి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని,1993 ఆగష్టు 9న అంతర్జాతీయ గిరిజన దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి గుర్తించి ప్రకటించటమైనదని గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి శ్రీను నాయక్ అన్నారు. మండల పరిధిలోని ఉన్నవ గ్రామంలో గిరిజన కమిటీ హాల్ నందు గిరిజన దినోత్సవ కార్యక్రమం ఆదివారం రాత్రి అత్యంత ఘనంగా జరిగింది. ఈ నేపద్యంలోనే ఐక్యరాజ్యసమితి కొన్ని అంశాలను గుర్తించిందని స్వయం నిర్ణయామిక హక్కు,ప్రభుత్వ జాతీయ కార్య కలాపాలలో పాల్గోనే హక్కు,వివక్ష నుంచి స్వేచ్ఛ హక్కు,ఒక నిర్దిష్ట, విశిష్ట సమానంగా మనుగడ సాధించేందుకు,గిరిజనులకు అవకాశాలు సన్నగిల్లడం, విశిష్టత, విద్య, వైద్యం, సమాచారం, శ్రమ హక్కులు, అభివృద్ధి, ఇతర ఆర్థిక సాంఘీక హక్కులతు, భూమి, ఇతర వనరులపై హక్కులు, స్వంత వ్యవస్థలను నిర్వహించుకునే హక్కులను ఐక్యరాజ్యసమితి గుర్తించి తీర్మాణం చేయడంలో అన్ని దేశాల సంతకాలు పెట్టాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వాలు నూతన ఆర్థిక విధానాల పేరుతో చేస్తున్న చట్టాలు ఎన్ని తెచ్చినా, శాసనాలు, ఎన్ని అమలు చేసినా గిరిజనులకు ఉన్న హక్కులు అమలు పరచటంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి గిరిజిన ప్రజలు వారి, వారి అవకాశాలను బట్టి కొంత మంది అడవులలో వ్యవసాయం చేసుకొంటున్నారు, మరికొంత మంది చిన్న చిన్న తండాలను, గుడాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. అతి తక్కువ మంది పట్టణాలల్లో నివాసాలుగా ఉంటున్నారు. ఈ విధంగా జీవన విధానంలో మార్పులు వస్తున్నప్పటికి మన గిరిజన సంస్కృతిక సాంప్రదాయాలను కాపాడు కోవలసిన అవసరం, ఆవస్యకత ఎంతైనా ఉందన్నారు. భారత రాజ్యాంగములోని 5వ మరియు 6వ షెడ్యులలో గిరిజనులకు భూమిని సొంతం చేసుకునే హక్కు చట్టపరంగా పత్రాలు సైతం కల్పించినప్పటికీ, భూమి పై హక్కులను నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. స్వయం పరిపాలన చేసుకునే అధికారం ఉన్నప్పటికి అదే విధంగా మౌళికమైన అంశాలపైన స్వతంత్ర ప్రతిపత్తి ఉన్నప్పటికి స్వతంత్ర్యం వచ్చి ఏళ్ళు గడుస్తున్న, పార్లమెంటు, శాసన సభలను ఎలాంటి చర్చలు చేయకుండా అలాంటి విషయాలు గిరిజన ప్రజలకు తెలియకుండా పాలక వర్గాలు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షులు కుంభ నాగేశ్వరరావు, ఉయ్యాల బలరాం, వి నాగేశ్వరావు, తోకల పాపారావు, హేమంత్ నాయక్, కళ్లెం శ్రీనివాసరావు, పాములు నాయక్ తో పాటు ఉన్నవ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## డాల్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా చండీయాగం



**వినుకొండ, ఆగస్ట్10, ప్రభాతవార్త:** పట్టణంలోని పాత శివాలయం నందు డాల్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా చండీయాగం లక్ష్మీ కుబేర యాగం రెండవ రోజుకు చేరుకున్నాయి. మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చందోలు మల్లికార్జునరావు మాట్లాడుతూ లోక కళ్యాణార్థం రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని వ్యాపార అభివృద్ధి జరగాలని కోరుతూ ఈ ఆదివారం ప్రారంభమైన యాగం ఐదు రోజులపాటు సాగుతుందని తెలిపారు. ఇందుకోసం తాటాకులతో ప్రత్యేక యాగశాల ఏర్పాటు చేశారు. వేదపండితులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో 700 మంత్రాలను 25 మంది పండితులచే పారాయణం చేస్తూ హోమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెండ్యాల పుల్లారావు, కన్నెగండ్ల కోటేశ్వరరావు, సురేష్, భక్తులు పాల్గొన్నారు.

# దగా డీఎస్సీ నిర్వహించి అర్హులకు అన్యాయం చేశారు

**చిత్తశుద్ధి ఉంటే సీబీఐ విచారణ జరపాలి**

- **మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలి**






**సత్తెనపల్లి (ఆగస్టు 10, ప్రభాతవార్త):** డీఎస్సీ నిర్వహణలో అక్రమాలు జరిగాయని, దీనిపై సీబీఐతో విచారణ జరిపించాలని సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి డిమాండ్ చేశారు. డీఎస్సీ అక్రమాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని కోరారు.


ఏపీ జెన్‌జెడ్ వార్ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి నేతృత్వంలో సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి తాలూకా సెంటర్‌లోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి మాట్లాడుతూ డీఎస్సీ నిర్వహణలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. స్పోర్ట్స్ కోటా శాతాన్ని జీవో ద్వారా మార్చి కొందరికి అనుకూలంగా ఉద్యోగాలు కట్టబెట్టే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ వ్యవహారానికి బాధ్యత వహించి మంత్రి పదవికి రాజీనామా చేయాలని అన్నారు. అదేవిధంగా విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, నిరుద్యోగులకు ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ శాంతియుతంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలను అడ్డుకోవడం, కార్యకర్తలపై దాడులకు పాల్పడటం వంటి చర్యలకు కూటమి ప్రభుత్వం పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ప్రజా సమస్యలపై తమ పార్టీ చేస్తున్న పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో అక్రమ మట్టి దందా, మద్యం, గంజాయి, పేకాట వంటి కార్యకలాపాలు పెరిగాయని ఆరోపిస్తూ యువత వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రజలు అన్ని అంశాలను గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని గజ్జల పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ, వార్డు స్థాయి పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యాలతో కన్నా కళాకృతి

**ఎమ్మెల్యేకు వినూత్నంగా జన్మదిన శుభాకాంక్షలు**




**సత్తెనపల్లి (ఆగస్టు 10, ప్రభాతవార్త):** అభిమానానికి సృజనాత్మకతను జోడించి సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణకు టీఎన్ఎస్ఎఫ్ సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు గొల్లపల్లి వీరాంజనేయులు వినూత్నంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆగస్టు 13న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని వివిధ రకాల ధాన్యాలు, పప్పుదినుసులు, సుగంధ ద్రవ్యాలు, విత్తనాలను ఉపయోగించి ఆయన చిత్రపటాన్ని రూపొందించారు. బియ్యం, పప్పులు, వివిధ రకాల విత్తనాలు, సుగంధ ద్రవ్యాలను కళాత్మకంగా అమర్చి కన్నా లక్ష్మీ నారాయణ ముఖచిత్రాన్ని తీర్చిదిద్దారు. చిత్రపటం పక్కన "జన్మదిన శుభాకాంక్షలు కన్నా.. మనందరి అన్నా" అనే సందేశాన్ని రూపొందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వినూత్న కళాకృతి చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గొల్లపల్లి వీరాంజనేయులు మాట్లాడుతూ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షి ంచారు. ప్రజా సేవలో మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని కోరారు. ఎమ్మెల్యేపై తనకున్న అభిమానాన్ని వినూత్న కళారూపంగా ఆవిష్కరించిన ఈ ధాన్యాల చిత్రపటం జన్మదిన వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ధాన్యాలు, పప్పుదినుసులు, సుగంధ ద్రవ్యాలు, విత్తనాలతో రూపొందించిన ఈ కళాకృతి స్థానికంగా పలువురిని విశేషంగా ఆకట్టుకుంది.



## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**గురజాల, ఆగస్టు 10 ప్రభాతవార్త :** మండలంలోని మాడుగుల గ్రామ శివారులోని బోడు వద్ద సోమవారం సుమారు 60 యేళ్ల వయస్సున్న ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పొలాల్లో బోరు వద్ద దుర్వాసన వస్తుండడంతో రైతులు గమనించి సమాచారం అందించడంతో వీఆర్వో సర్వేశ్వరరావు సంఘటనా ప్రాంతానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడు ఒంటిపై తెల్లచొక్కా ధరించి ఉన్నాడు. మృతుని వివరాలు తెలిసిన వారు సెల్ నెం.9440796257, 88854 01879లకు సమాచారం అందించాలని సీఐ మురళి, ఎస్ఐ వినోద్‌కుమార్‌లు తెలిపారు. మృతదేహం కుళ్లిపోవడంతో గ్రామంలోనే పోస్టుమార్టం జరిపి అంత్య క్రియలు నిర్వహించినట్లు వారు చెప్పారు.

## పట్టణంలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు

**వినుకొండ, ఆగస్ట్10, ప్రభాతవార్త:** పురపాలక సంఘం పరిధిలో ఈ నెల 11వ తేది నుంచి 14వ తేది వరకు స్పెషల్ ఆధార్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఓబయ్యకాలనీలోని 9వ వార్డు మండల ప్రజాపరిషత్ పాఠశాల, లాయర్స్ స్ట్రీట్ 1, 4వ స్వర్ణ వార్డు సచివాలయాల నందు ఈ క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

## జిల్లా కబడ్డీ జట్టుకు కంభంపాడు విద్యార్థినులు ఎంపిక



నూజెండ్ల, ఆగస్ట్10, ప్రభాతవార్త: నరసరావుపేటలో జరిగిన అండర్ 17 కబడ్డీ(బాలికలు) పోటీల్లో మండలంలోని కంభంపాడు జెడ్పి పాఠశాలకు చెందిన విద్యార్థినులు జి.వెంకటలక్ష్మి, కె.అఖిల ప్రతిభ కనబర్చి తిరుపతిలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు పల్నాడు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానో పాధ్యాయులు నాగ బసవయ్య తెలిపారు. ఈ మేరకు పాఠశాల ఉపాధ్యాయులు అంజిరెడ్డి, శ్రీనివాసరావు, సూర్యప్రకాశరావు, గోవిందు తదితరులు విద్యార్థినులు అభినందించారు.

## మహిళపై దాడి కేసులో ముగ్గురికి జైలు శిక్ష

గుంటూరు క్రైమ్, ఆగస్టు10, ప్రభాతవార్త: కోర్టు ప్రాంగణంలో మహిళపై దాడి చేసిన కేసులో ముగ్గురు నిందితులకు గుంటూరు న్యాయమూర్తి వి. దీప్తి నిందితులు ముగ్గురికి శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఏ1 పెరి అవినాష్‌కు 2 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.21,000/ జరిమానా విధించారు. అలాగే ఏ2 పెరి అమృతరాణి, ఏ3 పెరి శ్రావణిలకు ఒక్కొక్కరికి 1 సంవత్సరం కఠిన కారాగార శిక్ష, రూ.1,000/ జరిమానా విధించారు. మే1.2024న గుంటూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో కుటుంబ వివాదానికి సంబంధించి బాధితురాలిపై ముగ్గురు నిందితులు దాడి చేయడం, దూషించడం, ఆమె మొబైల్ ఫోన్‌ను ధ్వంసం చేసి బెదిరించిన ఘటనపై కేసు నమోదైంది. ఈ కేసులో దర్యాప్తు అధికారి ఎస్.కె. సలామ్, ఎస్.ఐ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్. సౌరి వాదనలు వినిపించారు. కోర్టు కానిస్టేబుల్ టి. విజయ్ కుమార్, కోర్టు లైజన్ ఇన్‌స్పెక్టర్ ఆర్. ధర్మేంద్ర బాబు తదితరులు కేసు విచారణలో సమన్వయం చేశారు.

## ఓ వ్యక్తికి 14 రోజులు రిమాండ్

**గుంటూరు క్రైమ్, ఆగస్టు10, ప్రభాతవార్త:** ప్రేమ పేరుతో వయోజని ఓ యువతని మోసగించి ఆమె ఫోటోలను సోషల్ మీడియాలో పెడతానని భయభ్రాంతులకు గురిచేసిన వ్యక్తిని పట్టాపురం పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు అనంతరం కోర్టులో హాజరు పరచగా ఆ వ్యక్తికి మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించారు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం నంద్యాల జిల్లా పోలూరు గ్రామానికి చెందిన కుమ్మరి ప్రసాదు అనే వ్యక్తిని ఆదివారం గుంటూరు పట్టణం బ్రాడీపేట 4/21వ లైనులో అతను అద్దెకు ఉండే ఇంటి వద్ద పట్టాభిపురం సిఐ, గంగా వెంకటేశ్వర్లు అరెస్ట్ చేసి సోమవారం కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ అతనికి 14 రోజులు రిమాండ్ ఇచ్చారు. విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం, ముద్దాయికి ఫిర్యాదుదారురాలితో సుమారు ఐదు సంవత్సరాలుగా పరిచయం ఉండి, గతంలో ప్రేమ సంబంధం కొనసాగింది. అనంతరం ఫిర్యాదుదారురాలిని అసభ్య పదజాలంతో దూషించి, కొట్టి, తన వద్ద ఉన్న వారి వ్యక్తిగత ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తానని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేసినట్లు, ఆమెపై ఒత్తిడి తెచ్చి పలుమార్లు శారీరక సంబంధానికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. జూన్ 24వ తేదీన బ్రాడీపేట 4/21లోని తన గదికి ఫిర్యాదుదారురాలిని తీసుకువెళ్లి, ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా శారీరకంగా కలిసినట్లు, అనంతరం రూ.5,00,000/ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసి, వ్యక్తిగత ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తానని బెదిరించినట్లు విచారణలో వెల్లడైంది. మరుసటి రోజు ఫిర్యాదుదారురాలి అక్కకు కూడా ఫోన్ చేసి ఇదే విధంగా బెదిరించినట్లు తెలిసింది.

## 29మంది వ్యక్తులు అరెస్ట్

**గుంటూరు క్రైమ్, ఆగస్టు10, ప్రభాతవార్త:** గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న 29 మంది వ్యక్తులను నల్లపాడు పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. పోలీసులు వివరాలు ప్రకారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్1లో ఉన్న వైఫై గెస్ట్ హౌస్, 3వ అంతస్తు, రూమ్ నెం.304లో పేకాట నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో గుంటూరు జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ కి రాబడిన సమాచారం తో డీఎస్‌బీ డీఎస్పీ ఆలహరి శ్రీనివాస్ కి సమాచారం అందించి, సీఐ2 మల్లికార్జునరావు ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్, నల్లపాడు పోలీస్ సిబ్బంది సంయుక్తంగా రైడ్ నిర్వహించారు. ఈ దాడిలో పేకాట నిర్వహిస్తున్న 29 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 27 సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం, రూ.23,77,120/ నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాట నిర్వహించినట్లు గుర్తించిన ఈశ్వరరావు (గుడివాడ), ఫణి (గుంటూరు)తో పాటు మొత్తం 29 మందిని తదుపరి విచారణ నిమిత్తం నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలు తో గుంటూరు జిల్లా పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తూ, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు జూదర్లను హెచ్చరించారు.

## బీఎల్ఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణ

**ఎస్ఐఆర్ కార్యక్రమంపై అవగాహన**

**సత్తెనపల్లి (ఆగస్టు 10, ప్రభాతవార్త):** సత్తెనపల్లి రూరల్, అర్బన్ మండలాల పరిధిలోని బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లకు ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురించిన అనంతరం చేపట్టాల్సిన కార్యక్రమాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సత్తెనపల్లిలోని కాకతీయ కళ్యాణ మండపంలో ఈ శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు నిర్వహించాల్సిన విధులు, చేపట్టాల్సిన చర్యలు, ఓటర్ల నుంచి స్వీకరించాల్సిన అభ్యంతరాలు, దరఖాస్తులపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి తహసీల్దార్ కె.ఎస్. చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ ఎన్. ఆనంద్‌కుమార్, ఎంపీడీవో బి. శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ1 ఏ. శ్రీనివాసరావు, ఎంఈఓ2 ఏ. రాఘవేంద్రరావుతో పాటు బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, అదనపు ఏఈఆర్ఓలు పాల్గొన్నారు.

## కన్నా లక్ష్మీ నారాయణకు భారీ కటౌట్ ఏర్పాటు

**72వ జన్మదినం ..50 ఏళ్ల రాజకీయ ప్రస్థానానికి గుర్తుగా**

**సత్తెనపల్లి (ఆగస్టు 10, ప్రభాతవార్త):**




తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, మాజీ మంత్రివర్యులు, సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కన్నా లక్ష్మీనారాయణ 72వ జన్మదినాన్ని పురస్కరించుకుని, ఆయన 50 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని పురస్కరించుకుని సత్తెనపల్లి నియోజకవర్గ కార్యకర్తలు భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు.


కార్యకర్తలు గుర్రం వెంకటేశ్వర్లు, మక్కపాటి సుబ్బారావు (సుధాకర్), కాకుమాను సైదయ్య ఆధ్వర్యంలో ఈ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. కన్నా లక్ష్మీనారాయణ 50 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని పురస్కరించుకుని, ఆయన 72వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తూ కార్యకర్తలు తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ కన్నా లక్ష్మీనారాయణపై తమకున్న అభిమానాన్ని, ఆయనతో తమకున్న అనుబంధాన్ని వినూత్నంగా చాటుకుంటున్నామని తెలిపారు. భారీ కటౌట్ స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


6 page.qxd 111111:6 page.qxd 01/01/2001 10:12 Page 1



# పల్నాడు జిల్లా వార్త



## పోస్టల్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



**నరసరావుపేట, ఆగస్టు 10 ప్రభతవార్త :** పోస్టల్ పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఆల్ ఇండియా పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ నరసరావుపేట డివిజన్ ఆధ్వ ర్యంలో సోమవారం పోస్టల్ సూప రింటెండెంట్ కార్యాలయం ఎదుట నినాదాలు చేసి, అధికారులకు మెమొరాండం అందజేశారు. ఆర్‌టీపీ ఉద్యోగుల సర్వీసు రెగ్యులరైజేషన్ కోర్టు తీర్పును అమలు చేయాలన్నారు. పెన్షన్ పనులను డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ అకౌంట్స్‌కు మార్చే ఉత్తర్వులు రద్దు చేయాలని, ఫ్యామిలీ పెన్షన్ క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ సమస్యలు, క్రమశిక్షణ చర్యలను పరిష్కరించాలని, పోస్టుమ్యాన్‌ల అప్‌గ్రేడేషన్ పేకు సంబంధించిన 2019 జనవరి 31 ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సయ్యద్ మూసా, డివిజనల్ కార్యదర్శి డి.సిహెచ్.వి. రెడ్డి, ట్రెజరర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు నరసరావుపేటకు రానున్న మంత్రి సత్యకుమార్

### ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే అరవిందబాబు



**నరసరావుపేట, ఆగస్టు 10 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో మంగళవారం తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ప్రారంభ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల పంపిణీలో భాగంగా తొలివిడతలో 300 వాహనాలను ప్రారంభించేందుకు సిద్ధం చేశారు. ఈ వాహనాలను ఇప్పటికే నరసరావుపేట పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే అరవింద బాబు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌ను సందర్శించి వాహనాల ప్రారంభ కార్యక్రమానికి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లింగంగుంట్లలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కూడా మంగళవారం పలు వైద్య సదుపాయాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్, డయాలసిస్ యూనిట్, నియోనేటల్ యూనిట్, హైటెక్ ల్యాబ్, ఫిజియోథెరపీ యూనిట్‌లను మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. నరసరావుపేటలోని ప్రభుత్వ పాత ఏరియా ఆసుపత్రిలో నాబార్డు నిధులతో సుమారు రూ.55 కోట్ల అంచనా వ్యయంతో మదర్ అండ్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్) బ్లాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకు సంబంధించిన తేదీని మంగళవారం ప్రకటించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డా. చదలవాడా అరవింద బాబు, కూటమి శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ లక్కిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు క్రాంతి కుమార్, బి. శ్రీను పాల్గొన్నారు.

## ఎంఎఎంలో నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహన



**రొంపిచర్ల, ఆగస్టు 10 ప్రభాతవార్త :** నరసరావుపేటలోని ఎంఎఎం ఉమెన్స్ ఇంజ నీరింగ్ కళాశాలలో సోమవారం బ్రహ్మకుమారీస్ మరియు కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ (మత్తు పదార్థాల రహిత భారత్) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమస్త ప్రతినిధి అయినవోలు సాంబశివరావు అధ్య క్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతి థుల ుగా ఎంఎఎం విద్యాసంస్థల చైర్మన్ ఎం.ఆ ర్. శేషగిరిరావు, కళాశాల డైరెక్టర్ డి. శ్రావ్య మాట్లాడారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ, స్పష్టమైన లక్ష్యాలతో నిర్దేశించుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. నిత్యం ధ్యానం, యోగా చేయాలని, స్పష్టమైన లక్ష ్యం నిర్దేశించుకోని ముందడుగు వేయాలన్నారు. అనంతరం బ్రహ్మకుమారీస్ ప్రతినిధుల సమక్షంలో విద్యార్థినులందరిచే "నషా ముక్తి ప్రతిజ్ఞ" చేయించారు. "నషా రహిత భారత్ ఆరోగ్యకర భారత్ ఆనందమయ భారత్" లక్ష ్య సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## సంగీత అభిమానులను అలరించిన సంగీత విభావరి



**నరసరావుపేట టౌన్ఆగస్టు 10 ప్రభాతవార్త ::** నరసరావుపేట పట్టణంలో నిర్వహించిన ఘంటసాల మరియు బాలు గార్ల సంగీత విభావరి కార్యక్రమం ప్రేక్షకులను అలరించినది. పాటలు పాడిన నిర్వహించిన కొత్త మాసు సుధాకర్, నర్రా సత్యనారాయణ, విజయలక్ష్మి, శైలజ గార్లను అందరూ అభినందించినారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ సంగీతం అంటే అందరికీ ఇష్టమన్నారు. అది ఒక మంచి కళ అని సంగీతానికి రాళ్లు కూడా కరుగుతాయని సామెత ఉన్నదన్నారు., వందలాదిమంది అభిమానులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో తను కూడా పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు నాగసరపు సుబ్బరాయ గుప్తా, కపలవాయి విజయ్ కుమార్, గట్టుపల్లి సత్యనారాయణ, ప్రవళిక సత్యం, సీతారామాంజనేయులు, చీతిరాల గురు పెద్దన్న, దేసు శ్రీనివాసరావు, చేగు వెంకటేశ్వరరావు, రావి క్రింది వెంకట సుబ్బారావు, రెడ్డి మురళీకృష్ణ, కనుమూరి రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి

### జిల్లా ప్రజా రవాణా అధికారిణి అజితకుమారి



**నరసరావుపేట టౌన్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడ కుండా, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఏకాగ్రతతో వాహనాలు నడపాలని జిల్లా ప్రజా రవాణా అధికా రిణి టి. అజితకుమారి సూచించారు. నరసరా వుపేట ఏపీఎస్ఆర్టీసీ హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్‌లో 25వ బ్యాచ్ శిక్షణ ముగింపు సందర్భంగా శిక్షణ పొందిన డ్రైవర్లను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్, డిపో మేనేజర్ బి. శ్రీనివాసరావు పాల్గొని శిక్షణ పూర్తి చేసిన డ్రైవర్లకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. త్వరలో 26వ బ్యాచ్ శిక్షణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.కె.ఎం. సుబాని, సి.హెచ్. మోహనరెడ్డి (రిటైర్డ్) పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

**నరసరావుపేట టౌన్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏఎం.రెడ్డి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-I నిర్వహణలో సోమవారం ఉప్పలపాడు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత మరియు ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కళాశాల కార్యదర్శి డాక్టర్ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో నులిపురుగుల నివారణకు ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు. పిల్లలు పరిశుభ్రమైన అలవాట్లను చిన్న వయస్సు నుంచే అలవర్చుకోవాలని, చేతులను సబ్బుతో క్రమం తప్పకుండా కడుక్కోవడం, శుభ్రమైన నీటిని తాగడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం, పాదరక్షలు ధరించడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. భార్గవ భూషణ్ రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ చీకటి అజయ్ కుమార్, పాఠశాల హెడ్‌మాస్టర్ జి. లక్ష్మీ నరసింహం, ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా సుందరకాండ ప్రవచనం

**నకరికల్లు , ఆగస్టు 10 ప్రభాతవార్త ::** ఆధ్యాత్మిక సేవా స్రవంతి, మేళ్లచెరువు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నరసరావుపేట అరండల్‌పేటలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో సుందరకాండ ప్రవచనం వైభవంగా నిర్వహించారు. ప్రవచకులు బ్రహ్మశ్రీ బుర్రా భాస్కర శర్మ సుందరకాండ విశిష్టతను, హనుమంతుని భక్తి, ధైర్యం, సేవాభావాలను వివరిస్తూ భక్తులను ఆధ్యాత్మిక భావనలో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక సేవా స్రవంతి వ్యవస్థాపకులు జల్లి శ్రీనివాసరావు, మేళ్లచెరువు ఫౌండేషన్ ప్రతినిధులు మేళ్లచెరువు వీరాంజనేయులు-మల్లికాంబల మనవడు రాజీవ్ గుప్తా, మండవ వెంకటరత్నం, బండి కొండారెడ్డి, తెలికేపల్లి లక్ష్మీ ్మనారాయణ శాస్త్రి పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి, సాగి వీరాంజనేయ శాస్త్రి ఆలయ ధర్మకర్త డాక్టర్ పామరాజు వెంకటేశ్వర్లు, డాక్టర్ ఒగూరి కోటయ్య దంపతులు, డాక్టర్ పోపూరి గోపాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రవచనాన్ని ఆలకించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## త్రాగునీటి ఎద్దడి..

### అడుగంటి పోతున్న భూగర్భ జలాలు
### బోర్లు చెడిపోయిన పట్టించుకోని పంచాయతీ అధికారులు
### నీళ్లు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు





**కారంపూడి ఆగస్టు 10 ప్రభాతవార్త :** ; కారంపూడిమండుతున్న ఎండలు అడుగంటి పోతున్న భూగర్భ జలాలు నీళ్ల రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రమైన కారంపూడి లో త్రాగునీటి సమస్య తలెత్తింది. బోర్లలో నీళ్ల రాకపోవటం, కొన్ని బోర్లు చెడిపోవడంతో ప్రజలు పలు రకాల ఇబ్బందులు పడుతున్నారు. కారంపూడిలో గ్రామపంచాయతీ అధికారులు వివిధ ప్రాంతాలలో సుమారు 20 బోర్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆరు బోర్లు నీళ్ల రాక ఇబ్బంది పడుతున్నారు. వినుకొండ రోడ్ లోని ఉన్న బోర్ లో నీళ్ల రాక ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇందిరానగర్ కాలనీలోని మరో రెండు బోర్లు మొర ఇంచాయి. సచివాలయం 2 పరిధిలోని మరో బోర్ నుండి నీళ్ల రాకపోవడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో ప్రజల ఉన్నారు. గ్రామపంచాయతీకి ప్రతి ఏటా నీటి పన్ను రూపంలో బకాయిలు చెల్లిస్తున్న అధికారులు మాత్రం నీటి సరఫరా విషయంలో నిరక్ష ్యంగా ఉన్నట్టు తెలుస్తుంది. బోర్లు చెడిపోయిన అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. గత మూడేళ్ల క్రితం బోర్లు మరమ్మత్తులు చేపట్టినప్పటికీ ఇప్పటికీ అవే బోర్లు పనిచేస్తున్నాయే తప్ప నూతన మరమ్మత్తులు ఏమి చేపట్టినట్లు తెలుస్తుంది. ఇటీవల కాలంలో కొండ రోడ్ లో రెండు బోర్లు ఏర్పాటు చేసినప్పటికీ బోర్ల నుండి మాత్రం ఎలాంటి నీరు రావడంలేదని తెలుపుతున్నారు. వేల రూపాయలు పెట్టి బోర్లు ఏర్పాటు చేసిన నీరు రాబడంతో అధికారులు కూడా నిమ్మలంగా ఉన్నారు. వేసవి కాలాన్ని తలపిస్తున్న అధికారులు మాత్రం నీటి సౌకర్యం కల్పించడంలో విఫలమయ్యారనే చెప్పవచ్చు. గ్రామ పంచాయతీకి ప్రతి ఏటా ఆదాయం లక్షల్లో ఉన్న నీటి సౌకర్యం కల్పించడంలో పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి. అధికారులు స్పందించి తాగునీటి సమస్య తెలపకుండా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఇంచార్జ్ పంచాయతీ కార్యదర్శి వివరణపట్టణంలో త్రాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఈ విషయంపై ఇన్చార్జి పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు నాయక్ వివరణ కోరెందుకు ప్రయత్నించగా ఆయన స్పందన లేదు.

## డీఎస్సీ అక్రమాల పై సిబిఐ దర్యాప్తు జరపాలి

### వైసీపీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి



**నరసరావుపేట, ఆగస్టు 10 ప్రభాతవార్త : :** మెగా డీఎస్సీలో భారీ అక్రమం జరిగిందని, ఈ అక్రమంపై సిబిఐ దర్యాప్తు చేపట్టాలని వైసీపీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీలో అక్రమాలకు వ్యతిరేకంగా, విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ కోరుతూ మరియు యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వైసీపీ పిలుపుమేరకు సోమవారం డాక్టర్ గోపిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నరసరావుపేట పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. స్థానిక గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయం నుండి ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, ఆర్డీఓకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గ కోఆర్డినేటర్ పూనూరు గౌతంరెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ, గత పది రోజులగా కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో జరిగిన అక్రమాలపై వైసీపీ అలుపెరగని పోరాటం చేసిందన్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేశామని, రిలే నిరాహార దీక్షలు, వైసీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కనుసనల్లో జరిగిన డీఎస్సీ అక్రమాలకు మరియు డీఎస్సీ ఫస్ట్ ర్యాంకర్ నవీన్ దగ్గర్నుంచి స్పోర్ట్స్ కోటలో దాదాపు 400 ఉద్యోగాలు అమ్ముకున్నారని ఆరోపించారు. వీటిపై సిబిఐ దర్యాప్తు జరపాలనీ, అప్పటి వరకు విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్ రాజీనామా చేయాలని మేము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆదివారం కర్నూల్ కొండారెడ్డి బురుజు వద్ద డీఎస్సీ టీచర్ లందరూ ర్యాలీ నిర్వహించారని చెబుతున్నారని, ఈ ర్యాలీలో ఎంతమంది టీచర్లు ఉన్నారో, ఎంతమంది టీచర్లు కాదో మాకు తెలియదన్నారు. తాము మెరిట్ లో ఉద్యోగాలు వచ్చిన ఉపాధ్యాయులకు వ్యతిరేకం కాదని మెరిట్లో రాకుండా స్పోర్ట్స్ కోటాలో అన్యాయంగా, అక్రమంగా అసలు రాత పరీక్ష రాయకుండా, ఉద్యోగాలు తెచ్చుకున్న వారికి మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు. అక్రమంగా ఉద్యోగాలు పొందిన వారిని తొలగించి మెరిట్ స్టూడెంట్స్ కి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో అసలు పరీక్షలు నిర్వహించకుండానే ఉద్యోగాలు ఇచ్చారని, జీవో నెంబర్ 4, 47 ఎందుకు తీసుకువచ్చారు, మరి ఎందుకు తీసేసారని ప్రశ్నించారు. నిజమైన మెరిట్ విద్యార్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతున్నామని డా. గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెన్నారెడ్డి హత్యపై సమగ్ర విచారణ జరపాలి

### బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి
### ఎస్పీని కోరిన వైసీపీ నేతలు



**మాచర్ల టౌన్ ఆగస్టు 10 ప్రభాతవార్త..**ఎస్పీని కోరిన వైసీపీ నేతలు వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి నవులూరి చెన్నారెడ్డి హత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపి, హత్యకు బాధ్యులైన అసలు నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని వైసీపీ పల్నాడు జిల్లా నేతలు కోరారు. ఈ మేరకు వైసీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..చెన్నారెడ్డి హత్యకు సంబంధించిన అన్ని కోణాల్లోనూ నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టి, ఘటన వెనుక ఉన్న వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. హత్యకు పాల్పడిన అసలు నిందితులను త్వరితగతిన గుర్తించి, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఘటనపై ఎలాంటి అనుమానాలు, అపోహలకు తావులేకుండా పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కొన్ని పత్రికలు, మీడియా సంస్థల్లో వెలువడిన తప్పుడు కథనాలను ఆధారంగా చేసుకుని పార్టీ నాయకులపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని వైసీపీ నేతలు ఎస్పీని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, వినుకొండ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి, పెదకూరపాడు నియోజకవర్గ పరిశీలకులు యెనుముల మురళీధర్ రెడ్డితో పాటు పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఫస్ట్ ఎయిడ్ ప్రొఫెషనల్ ట్రైనింగ్ సర్టిఫికెట్స్ అందజేత

**నరసరావుపేట టౌన్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** న్యూఢిల్లీ సెయింట్ జాన్స్ అంబులెన్స్ సహకారంతో నిర్వహించిన ఫస్ట్ ఎయిడ్ ప్రొఫెషనల్ ట్రైనింగ్‌ను ఆర్ఎంపీ, పీఎంపీలు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కళాశాలల విద్యాసంస్థల చైర్మన్ ఎమ్ఆర్ శేషగిరిరావు హాజరై, శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స అందించే విధానం, ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి శిక్షణ అందించారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారిని నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కోశాధికారి డాక్టర్ నంద్యాల రాంప్రసాద్ రెడ్డి, సమస్త ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు వశిష్ట కళాశాల విద్యార్థుల ఎంపిక

**నరసరావుపేట, ఆగస్టు 10 ప్రభాతవార్త ::** అమరావతిఛాంపియన్‌షిప్-2026 జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన 14 మంది వశిష్ట కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు సోమవారం వివరాలను తెలియజేశారు. వివిధ క్రీడాంశాల్లో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 19 నుంచి తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వై. సురేష్‌లను , కళాశాల చైర్మన్ ముద్దుల కోటేశ్వరరావు, డైరెక్టర్ మద్దుల నరేష్ కుమార్, డైరెక్టర్స్ నర్రా శేషగిరి, నల్లపాటి శ్రీకాంత్, మదన రాజా ఇతర అధ్యాపకులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలని చైర్మన్ కోటేశ్వరరావు ఆకాంక్షించారు.

## దోమలు ప్రజారోగ్యానికి శత్రువులు

### ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్



**క్రోసూరు( ఆగస్టు 10 ప్రభాతవార్త )** దోమలు ప్రజారోగ్యానికి శత్రువులని, దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన దొడ్లేరు గ్రామంలో జరుగుతున్న యాంటీ లార్వా ఆపరేషన్ (ఎబేటు ద్రావణం పిచికారి కార్యక్రమం) ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటుకు గురికాకుండా దోమతెరలు లో నిద్రించాలని, మస్కిటో రేప్లెంట్స్ వాడటం, సాయంత్రం ఐదు గంటల నుండి 6 గంటల సమయంలో తలుపులు, కిటికీలు మూసి ఉంచటం చేయాలన్నారు పొడవాటి చేతులు కలిగిన శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచేలా లేత రంగు దుస్తులు ధరించాలన్నారు వాడుకులో లేని కంటైనర్లను బోర్లించి ఉంచాలన్నారు వారానికి ఒకసారి నిల్వ నీటిని పారబోసి శుభ్రపరిచి కాసేపు ఎండలో ఉంచి మరలా నింపుకోవాలని తెలిపారు మురికి నీటి నిల్వలు, మురికి కాలువలలో వారానికి ఒకసారి వేస్ట్ ఆయిల్ లేదా కిరోసిన్ వేయాలన్నారు ఇంటి పరిసరాల్లో పనికిరాని, పగిలిపోయిన వాడని వస్తువులను, త్రాగి పడేసిన కొబ్బరి బొండాలను, టీ కప్పులను, పాత టైర్లు మొదలైనవి లేకుండా చేయటం ద్వారా నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ ఆదినారాయణ, ఆరోగ్య కార్యకర్తలు అనుపమ, మగ ఆరోగ్య కార్యకర్త శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

MN 8 PAGE-BPTfff:MN 8 PAGE-BPTfff 01/01/2001 10:02 Page 1




# కిడ్నీలు జరబద్రం...

**జిల్లాలో పెరుగుతున్న కిడ్నీ బాధితులు..**
**ఆధునిక జీవనశైలి తో కిడ్నీలకు ముప్పు..**
**అందుబాటులో అత్యాదునిక వైద్య పద్ధతులు..**
**జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచన...**

**గుంటూరు మెడికల్, ఆగస్టు10,(ప్రభాతవార్త )**

ఆధునిక జీవన విధానంతో రోజు రోజుకి కిడ్నీ బాధితుల సంఖ్య పెరిగిపోతున్నారు.బయట ఆహార పదార్థాలు ఎక్కువుగా తీసుకోవడం ఆరోగ్యకరమైన ఆహారానికి దూరంగా ఉండటం బయట దొరికే ఫాస్ట్ ఫుడ్,జంక్ ఫుడ్ కి అలవాటు పడి కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నట్లు వైద్యవర్గాలు తెలుపుతున్నాయి.ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల కిడ్నీ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.



జిల్లాలో అధిక సంఖ్యలో బాధితులు..

ప్రతి రోజు గుంటూరు ప్రభుత్వ వైద్యాశాలకు సుమారుగా 100మంది కిడ్నీ సమస్యలతో అస్పత్రి ఓపి విభాగానికి వస్తున్నారు.అలాగే ప్రతి నిత్యం 40మంది వరకు డయాలసిస్ చికిత్స పొందుతున్నారు..

**వ్యాధి లక్షణాలు**

కిడ్నీ వ్యాధుల యొక్క లక్షణాలుసాధారణంగా కిడ్నీ వ్యాధులు లక్షణాలు మొదటి దశలోనే కనిపించవు. అయితే రోజు రోజుకీ వ్యాధి ముదురుతున్నప్పుడు కనిపించే సాధారణంగాతీవ్రమైన అలసట,వికారం, వాంతులు,ఆకలిలేకపోవడంకడుపు నొప్పి,జ్వరం,కళ్ల ఉబ్బడంకండరాల నొప్పులు,నిద్రలేమికాళ్లు, పాదాలు మడమలు ఉబ్బడం,పొడి చర్మంమరియు దురదమూత్ర విసర్జన సమయంలో నొప్పి మంట,మూత్రం దుర్వాసన రావడంమూత్రంలో రక్తం రావడంతరచుగా మూత్ర విసర్జనకు వెళ్లాల్సి రావడం,కిడ్నీలు శరీరం వెనుక వెన్నుపూసకు ఇరువైపులా ఉంటాయి. కిడ్నీలకు సమస్య వస్తే నడుము నొప్పి కూడా వస్తుంది.

**కిడ్నీ వ్యాధులు రావడానికి కారణాలు...**

మూత్రనాళం చిన్నదిగా ఉండడం (బ్యాక్టీరియా బయటి నుంచి మూత్రాశయంలోకి వెళ్లడాన్ని సులభతరం చేస్తుంది) బలహీనమైన రోగనిరోధక వ్యవస్థను కలిగి ఉండడంమూత్ర కాథెటర్ ను ఉపయోగించడంఅధిక రక్తపోటు మరియు మధుమేహం (డయాబెటిస్) వ్యాధుల బారిన పడడంఎక్కువసేపు మూత్ర విసర్జన చేయకుండా ఆపుకోవడంనీటిని చాలా తక్కువ పరిమాణంలో తీసుకోవడం,అధిక బరువును కలిగి ఉండడం,ఉప్పును ఎక్కువగా తీసుకోవడం,శరీరంలోని ఇతరభాగంలో ఇన్ ఫెక్షన్ సోకడం (చీముగడ్డలు, టిబి, టాన్సిల్స్, గ్రంథులకు సోకే ఇన్ఫెక్షన్లు మొదలైనవి రక్తం ద్వారా కిడ్నీలకు చేరడం)మూత్రం వెలుపలికి వెళ్లవలసిన దారిలో కిడ్నీ స్టోన్స్ మరియు ఇతరత్రా అడ్డంకులు ఏర్పడటం ఇవేకాక పుట్టుకతో వచ్చే పుట్టుకతో వచ్చే అనేక వ్యాధుల వల్ల కూడా కిడ్నీ వ్యాధులు దరిచేరే అవకాశం ఉంటుంది...

**వ్యాధి బారిన పడకుండా ఉండాలి అంటే ఇలా చేయాలి...**

క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం,రక్తంలో చెక్కర శాతన్ని,ఆధిక రక్తపోటులను అదుపులో ఉంచుకోవడం,ఆహార నియామలను ఆరోగ్యకరంగా మార్చుకోవడం,అధిక బరువు తగ్గించుకోవడం,పొగ,మద్యంకి దూరంగా ఉండటం,మితమైన ఆహారం,డాక్టర్ సలహా లేకుండా మందులు వాడకూడదు,ఎక్కువ నీటి ని తీసుకోవడం వల్ల కిడ్నీ వ్యాదులు రాకుండా ఉంటాయి..

**అందుబాబాటులో అత్యాదునిక వైద్య సేవలు..విజేత ఆసుపత్రి లో తక్కువ ఖర్చుతో కార్పొరేట్ వైద్య సేవలు...**

**(డాక్టర్ కనుమూరి నిహారిక,ప్రముఖ నెఫ్రాలజిస్ట్ మరియు ట్రాన్స్ ప్లాంట్ సర్జన్)**



మూత్రపిండ వ్యాధుల చికిత్సలో తాజాగా అనేక ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. తీవ్రంగా ఎదురయ్యే కిడ్నీ గాయాలు మరియు దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులకు ప్రత్యేక పర్యవేక్షణతో పాటు సమగ్ర చికిత్స అవసరమవుతుంది. వడపోత గొట్టాలైన గ్లోమెరులర్ వ్యవస్థకు సంబంధించిన వ్యాధులను ఖచ్చితంగా గుర్తించి చికిత్స చేయడం అత్యంత కీలకం. అలాగే మధుమేహం, అధిక రక్తపోటు నియంత్రణ మూత్రపిండాల సంరక్షణలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. తీవ్రమైన దశల్లో ఉన్న రోగులకు పెరిటోనియల్ డయాలసిస్, హీమోడయాలసిస్ మరియు నిరంతర మూత్రపిండ మార్పిడి వంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. రక్తంలోని హానికర పదార్థాలను తొలగించే ప్లాస్మాఫెరెసిస్, హీమోపెర్ఫ్యూజన్ వంటి ప్రత్యేక విధానాలు కూడా అనేక సందర్భాల్లో రోగులకు ఉపశమనం కలిగిస్తున్నాయి. జీవిత దాతల నుండి లేదా మరణించిన దాతల నుండి మూత్రపిండ మార్పిడి చికిత్సలు కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నారు. అదనంగా, మూత్రపిండాలు మరియు మార్పిడి చేసిన మూత్రపిండాలపై శస్త్ర పరీక్షలు (బయాప్సీలు), ప్రధాన రక్తనాళాల్లో నాళం ప్రవేశపెట్టి చేసే చికిత్సలు (సెంట్రల్ వెయిన్ ప్రవేశాలు) వంటి ఇంటర్వెన్షనల్ విధానాలు నిర్ధారణను మరింత సులభం మరియు ఖచ్చితంగా చేస్తున్నాయి.

# దళిత గిరిజన సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

**రేపల్లె, ఆగస్టు 10, ప్రభాతవార్త:** గతంలో వైకాపా ప్రభుత్వం రద్దు చేసిన 26 దళిత గిరిజన సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని హామీనిచ్చిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక చర్యలు తీసుకోవడంలో



విఫలమయ్యాయని జైభీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ ఆందోళన వెలుబుచ్చారు.సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ ఉదయం 10.30 గంటలకు విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించే భీమ్ జెన్-జెడ్ సామూహిక నిరసన దీక్షకు ఎస్సీ,ఎస్టీ వర్గాలు తరలిరావాలని పిలుపునిచ్చారు.కూటిమి ప్రభుత్వం రెండేళ్ళ పాలనలో దళిత,గిరిజన సంక్షేమ పథకాలను పునరుద్ధరించలేదన్నారు.ఎస్సీ,ఎస్టీ వర్గాల పట్ల పాలకులు వివక్షతకు కారణమవుతున్నారని ఆయన ఆరోపించారు.ఎస్సీ,ఎస్టీ వర్గాలను విద్యకు దూరం చేసే జీవోలను బుక్ బ్యాంక్ పథకాన్ని పారిశ్రామిక వేత్తలకు రాయితీలు,నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన, పరిశ్రమల స్థాపన కోసం రాయితీలు,కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే ఎన్ఎస్‌సి,ఎఫ్‌డిసిఎస్, ఎస్‌కెఎఫ్‌డిసి పథకాల అమలుపై నిరసన దీక్ష నిర్వహిస్తున్నట్లు రమేష్‌రాంజీ వివరించారు.రూ.వేల కోట్ల ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్ళించి పథకం లక్ష్యాన్ని పాలక పార్టీలు నీరుగారుస్తున్నాయని జెబిపి పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.కోటయ్య విమర్శించారు.ఆందోళన కార్యక్రమంలో జెబిపి పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్ పాల్గొంటారని చెప్పారు.విద్యార్థులు, యువత,ప్రజాసంఘాలు, మేధావులు తరలిరావాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో జెబిపి పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పి.ఎస్.వెంకటేశ్వరరావు,వేమూరు నియోజకవర్గ ప్రచార కమిటీ కన్వీనర్ పి.నాగేశ్వరరావు,మాల మహానాడు రేపల్లె నియోజకవర్గ కన్వీనర్ సిహెచ్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# డిఎస్సీ అక్రమాలను నిరసిస్తూ వైకాపా బైక్ ర్యాలీ

**రేపల్లె, ఆగస్టు 10, ప్రభాతవార్త:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుతో కూటమి



ప్రభుత్వంలో జరిగిన డిఎస్‌సి అక్రమాలకు వ్యతిరేకంగా సోమవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వైకాపా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్ కృష్ణ మాట్లాడుతూ డిఎస్సీ అవకతవకలపై నా ్యయస్థానంలో న్యాయమైన తీర్పు వస్తుందని చెప్పారు.డిఎస్సీలో జరిగిన అవకతవకలకు బాధ్యతవహిస్తూ విద్యాశాఖ మంత్రి లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆందోళనను పోలీసులతో భగ్నం చేయించినా మూడు రోజుల నిరాహారదీక్షలు నిర్వహించి భారీ బైక్ ర్యాలీతో నిరసన తెలియజేశామని చెప్పారు.రేపల్లె నియోజకవర్గంలోని డిఎస్సీ అభ్యర్థులు,నిరుద్యోగ యువత,విద్యార్థుల నుండి అనూహ్య స్పందన లభించిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రేపల్లె నియోజకవర్గ పరిశీలకుడు అడపా శేషు,వైకాపా యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.చందన్‌నాగ్,కరేటి శేషగిరిరావు, చిత్రాల ఒబేదు,చిమటా బాలాజీ,కృష్ణారెడ్డి,రే ంపల్లె పట్టణం,రేపల్లె రూరల్,నిజాంపట్నం, నగరం, చెరుకుపల్లి మండలాలకు చెందిన వైకాపా శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యుల సలహాతో గర్భిణీలు మందులు వాడాలి

**కొల్లివర, ఆగస్టు 10, ప్రభాతవార్త:** మండలంలోని గర్భిణీలు విధిగా వైద్యుల సలహా ప్రకారమే మందులను వాడుకోవాలని వైద్యాధికారి జ్యోష్ణ అన్నారు.సోమవారం కొల్లివర మండలంలోని మున్నంగిలో గర్భిణీల కోసం



వైద్యాధికారులు ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.గర్భిణీలకు తగిన జాగ్రత్తలు, సలహాలు,సూచనలిచ్చారు.ఈ సందర్భంగా జ్యోష్ణ మాట్లాడుతూ గర్భిణీలు తప్పనిసరిగా ఆరోగ్య సూత్రాలను పాటించాలని చెప్పారు.పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు.ప్రతి నెలా గర్భిణీలు వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ప్రియాంక,ఆరోగ్య విస్తరణాధికారి నాగరాజు,ఎంఎల్‌హెచ్‌పి కల్యాణి,ఆశా కార్యకర్తలు వాణి,ప్రేమకుమారి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు బిఎల్ఓ విధులను రద్దు చేయాలి

**రేపల్లె, ఆగస్టు 10, ప్రభాతవార్త:** ఐసిడిఎస్ సేవలకు ఆటంకం ఏర్పడకుండా నిజాంపట్నం మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు విధించిన బిఎల్ఓ విధులను రద్దు చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రేపల్లె,పల్లపట్ల ప్రాజెక్ట్ కమిటీలు,సిఐటియు నాయకులు సోమవారం రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బాపట్ల జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ మాట్లాడుతూ బిఎల్ఓ విధుల కారణంగా ఐసిడిఎస్ ప్రాథమిక సేవలకు ఆటంకం కలుగుతోందని చెప్పారు.సమగ్ర శిశు అభివృద్ధి సేవలు అనేవి కేంద్ర ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాలలో ప్రధానమైనదన్నారు.అంగన్వాడీ కార్యకర్తల నిర్దేశిత విధులు,బాధ్యతలకు సంబంధం లేని ఇతర పనులను అప్పగించరాదని స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ డైరెక్టర్ కార్యాలయం గత సంవత్సరం ఆగస్టు 16వ తేదీ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ అమలుకు నోచుకోవడంలేదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. రేపల్లె,నిజాంపట్నం మండలాల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు సామాజిక పెన్షన్ పంపిణీ బాధ్యతలను తొలగించాలని



ఝాన్సీ కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు సిహెచ్. మణిలాల్, రేపల్లె ప్రాజెక్ట్ అధ్యక్షురాలు కె.రత్నకుమారి, పల్లపట్ల ప్రాజెక్ట్ అధ్యక్షురాలు వై.మేరీమణి, కృష్ణకుమారి, భవాని, డి.జ్యోతి,నాగదేవత,విజయలక్ష్మి,రమణ,ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయం ఉద్యోగులు బాధ్యతతో విధులు నిర్వహించాలి

**కొల్లివర, ఆగస్టు 10, ప్రభాతవార్త:** మండలంలోని సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులను నిర్వహించాలని కొల్లివర మండల డిప్యూటీ ఎంపిడీవో దానయ్య ఆదేశించారు.సోమవారం మండలంలోని కొల్లివర,చివలూరు గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు .తాగునీటి ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్ అంశాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలను అందించాల్సిన బాధ్యత సచివాలయం ఉద్యోగులపై ఉందన్నారు.సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ నిబంధనలను విధిగా పాటించాలన్నారు. ప్రజల నుండి ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని తెలిపారు.విధినిర్వహణలో అలసత్వం ప్రదర్శించే ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని దానయ్య హెచ్చరించారు. గ్రామాల్లో పర్యావరణానికి ముప్పువాటిల్లకుండా సిబ్బంది తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.చెత్తాచెదారం,మురుగునీటి పారుదల సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలని దానయ్య సూచించారు.



# ప్రజా వ్యతిరేక విధానాలు కొనసాగిస్తే ఉద్యమిస్తాం

**రేపల్లె, ఆగస్టు 10, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తే క్విట్ ఇండియా వంటి ఉద్యమాలు చేయాల్సి వస్తుందని సిఐటియు బాపట్ల జిల్లా కోశాధికారి సిహెచ్.మణిలాల్ హెచ్చరించారు. సోమవారం జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా కార్మిక,రైతు సంఘాల నేతలు రాస్తా రోకో చేశారు.కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఆందోళనకారులను రేపల్లె



పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని,రైతులను,కార్మికులను కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తున్నదని ఆరోపించారు.ఆంధ్రప్రదేశ్‌లో పొగాకు,ఆక్వా,శనగ,మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వెలుబుచ్చారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వలన ప్రైవేటీకరణ పెరిగిపోతున్నదని ఆయన విమర్శించారు.రైతుల,కార్మికుల ఉమ్మడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు కార్మిక సంఘం,రైతు సంఘం,వ్యవసాయ కార్మిక సంఘం,డివైఎఫ్ఐ యువజన సంఘం,పట్టణ ఆదర్శ వేదిక నాయకులు కొప్పుల గోపి,కె.ఝాన్సీ,జె.ధర్మరాజు,సిహెచ్.దానియేలు, బి.మల్లి,కె.రమేష్,వై.కిషోర్, సిహెచ్.ప్రకాష్, కె.ఆశీర్వాదం,డి.అగస్టీన్,కె.రత్నకుమారి,వై.మేరీమణి, నరసింహా,నాంచారయ్య ,ఎన్.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

# కైకలూరు నియోజకవర్గంలో సీఎంతో కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఆగస్టు10,(ప్రభాతవార్త) :** గౌరవ ముఖ్యమంత్రి వర్యులు, టీడీపీ అధినేత శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో సోమవారం కలిదిండి మండలంలో జరిగిన కైకలూరు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాజీమంత్రివర్యులు, శాసనసభ్యులు జోనల్ కోఆర్డినేటర్ ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా సమావేశ ప్రాంగణంలో ఏర్పాట్లు పరిశీలించారు. అధినేత పార్టీ శ్రేణులందరితో ఎంతో ఆప్యాయంగా, ఆత్మీయతతో మాట్లాడిన తీరు నన్ను ఎంతగానో ఆకట్టుకుందని ప్రత్తిపాటి తెలిపారు. ఈ ప్రత్యేక సమావేశంలో పార్టీ జోనల్ కోఆర్డినేటర్ గా నేనూ భాగస్వామిని కావడం ఎంతో సంతోషంగా అనిపించింది. అధినేత సమావేశానంతరం, కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనా విజయాలు, తిరుగులేని అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ టీడీపీ అధినాయకత్వం చేపట్టిన ఖిఇంటింటికీ తెలుగుదేశంఖి కార్యక్రమ విజయం, త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు, కూటమి పార్టీల సమన్వయం, పరస్పర సహకారంపై టీడీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడం జరిగిందని ప్రత్తిపాటి తెలిపారు.



# జగన్ హయాంలో ఆడబిడ్డల పై పూటకో అఘాయిత్యం,రోజుకో నేరం : ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఆగస్టు10,(ప్రభాతవార్త) :** వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి తీవ్ర విచారకరం. వైద్యురాలిగా ప్రజలకు సేవలందించాల్సిన యువతి, మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకుల దుశ్చర్యతో ప్రాణాలు పోగొట్టుకోవడం అత్యంత బాధాకరం. ప్రియాంక ప్రమాద ఘటనపై ప్రభుత్వం, ముఖ్యమంత్రి వెంటనే స్పందించి బాధితురాలికి మెరుగైన వైద్యసేవలు అందేలా చూశారు. ప్రియాంకను కాపాడేందుకు నిపుణులైన వైద్యుల్ని సీఎం స్వయంగా పంపించారు. ప్రియాంక మరణానంతరం కుటుంబానికి ఆర్థిక సాయం ప్రకటించి, నిందితులకు కఠినంగా శిక్షిస్తామని భరోసా ఇచ్చారు. తన కుమార్తె ప్రమాద ఘటనపై ఏపీ పోలీసుల దర్యాప్తు తీరుపై తమకు నమ్మకముందని స్వయంగా మృతురాలి తండ్రి స్పష్టం చేశారు. ప్రియాంక ఘటనలో నేరస్తుల్ని సమర్థించాల్సిన జగన్ మృతురాలి తరుపున మాట్లాడటం విచిత్రంగా ఉంది. ప్రియాంక ప్రమాదానికి గురైనప్పుడు, ఆమె ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నప్పుడు జగన్ కు ఆమె వేదన.. కుటుంబసభ్యుల రోదన గుర్తురాలేదు. పొరుగు రాష్ట్రంలో ఉండే ప్రియాంక తల్లిదండ్రులు ఏపీ పోలీసుల పనితీరుపై తమకు నమ్మకముందని చెబుతుంటే.. జగన్ మాత్రం పనిగట్టుకొని పోలీస్ వ్యవస్థపై విమర్శలు చేస్తున్నాడు. యువతి మరణించిన వెంటనే కనీస మానవత్వం లేకుండా, జగన్ ప్రభుత్వంపై, పోలీసులపై దుష్ప్రచారానికి తెరలేపాడు. వైద్య విద్యార్థిని మరణాన్ని రాజకీయ అంశంగా మలిచే ప్రయత్నం చేస్తున్న జగన్ వైఖరిని ప్రజలు ఆమోదించరు. "ప్రియాంక ప్రమాద ఘటనలో ప్రభుత్వం సకాలంలో స్పందించలేదు.. పోలీసులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారన్న జగన్ వ్యాఖ్యలు పచ్చి బూటకమని చెప్పాలి. రాష్ట్రంలో ఎప్పుడు ఏ ఘటన జరుగుతుందా.. దాన్ని ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై నెట్టేసి ఎలా బురద జల్లుదామా, వ్యవస్థలపై ఏ విధంగా దుమ్మెత్తిపోదామా అన్న ఆలోచనల్లోనే జగన్ బతుకుతున్నాడు. ఎప్పుడూ నేరస్తుల్ని పరామర్శిస్తూ, వారికి అండగా నిలిచే జగన్.. ప్రియాంక విషయంలో ఆమె మరణానికి కారకులైన యువకుల్ని సమర్థించకుండా, యువతి తరుపున మాట్లాడటం చాలా విచిత్రంగా ఉంది. జగన్ హయాంలో ఆడబిడ్డలపై పూటకో అఘాయిత్యం..రోజుకో నేరం. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏనాడూ ఆడబిడ్డల రక్షణ గురించి ఆలోచించలేదు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో నేరాలు, ఘోరాలు విచ్చలవిడిగా పెరిగాయని, ముఖ్యంగా మహిళలపై అత్యాచారాలు, గృహహింస, వేధింపుల వంటి ఘటనలు ఏటేటా పెరిగాయని స్వయంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్.సీ.ఆర్.బీ నివేదికే చెప్పింది. 201923 మధ్య మహిళలపై పూటకో అఘాయిత్యం, రోజుకో నేరానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారకుడైన జగన్.. నేడు ఆడబిడ్డల రక్షణపై మొసలికన్నీరు కారుస్తున్నాడు. ఐదేళ్ల రాష్ట్రంలో గంజాయి, కల్తీ మద్యం, మాదకద్రవ్యాల విక్రయాన్ని ప్రోత్సహించడం ద్వారా, మహిళలపై నేరాలు పరోక్షంగా జగనే అండగా నిలవడం వాస్తవం కాదా? పసిపిల్లల దిశ చట్టంతో మూడువారాల్లో నిందితుల్ని ఉరికంబం ఎక్కిస్తామని ప్రగల్భాలు పలికిన జగన్, ఒక్క నేరస్తుడిని కఠినంగా శిక్షించింది లేదు. కేంద్ర ఆమోదం లేని ఉత్తుత్తి చట్టంతో.. జగన్ ఆడబిడ్డల్ని మోసగించి, తన రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకున్నాడు. రాష్ట్రంలో జరిగే ప్రతి ఘటనను ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరిస్తూ, ప్రజల్లో అసంతృప్తి పెంచి, రాష్ట్ర పెట్టుబడుల్ని అడ్డుకోవాలన్నదే జగన్ కుయుక్తి." అని రాజమహేంద్రవరం పార్లమెంట్ టీడీపీ కో ఆర్డినేటర్ , శాసనసభ్యులు ప్రత్తిపాటి సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.



# డిఎస్సీ అవకతవకల పై సిబిఐ విచారణ జరిపించాలి

**- మాజీ మంత్రి విడదల రజిని**

**చిలకలూరిపేట, ఆగస్టు 10, (ప్రభాతవార్త) :** విద్యార్థులు, యువత, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పోరాటంలో భాగంగా మాజీ మంత్రి శ్రీమతి విడదల రజిని



ఆధ్వర్యంలో మూడు రోజుల రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. అనంతరం ఈరోజు చిలకలూరిపేటలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.పోలీసులు అనేక ఆంక్షలు విధించినప్పటికీ వాటిని లెక్కచేయకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, ప్రజలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. పురుషోత్తపట్నం అడ్డరోడ్ సెంటర్ నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ గడియార స్తంభం సెంటర్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వరకు కొనసాగింది.ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీమతి విడదల రజిని గారు మాట్లాడుతూ, "మెగా డీఎస్సీ కాస్తా దగా డీఎస్సీగా మారింది. డీఎస్సీ పేరుతో ఉద్యోగాలు అమ్ముకున్నారు" అని అన్నారు.వేలాది మంది నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ముడిపడి ఉన్న డీఎస్సీ నియామక ప్రక్రియపై అనేక అనుమానాలు, ఆరోపణలు ఉన్న నేపథ్యంలో డీఎస్సీ వ్యవహారంపై దితీ।తో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నిజానిజాలు బయటకు రావాలంటే స్వతంత్ర దర్యాప్తు అవసరమని అన్నారు.డీఎస్సీ వ్యవహారంపై బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని రజిని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడటం సరికాదని, ప్రభుత్వం యువతకు సమాధానం చెప్పాలని అన్నారు.అదేవిధంగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిల కారణంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.నిరుద్యోగ యువతకు నెలకు ..3,000 నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని అన్నారు.పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించినా ప్రజల గళాన్ని అణచలేరని రజిని గారు అన్నారు. విద్యార్థులు, యువత, నిరుద్యోగుల హక్కుల కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు."మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతకు జరిగిన అన్యాయంపై నిజాలు బయటకు రావాలి. దితీ। విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు మా పోరాటం ఆగదు" అని మాజీ మంత్రి విడదల రజిని గారు తెలిపారు.ర్యాలీ అనంతరం గడియార స్తంభం సెంటర్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

# సాతులూరు గ్రామంలో ఇంటింటికీ తెలుగుదేశం

**చిలకలూరిపేట,ఆగస్టు10,(ప్రభాతవార్త) :** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గారి పిలుపు మేరకు ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం లో నాదెండ్ల మండలం క్లస్టర్ 1లోని సాతులూరు గ్రామం లో 4 బూత్ నందు తెలుగుదేశం పార్టీ నాదెండ్ల



మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ గారు, నాదెండ్ల సొసైటీ అధ్యక్షులు నల్లమోతు హరిబాబు గారు, క్లస్టర్ ఇంచార్జ్ మల్లవరపు జయ ప్రసాద్, మండల సీనియర్ నాయకులు వజ్జ సింగయ్య, నార్నె శ్రీనివాసరావు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నార్నె కోటయ్య స్వామి గారు,పాల్గొని 60 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.సూపర్6 హామీలు, పొందిన లబ్దిని ప్రజలకు వివరించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. కూటమి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం పథకాలను వివరిస్తూ ప్రజలను చైతన్య పరచడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికగా ఖిఇంటింటికీ తెలుగుదేశంఖి కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి సంక్షేమం కార్యక్రమాలు నిర్వహిస్తుందని తద్వారా రాష్ట్ర ప్రజలకు లబ్ది చేకూరుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఒయాసిస్ అండగా ఉంటుంది

**మాజీ ఎమ్మెల్యే కందిమళ్ల జయమ్మ**

**చిలకలూరిపేట,ఆగస్టు10,(ప్రభాతవార్త) :** ప్రతిభకల్గిన పేద విద్యార్థులకు ఒయాసిస్ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కందిమళ్ల జయమ్మ అన్నారు. స్థానిక కెజె హాస్పిటల్ నందు ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకాధ్యక్షురాలు డాక్టర్ జయమ్మ



మాట్లాడారు. అనంతరం నూతనముగా నియమితులైన కన్స్యూమర్,ఫుడ్ ఎఫైర్స్, సివిల్ సప్లై విజిలెన్స్ కమిటీ రాష్ట్ర సభ్యులు కాకుమాను వెంకట్ ని సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ ఒయాసిస్ చేస్తున్న సేవలు గొప్పవని,పేదవారికి సహాయం చేయటంలో మునుంటదని అన్నారు. మహిళలు కలసి ఒక స్వచ్ఛంద సంస్థ నెలకొల్పి కొన్ని కోట్ల రూపాయల సేవా కార్యక్రమాలు చేయటం ఘనమైన విషయమని అన్నారు. పేద విద్యార్థికి సైకిల్ ని అందజేశారు. సంస్థ సభ్యులకు జామ మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కరణం విజయలక్ష్మి, కారుమంచి శివరావు,కోలా విజయలక్ష్మి, డాక్టర్ ప్రఫుల్లా దేవి, మానం శ్రీనివాసరావు, కందిమళ్ల నారాయణమూర్తి, రమ, పాములపాటి శివకుమారి తదితరులు పాల్గొన్నారు

# చిలకలూరిపేట ఎం.ఈ.ఓగా ఏసుబాబు బాధ్యతల స్వీకరణ

**చిలకలూరిపేట,ఆగస్టు10,(ప్రభాతవార్త) :** చిలకలూరిపేట మండల విద్యాశాఖ అధికారిగా (వి.ఎం.ఈ.ఓ) ఏసుబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అధికారికంగా చార్జ్ తీసుకుని విధుల్లో చేరారు.మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడడం, ఉపాధ్యాయులకు అవసరమైన సహకారం అందించడం వంటి



అంశాలకు ప్రాధాన్యత ఇస్తానని ఏసుబాబు తెలిపారు.అలాగే పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, విద్యా బోధన, మౌలిక వసతులు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ విద్యాశాఖ లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.చిలకలూరిపేట మండల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారుల సహకారంతో ముందుకు సాగుతానని .ఎం.ఈ.ఓ ఏసుబాబు తెలిపారు.

# చిలకలూరిపేటలో రోడ్డు ప్రమాదం..

**ఇరుకైన రోడ్డు కారణంగానే తరచూ ప్రమాదాలు**

**చిలకలూరిపేట,ఆగస్టు10,(ప్రభాతవార్త) :** పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ సమీపంలో ఆదివారం ఒక రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మద్యం మత్తులో మితిమీరిన వేగంతో దూసుకొచ్చిన బైక్ అదుపుతప్పి ఆటోను బలంగా ఢీకొట్టింది.ప్రమాద వివరాలుగంగన్నపాలేనికి చెందిన గోపి అనే యువకుడు మద్యం మత్తులో, ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా మితిమీరిన వేగంతో బైక్‌పై వచ్చి ఓ ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాద తీవ్రత ఎంతలా ఉందంటే..



యువకుడు గాల్లో పల్టీలు కొడుతూ రోడ్డుపై పడిపోయాడు. ఈ ఘటనలో అతనికి కాలు, వెన్నెముక దారుణంగా విరిగిపోయి తీవ్ర గాయాలయ్యాయి.స్పందించిన టౌన్ పోలీసులు:ప్రమాదం గురించి సమాచారం అందుకున్న టౌన్ పోలీసులు తక్షణమే అప్రమత్తమయ్యారు. అంబులెన్స్ కోసం ఎదురుచూసి విలువైన సమయం వృధా కాకుండా, క్షతగాత్రుడిని వెంటనే ఒక ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల ఈ సమయస్ఫూర్తిని, తక్షణ స్పందనను స్థానికులు ఎంతో అభినందించారు.

# ఎర్రకోటపై తొలిసారి 'వందేమాతరం'



## స్వాతంత్ర్య వేడుకల్లో కొత్త క్రమం

### జాతీయ గీతానికి ముందు ఆలాపన

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఆగస్టు 15న ఎర్రకోట ప్రాకారాల నుంచి తొలిసారిగా జాతీయ గీతం వందేమాతరం మార్మోగనుంది. ఈ విషయాన్ని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వందేమాతరం 150 ఏళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈసారి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఈ గీతానికి ప్రత్యేక ప్రాధాన్యం కల్పించారు. అదే సమయంలో దేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోనుంది. జాతీయ గీతానికి ముందు ^వందేమాతరం ఈసారి ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కార్యక్రమ క్రమంలో మార్పులు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తొలుత ఎర్రకోటకు చేరుకుంటారు. అనంతరం వందేమాతరం గానం జరుగుతుంది. ఆ తర్వాత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించనున్నారు. యువ శక్తి - వికసిత్ భారత్ ప్రయాణానికి నాయకత్వం అనే ఇతివృత్తంతో ఈ ఏడాది వేడుకలు నిర్వహించనున్నారు. దేశ అభివృద్ధిలో యువత పోషిస్తున్న కీలక పాత్రను ఈ థీమ్ ప్రతిబింబించనుంది. ఆహ్వాన పత్రికల్లో పూర్తిస్థాయి గీతంఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ఆహ్వాన పత్రికల్లోనూ రక్షణ శాఖ మరో కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. వందేమాతరం పూర్తి సాహిత్యాన్ని ఆహ్వాన పత్రికలపై ముద్రించింది. ఇందులో జాతీయ గీతంలోని మొత్తం ఆరు చరణాలను పొందుపరిచారు. ఎర్రకోట వేడుకలకు కేంద్ర మంత్రులు, ఉన్నత స్థాయి సైనికాధికారులు, ఉన్నతాధికారులు, దౌత్యవేత్తలు, విద్యార్థులు, వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన ప్రముఖులను ఆహ్వానించారు. జాతీయ గీతంతో సమాన హోదాఇటీవలే పార్లమెంట్ ఆమోదించిన జాతీయ గౌరవానికి అవమానాల నిరోధక (సవరణ)బిల్లు2026తో వందేమాతరానికి జాతీయ గీతంతో సమానమైన చట్టపరమైన హోదా కల్పించారు. సవరించిన చట్టం ప్రకారం వందేమాతరం గానాన్ని అవమానించడం లేదా ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం శిక్షార్హ నేరంగా మారింది. నిబంధనలు ఉల్లంఘించిన వారికి గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంది. ఇంతకుముందు ఇలాంటి చట్టపరమైన రక్షణ జాతీయ పతాకం, జాతీయ గీతం, రాజ్యాంగానికి మాత్రమే ఉండేది. బంకించంద్ర చటోపాధ్యాయ రచించిన వందేమాతరం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అత్యంత కీలకమైన దేశభక్తి గీతాల్లో ఒకటిగా నిలిచింది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అనేక తరాల స్వాతంత్ర్య సమరయోధులకు ఇది స్ఫూర్తినిచ్చింది. 1882లో బంకించంద్ర చటోపాధ్యాయ రచించిన ఆనందమఠం నవలలో వందేమాతరం తొలిసారి ప్రచురితమైంది. అనంతరం దాని తొలి పంక్తులను దేశ జాతీయ గీతంగా స్వీకరించారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో వందేమాతరం జాతీయవాద ఉద్యమానికి ప్రతీకగా మారింది. మాతృభూమి పట్ల ప్రేమ, దేశభక్తి, త్యాగం, ఐక్యత వంటి భావాలను ప్రతిబింబిస్తూ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించింది. భారత స్వాతంత్ర్యపోరాటంతో ఉన్న ఈ చారిత్రక అనుబంధం కారణంగా దేశ ప్రజల మనస్సుల్లో వందేమాతరంకు ప్రత్యేకమైన స్థానం ఏర్పడింది.



# వణికిస్తున్న 'డాల్ఫిన్' తుపాను

## సురక్షిత ప్రాంతాలకు పది లక్షలమంది

**బీజింగ్, ఆగస్టు 10:** చైనాలో భారీ వర్షాలు, ఈదురు గాలుల బీభత్సం సృష్టిస్తున్నాయి. శక్తివంతమైన డాల్ఫిన్ తుపాను తీరాన్ని తాకడంతో ఆ ప్రాంతం వణుకుతోంది. భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగి పడటం, వరదలు పోటెత్తే ప్రమాదం ఉండటంతో తీరప్రాంత నగరాల్లో దాదాపు 10 లక్షల మందికిపైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జెజియాంగ్ ప్రావిన్స్‌లో 1,500కు పైగా తాత్కాలిక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. షాంఘైలో గత 24 గంటల వ్యవధిలో దాదాపు 313 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. గత 150యేళ్ల చరిత్రలో ఇదే అత్యధిక వర్షపాతమని అధికారులు పేర్కొన్నారు. వందకుపైగా వీధులు జలమయం అవ్వడంతో ఇళ్లలోనే ఉండాలని ప్రజలకు సూచించారు. తుపాను కారణంగా షాంఘైలోని రెండు ప్రధాన విమానాశ్రయాల్లో 1,300కు పైగా విమాన సర్వీసులను రద్దు చేశారు. కొండచరియలు విరిగిపడడంతో అనేక ప్రాంతాల్లో రోడ్డు, రైలు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. చైనాలోని డాల్ఫిన్ తుపాను ప్రభావం తైవాన్, భారత్‌లపైనా పడే అవకాశం ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. దీని వల్ల చైనా సరిహద్దుల్లో ఉన్న భారత భూభాగంలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపాయి.

**2,230 విమానాలు రద్దు:** చైనా తూర్పు తీరంలోని జెజియాంగ్ ప్రావిన్స్‌ను ఆదివారం మధ్యాహ్నం డాల్ఫిన్ తుపాను తాకింది. ఈ సంవత్సరం చైనాలో సంభవించిన తుపానుల్లో ఇది 13వది. దీంతో చైనా జాతీయ వాతావరణ సంస్థ అత్యున్నత స్థాయి రెడ్‌అలర్ట్ జారీ చేసింది. ఈ తుపాను వల్ల గాలులు ఒక సెకనుకు 42 మీటర్ల వేగంతో వీస్తున్నాయి. తుపాను కారణంగా షాంఘైలోని రెండు ప్రముఖ విమానాశ్రయాల్లో దాదాపు 2,230 విమానాలు రద్దయ్యాయి. 720 సోమవారం వరకు రద్దయ్యాయి. హాంగ్‌జావ్ నగరంలోని విమానాశ్రయంలో రాకపోకలు సాగించాల్సిన దాదాపు 500 విమానాలు రద్దయ్యాయి.

# జెపిపిఎస్‌సి మాజీ చైర్మన్ అరెస్టు..

### ఉద్రిక్తంగా మారిన విద్యార్థుల ఆందోళన



**రాంచి, ఆగస్టు 10:** జార్ఖండ్‌లో విద్యార్థులు చేపట్టిన ఆందోళన సోమవారం ఉద్రిక్తంగా మారింది. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేశారు. టియర్ గ్యాస్, వాటర్ కెనాన్లు ప్రయోగించారు. ఈ క్రమంలో పోలీసులకు, విద్యార్థులకు మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తింది. మరోవైపు జేపీఎస్‌సీ మాజీ చైర్మన్ ఎల్ ఖియాంగ్తేను సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. జేపీఎస్‌సీ పేపర్ లీకేజీ కేసులో యాంగ్తేను సోమవారం అరెస్టు చేశారు. బ్లాక్‌లిస్టులో పెట్టిన టీడీపీఎల్ సంస్థకు ఈ పరీక్షలు నిర్వహించే బాధ్యత అప్పగించడంపై అధికారులు ఆయనను ప్రశ్నించనున్నారు. ఖియాంగ్తే గతంలో జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆ తర్వాత ఆయనను ప్రభుత్వం జేపీఎస్‌సీ చైర్మన్‌గా నియమించింది. పేపర్ లీకేజీ ఆరోపణలు, విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో గత నెల 22న అతడు తన పదవికి రాజీనామా చేశారు. పేపర్ లీకేజీపై స్పష్టమైన, నిష్పక్షపాత విచారణ జరగాలనే ఉద్దేశంతోనే తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అరెస్టుకు ముందే సీఐడీ అధికారులు పలుసార్లు ఆయనను ఈ అంశంపై ప్రశ్నించారు. జేపీఎస్‌సీతోపాటు, జేఎస్ఎస్‌సీలో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీలపై విద్యార్థులు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. పరీక్షల్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులు భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. సీఎం ఇంటితోపాటు అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించారు. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థి నాయకుడు దేవేంద్ర మహతో కూడా ఈ నిరసనకు మద్దతు తెలిపారు. జార్ఖండ్ ప్రతిపక్ష నేత బాబూలాల్ మరాండీ కూడా విద్యార్థుల ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ పేపర్ లీకేజీలపై సీబీఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.



## షరియత్ చట్టం మేరకే ముస్లిం వివాహం

### కర్ణాటక హైకోర్టు తీర్పు

**బెంగళూరు, ఆగస్టు 10:** ముస్లిం వ్యక్తిగత చట్టం (షరియత్ చట్టం) ప్రకారం జరిగిన వివాహం, తదనంతరం 'స్పెషల్ మ్యారేజ్ యాక్ట్, 1954' కింద నమోదు చేయబడినప్పటికీ, ఆ చట్టం (షరియత్ చట్టం) పరిధిలోనే కొనసాగుతుందని కర్ణాటక హైకోర్టు తీర్పునిచ్చింది. 1954 చట్టం కింద నమోదు చేసినంత మాత్రాన అటువంటి వివాహం చట్టపరమైన స్వభావం మారదని లేదా విడాకుల విషయంలో స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ నిబంధనలు వర్తించవని కోర్టు స్పష్టం చేసింది. స్పెషల్ మ్యారేజ్ యాక్ట్‌లోని సెక్షన్ 27(1)(డి), (ఇ) కింద దాఖలు చేసిన విడాకుల పిటిషన్‌ను నిలవదు అని పేర్కొంటూ ఫ్యామిలీ కోర్టు తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ ఒక ముస్లిం భర్త దాఖలు చేసిన అప్పీల్‌ను జస్టిస్ డి.కె. సింగ్, జస్టిస్ టి.ఎం. నాడాఫ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ కొట్టివేసింది. "సంబంధిత వర్గంయొక్క చట్టం ప్రకారం (అంటే ముస్లింలకు షరియత్ చట్టం, హిందువులకు హిందూ వివాహ చట్టం లేదా క్రైస్తవులకు క్రైస్తవ వివాహ చట్టం మొదలైనవి) జరిగిన వివాహాన్ని కేవలం నమోదు చేసినంత మాత్రాన, ఆ చట్టం ప్రకారం జరిగిన వివాహం అనే స్వభావాన్ని అది కోల్పోదని ధర్మాసనం పేర్కొంది. "సంబంధిత వర్గానికి వర్తించే చట్టం ప్రకారం వివాహం జరిగిన తర్వాత, స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ కింద నమోదు చేసినంత మాత్రాన, అది షరియత్ చట్టం లేదా హిందూ చట్టం లేదా క్రైస్తవ చట్టం ప్రకారం జరిగిన వివాహం అనే స్వభా వాన్ని, ప్రభావాన్ని కోల్పోదు" అని వ్యాఖ్యానించింది.



## సీటు బెల్టు పెట్టుకోనని చిన్నారి మారాం..

### ఏకంగా విమాన సర్వీస్ రద్దు

**ఒట్టావా, ఆగస్టు 10:** ఓ చిన్నారి సీట్‌బెల్ట్ పెట్టుకోకపోవడంతో ఏకంగా విమాన సర్వీసునే రద్దు చేశారు. ఈ ఘటన కెనడాలో చోటుచేసుకుంది. అధికారుల కథనం ప్రకారం.. విక్టోరియా అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పోర్టర్ ఎయిర్‌లైన్స్ విమానం టొరంటోకు వెళ్లడానికి సిద్ధమైంది. రన్‌వేపై టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్న సమయంలో విమానంలోని ఓ చిన్నారి సీట్‌బెల్ట్ పెట్టుకోకుండా సీటుపై నిల్చొని ఉండడాన్ని సిబ్బంది గమనించారు. పాప తల్లి, క్యాబిన్ సిబ్బంది కలిసి సీట్‌బెల్ట్ పెట్టడానికి కొన్ని నిమిషాల పాటు ప్రయత్నించారు. అయితే చిన్నారి ఎంతకూ వినకుండా ఏడుస్తూ.. మారాం చేయడంతో ఏమీ చేయలేకపోయారు. సీట్‌బెల్ట్ పెట్టుకోకపోతే విమానాన్ని టేకాఫ్ చేయడం సురక్షితం కాదని భావించిన సిబ్బంది వారిని దించేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో విమానం తిరిగి టెర్మినల్‌కు వెళ్లింది. చిన్నారిని, వారి తల్లిదండ్రులను విమానం నుంచి దించేసి.. నిబంధనల ప్రకారం వారి ఫ్లైట్ ప్లాన్‌లను తిరిగి ఫైల్ చేసేసరికి రాత్రి 12.30 గంటలు దాటింది. ఆ సమయానికి రన్‌వేను మూసివేయడంతో విమానం సర్వీసు రద్దు చేశారు. దీంతో అందులోని ప్రయాణికులు రాత్రి విమానాశ్రయంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. మరునాడు వారిని అదే విమానంలో గమ్య స్థానాలకు తీసుకెళ్లారు. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకోగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి ఎయిర్‌లైన్స్ క్షమాపణలు తెలియజేసింది.

# ప్రధాని మోడీతో బాక్సర్ సరదా సంభాషణ

### పగలబడి నవ్విన ప్రధాని

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** క్రీడారంగంలో మైదానంలో జరిగే పోటీలే కాదు, మైదానం బయట జరిగే కొన్ని సంఘటనలు కూడా దశాబ్దాల పాటు గుర్తుండిపోతాయి. అలాంటి ఓ సరదా సంఘటనను భారత బాక్సర్ నరేందర్ బెర్వాల్, ప్రధాని నరేంద్ర మోడీతో పంచుకున్నారు. కామన్వెల్త్ గేమ్స్‌లో రజత పతకం గెలిచిన క్రీడాకారులను అభినందించేందుకు ప్రధాని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ ఆసక్తికర సంభాషణ జరిగింది. నరేందర్ చెప్పిన కథ విని ప్రధాని మోడీ సైతం పగలబడి నవ్వారు. 2015లో జరిగిన వరల్డ్ మిలిటరీ గేమ్స్‌లో తన తొలి బౌట్ పాకిస్థాన్ బాక్సర్‌తో జరిగిందని నరేందర్ గుర్తుచేసుకున్నారు. అది మిలిటరీ గేమ్స్ కావడం, ఇరు దేశాల మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు ఉండటంతో పాకిస్థాన్‌పై ఎట్టిపరిస్థితుల్లోనూ ఓడిపోవద్దని తనకు సైనిక అధికారుల నుంచి ఫోన్లు వచ్చాయని ఆయన వెల్లడించారు. ఆ మ్యాచ్‌లో తాను 41, 32 తేడాతో గెలిచానని, అయితే ఇద్దరికీ గాయాలయ్యాయని తెలిపారు. దీంతో కుట్లు వేయించుకోవడానికి ఇద్దరూ కలిసి ఆసుపత్రికి వెళ్లినట్లు చెప్పారు. ఆసుపత్రిలో జరిగిన సంభాషణను నరేందర్ వివరిస్తూ, 2014లో మీరు తొలిసారి ప్రధాని అయ్యారు. మాతో ఉన్న ఆర్మీ కోచ్ పేరు నరేంద్ర రాణా. నా పేరు నరేందర్. ఈ విషయాలను గమనించిన పాక్ బాక్సర్ నా దగ్గరకు వచ్చి సోదరా, ఒకమాట చెప్పనా అని అడిగాడు. చెప్పమని అన్నానని ఆ పాక్ బాక్సర్ నీ పేరు నరేందర్, నీ కోచ్ పేరు నరేందర్, మీ ప్రధాని పేరుకూడా నరేంద్ర. నాకు ఈ నరేంద్ర అనే పేరు వింటేనే ద్వేషం వచ్చేస్తోందని అన్నాడని నరేందర్ చెప్పగానే ప్రధాని మోడీ ఒక్కసారిగా పగలబడి నవ్వారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోడీ పలువురు క్రీడా కారులతో ప్రత్యేకంగా మాట్లాడి, భారత క్రీడారంగానికి వారు అందిస్తున్న సేవలను అభినందించారు.



# బిజెపికి మేలుచేసే వ్యాఖ్యలు మానుకోవాలి..



### శశిథరూర్‌కు కెసి వేణుగోపాల్ హితవు

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టిన ఛాత్రోంకీ గూంజ్ కార్యక్రమాన్ని ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో జరిగిన ఉద్యమంతో పోల్చుతూ కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలో దుమారానికి దారితీశాయి. థరూర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పందించారు. పార్టీ నేతలంతా మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బిజెపికి మేలు చేసేలా ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని వేణుగోపాల్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీపై ఎవరైనా విమర్శలు చేస్తే బిజెపి సంతోషిస్తుందని అయితే థరూర్ ఉద్దేశపూర్వకంగా అలాంటి వ్యాఖ్యలు చేసి ఉంటారని తాను భావించడం లేదన్నారు. రాహుల్‌గాంధీ కార్యక్రమానికి యువత నుంచి మంచి స్పందన వచ్చిందని వేణుగోపాల్ చెప్పారు. అలహాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో జెన్‌జీ యువత పాల్గొందన్నారు. కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు. నిరసనల్లో పోలీసుల చర్యతో గాయపడిన విద్యార్థుల సమస్యను రాహుల్‌గాంధీ తొలుత ప్రజల ముందుకు తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఇటీవల ప్రతిపక్ష పార్టీలు యువతతో ఎందుకు పూర్తిగా అనుసంధానం కాలేకపోతున్నాయో ఆలోచించాల్సిన అవసరం ఉందని శశిథరూర్ అన్నారు. జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనకు వచ్చిన యువతకు రాజకీయ పార్టీల్లోకి రావడానికి సరైన మార్గంకల్పించలేకపోయామని చెప్పారు. రాహుల్‌గాంధీ నిర్వహించిన ఛాత్రోంకీ గూంజ్ కార్యక్రమానికి జంతర్‌మంతర్ నిరసన స్థాయిలో స్పందన రాలేదా అని ప్రశ్నించగా అవును. అందుకే మనం ఏం చేయలేకపోయామో ఆలోచించాలి అని థరూర్ బదులిచ్చారు. అయితే తన వ్యాఖ్యలను మీడియావక్రీకరించిందని తర్వాత వివరణ ఇచ్చారు. యువతకు రాజకీయాల్లో చోటు కల్పించాల్సిన అవసరాన్ని మాత్రమే చెప్పానని స్పష్టం చేశారు.



### మ్యాగీ నూడుల్స్ వివాదానికి తెర

## 2 క్రిమినల్ కేసులు కొట్టేసిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** మ్యాగీ నూడుల్స్‌లో అధిక సీసం కంటెంట్ ఉన్నట్లు గుర్తించారనే ఆరోపణలపై, దాని రిటైలర్లు సరఫరా గొలుసులోని ఇతర వ్యక్తులపై 2015లో దాఖలైన క్రిమినల్ ఫిర్యాదులను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. అసలు పరీక్ష నివేదికలు తదనంతరం చెల్లవని తేలినప్పటికీ విచారణలను కొనసాగించడం కోర్టు ప్రక్రియను దుర్వినియోగం చేయడమే అవుతుందని పేర్కొంది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం కింద రెఫరల్ ఫుడ్ ల్యాబొరేటరీ అయిన మైసూరులోని సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిఎఫ్‌టిఆర్ఐ) ద్వారా మ్యాగీ నూడుల్స్ నమూనాలకు కొత్తగా పరీక్షలు జరపాలని సుప్రీం కోర్టు ఆదేశించిన తర్వాత, ఆ నివేదికలో సీసం పరిమాణం అనుమతించదగిన పరిమితుల్లోనే ఉందని తేలిన తర్వాత, ప్రస్తుత ప్రాసిక్యూషన్‌లకు ఆధారమైన అసలు ఢిల్లీ ఫుడ్ ల్యాబొరేటరీ నివేదికల సాక్ష్య విలువ గణనీయంగా తగ్గిపోయిందని జస్టిస్ మధు జైన్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం పేర్కొంది. "బాంబే హైకోర్టు జారీ చేసిన తదుపరి ఉత్తర్వులు, సిఎఫ్‌టిఆర్ఐ ద్వారా కొత్త విశ్లేషణకు దారితీసిన సుప్రీం కోర్టు ఆదేశాలు, ఎన్‌సిడిఆర్‌సి ముందు జరిగిన విచారణల ముగింపు, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ హైకోర్టులు వెలువరించిన తదుపరి తీర్పులను పరిగణనలోకి తీసుకుంటే, ప్రస్తుత ప్రాసిక్యూషన్‌లను కొనసాగించడానికి అనుమతించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. ప్రాసిక్యూషన్ పునాదే గణనీయంగా బలహీనపడినప్పటికీ, ఫిర్యాదులను కొనసాగించడం పిటిషనర్లను సుదీర్ఘమైన క్రిమినల్ విచారణకు గురిచేస్తుంది" అని ఢిల్లీ హైకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది రాజేష్ బాత్రా, ప్రతివాది తరఫున ఎపిపి దిగమ్ సింగ్ దాగర్ వాదనలు వినిపించారు.

# ప్రజల్లోకి వెళ్లేముందు హెడ్‌సెట్ పెట్టుకోండి

### మమతా బెనర్జీపై బెంగాల్ సిఎం సెటైర్లు



**కోల్‌కత్తా, ఆగస్టు 10:** మమతా బెనర్జీ ప్రజల్లోకి వెళ్లేటప్పుడు హెడ్‌సెట్ పెట్టుకుంటే మంచిదని, అప్పుడు దొంగ అంటూ జనం చేసే నినాదాలు వినపడవని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి సూచించారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బిజ్‌పూర్‌లో మమత పర్యటన సందర్భంగా ఆమె కాన్వాయ్‌పై దాడి జరగడం, నిరసనలు వ్యక్తమైన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పోలీసు కస్టడీలో మరణించిన తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్త బిర్జు కియోట్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమత ఆదివారం బిజ్‌పూర్‌కు వెళ్లారు. ఈ సమయంలో ఆమె తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. కొందరు నిరసనకారులు మమత కాన్వాయ్‌పైకి బూట్లు, బురద, రాళ్లతో దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ దాడి వెనుక బీజేపీ గూండాలు ఉన్నారని మమత ఆరోపించారు. కారు అద్దాలు తెరిచి ఉంటే తనకు ప్రాణహాని జరిగి ఉండేదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మమత ఆరోపణలను సీఎం సువేందు అధికారి పూర్తిగా ఖండించారు. ఇది పూర్తిగా ప్రజా ఆగ్రహం వల్ల జరిగిన ఘటన అని, ఇందులో భారతీయ జనతా పార్టీ ప్రమేయం లేదని స్పష్టం చేశారు. టీవీ ఫుటేజీలో తనకు బీజేపీ జెండాలు గానీ, తెలిసిన కార్యకర్తల ముఖాలు గానీ కనిపించలేదని ఆయన అన్నారు. మమతకు ఇంకా జడ్‌ప్లస్ కేటగిరీ భద్రత కొనసాగుతోందని, ఈ ఘటన సమయంలో కూడా పోలీసులు ఆమెకు పూర్తి భద్రత కల్పించారని గుర్తుచేశారు. మరో వైపు, మృతుడు బిర్జు కియోట్ కుటుంబ సభ్యులు కూడా మమత రాకను వ్యతిరేకించినట్లు సువేందు తెలిపారు. తమకు రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకం ఉందని, అతడి మృతిపై న్యాయం జరగాలని కోరు తున్నారని, మమతను తాము పిలవలేదని కుటుంబ సభ్యులు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు.

# అధికారిక కార్యక్రమాల్లో తమిళ తాయ్ వాళ్తు తప్పనిసరి..

### తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

**చెన్నై, ఆగస్టు 10:** తమిళనాడులోని అన్ని అధికారిక కార్యక్రమాల్లో ఇకపై రాష్ట్ర గీతం తమిళ తాయ్ వాళ్తుకే ప్రథమ ప్రాధాన్యం లభించనుంది. కార్యక్రమాల ప్రారంభంలో రాష్ట్ర గీతాన్ని ఆలపించడాన్ని తప్పనిసరి చేస్తూ సోమవారం తమిళనాడు శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది. రాష్ట్రంలోని విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు అన్ని ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు ఈ నిబంధన వర్తిస్తుంది. ముఖ్యమంత్రి విజయ్ సభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, డీఎంకే, అన్నాడీఎంకే, కాంగ్రెస్‌తో సహా అన్ని రాజకీయ పార్టీలు దీనికి సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్ వాయిస్ ఓటు ద్వారా ఈ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు వెల్లడించారు.



ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, తమిళ భాష తమ రాష్ట్రానికి ప్రాణనాడి, భావోద్వేగం, అస్తిత్వమని అభివర్ణించారు.

# సంక్షిప్త వార్తలు

## రైట్‌వింగ్ విశ్లేషకుడు మోహన్‌దాస్ అరెస్టు



**కొచ్చి, ఆగస్టు 10:** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులపై, ముఖ్యంగా మహిళలపై అత్యంత హేయమైన, హింసాత్మక వ్యాఖ్యలుచేసిన ప్రముఖ రైట్‌వింగ్ విశ్లేషకుడు టి.జి. మోహన్‌దాస్‌ను కేరళ పోలీసులు అరెస్ట్‌చేశారు. కొచ్చి లోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు, సోమవారం ఉదయం అరెస్ట్‌ను అధికారికంగా నమోదు చేశారు. ఈ ఘటన కేరళలో రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. మోహన్^దాస్ తన పత్రిక అనే యూట్యూబ్ ఛానల్‌లో పోస్ట్ చేసిన వీడియోలో ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

## అయోధ్య సిఇఒ పోస్టుకు 18 మందితో జాబితా



**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టు కోసం 18 మందిని ఇంటర్వ్యూ కోసం షార్ట్‌లిస్టు చేశారు. రామాలయం ఈసీవో పోస్టు కోసం సుమారు 5300 అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. స్క్రీనింగ్ కమిటీ సుమారు 18 మంది అభ్య ర్థులను ఇంటర్వ్యూ కోసం షార్ట్‌లిస్టు చేసింది. అయితే అడ్మినిస్ట్రేటివ్ అనుభవం ఉన్న వారికి ప్రాముఖ్యత ఇవ్వనున్నారు. షార్ట్‌లిస్టు అయిన అభ్యర్థులను మంగళ, బుధవారం ఆలయ పరి సరాల్లోనే ఇంటర్వ్యూ చేయనున్నారు.

## భౌతిక శాస్త్రవేత్త దీపక్‌ధర్‌కు అరుదైన పురస్కారం



**న్యూఢిల్లీ ఆగస్టు 10:** భారతదేశపు ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త, ఐఐఎస్ఈఆర్ పుణె ప్రొఫెసర్ దీపక్‌ధర్ అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని అందుకున్నారు. భౌతిక శాస్త్రరంగంలో అత్యున్నత పురస్కారాలలో ఒకటిగా భావించే 2026 డిరాక్‌మెడల్‌ను ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ థియరిటికల్ ఫిజిక్స్ ప్రకటించింది. గతంలో స్టీఫెన్ హాకింగ్స్ వంటి దిగ్గజాలు అందుకున్న ఈ పురస్కారం, సైద్ధాంతిక భౌతిక శాస్త్రంలో విశేష కృషి చేసిన వారికి లభిస్తుంది. ఈ ఏడాది ఈ గౌరవం పొందిన నలుగురు శాస్త్రవేత్తలలో ప్రొఫెసర్ ధర్ ఒకరు.

## అసోం-అరుణాచల్ సరిహద్దులో కాల్పులు, 8 మందికి గాయాలు



**గువాహతి, ఆగస్టు 10:** అసోం-అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దులో సోమవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. మింగ్‌మాంగ్ బడాతి ప్రాంతంలో అరుణాచల్‌ప్రదేశ్ వైపునుంచి గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో ఎనిమిది మంది గ్రామస్థులు గాయపడ్డారు. గోగాముఖ్ రెవెన్యూ సర్కిల్ పరిధిలోని సరిహద్దు ప్రాంతంలో ఈఘటన జరిగింది. అసోం భూభాగంలో అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమణకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో ఇరువర్గాలమధ్య వివాదంతలెత్తింది. దీంతో అరుణాచల్ వైపునుంచి వచ్చిన వ్యక్తులు అసోం గ్రామస్థులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు సమాచారం.

## బెంగాల్ రైతును కిడ్నాప్ చేసిన బంగ్లాదేశీయులు..



**జల్‌పాయ్‌గురి, ఆగస్టు 10:** పశ్చిమ బెంగాల్‌లోని జల్‌పాయ్‌గురి జిల్లా సరిహద్దులో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సరిహద్దు భద్రతా దళం ఒక బంగ్లాదేశీ చొరబాటుదారుడిని అరెస్ట్ చేసి నందుకు నిరసనగా బంగ్లాదేశీయులు భారత భూభాగంలోకి అక్రమంగా ప్రవేశించి దీపాంకర్ గోప్ అనే భారతీయ తేయాకు రైతును అపహరించి బంగ్లాదేశ్‌కు తీసుకెళ్లారు. తమ దేశానికి చెందిన వ్యక్తిని భారత్ విడుదల చేస్తేనే, రైతును తిరిగి పంపిస్తామని బంగ్లాదేశ్ సరిహద్దు బలగాలు, స్థాని కులు దబాయిస్తున్నట్లు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## ట్రిబ్యునళ్ల సంస్కరణల బిల్లుకు లోక్‌సభ ఆమోదం



**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** ట్రిబ్యునళ్ల నియామక ప్రక్రియను బలోపేతం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ట్రిబ్యునళ్ల సంస్కరణల బిల్లు2026కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. సోమవారం సభలో వివిధ అంశాలపై విపక్షాల నినాదాల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే ఈ బిల్లుమూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఈ బిల్లును సభలో లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

MN 10 final:MN 10 final 01/01/2001 09:59 Page 1



# పురాణాల్లో భాగవతం చాలా గొప్పది

### -భక్తికి పరాకాష్ట శ్రీమద్భాగవతం -సంస్కృత పండితులు మంత్రిరాజు శివరామయ్య

**పొన్నూరు, ఆగస్టు 10,ప్రభాతవార్త:** పురాణాలలో శ్రీమద్భాగవతం చాలా గొప్పదని, భక్తికి పరాకాష్టగా శ్రీ మద్భాగవతాన్ని చెప్పుకోవచ్చని శ్రీ భావనారాయణస్వామి సంస్కృత కళాశాల పూర్వవిద్యార్థి, నరసరావుపేటకు చెందిన సంస్కృత పండితులు మంత్రిరాజు శివరామయ్య అన్నారు. స్థానిక బ్రాహ్మణ బజారులోని శ్రీ గాయత్రీదేవి మందిరం-శంకరమఠంలో ప్రతిమాసం వాణీదరహాసం సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ప్రహ్లాద చరిత్రపై ప్రవచనం జరిగింది. ప్రవచనకర్త మంత్రిరాజు శివరామయ్య




మాట్లాడుతూ అత్యంత పరమ భక్తుడిగా కీర్తింపబడిన వ్యక్తి ప్రహ్లాదుడని చెప్పారు. మహాకవి బమ్మెర పోతనామాత్యుడు భాగవతంలో అత్యంత ప్రసిద్ధమైన భక్తి తత్వాన్ని కన్నులకు కట్టినట్లుగా వర్ణించారన్నారు. రాక్షస రాజు హిరణ్యకశిపుని కుమారుడు అయిన ప్రహ్లాదుడు శ్రీ మహావిష్ణువు పట్ల అచంచలమైన భక్తిని కలిగి ఉండడం, తండ్రి ఎన్నిసార్లు, ఎన్ని విధాలుగా హింసించినా భగవత్కృపతో ప్రాణాలతో బయటపడడం ఇందులోని సారాంశమన్నారు. పోతన మహాభాగవతంలో ప్రహ్లాద చరిత్రను అత్యంత రమణీయంగా వర్ణించారన్నారు. హిరణ్యకశిపుడు రాజై దేవుళ్ళను వేధిస్తుంటే ఆయన కుమారుడు ప్రహ్లాదుడు మాత్రం నారాయణ నామ స్మరణ చేస్తూ పరమ విష్ణు భక్తుడిగా పెరిగిన విధానాన్ని శివరామయ్య చక్కని పద్య, గద్యాలలో ఆహుతులను అలరింపచేశారు. విష్ణుభక్తిని మాన్పించడానికి తన కుమారుడైన ప్రహ్లాదుని కొండల నుండి పడదోయడం, సర్పాలను వదలడం, మంటల్లో కాల్చడం వంటి అనేక ప్రయత్నాలు చేసినా ప్రహ్లాదుని శ్రీమహావిష్ణువు కాపాడుతూ వచ్చాడు. ఈ సన్నివేశం ద్వారా భగవంతుని అనుగ్రహం ఉంటే ఏ దుష్టశక్తులు ఏమీ చేయలేవని ప్రహ్లాదుని చరిత్ర ద్వారా నిరూపితం అయిందన్నారు. ఏ దేవుడు ఎక్కడ ఉన్నాడని హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని నిలదీయగా అణువణువునా కలడని ప్రహ్లాదుడు బదులిచ్చాడు. స్తంభాన్ని చూపగా హిరణ్యకశిపుడు దానిని పగులకొట్టడంతో నృసింహావతారం ఉద్భవించింది. నృసింహస్వామి ఉగ్రరూపంలో హిరణ్యకశిపుని సంహరించి ధర్మాన్ని నిలబెట్టాడు. ఉగ్రంలో ఉన్న నృసింహుని ప్రహ్లాదుడు ప్రార్థించి శాంతిపచేశాడు. తర్వాత ప్రహ్లాదుడు రాజై ధర్మబద్ధంగా పాలన సాగిస్తున్నాడు. ఈ విధంగా శివరామయ్యచే సాగిన ప్రవచనం సాహిత్యాభిమానులను, ఆధ్యాత్మిక పరులను విశేషంగా ఆకట్టుకొంది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నాగలింగం హరిహరపంత్ మాట్లాడుతూ భాగవతోత్తముల ప్రసంగాలు వినడం ద్వారా భక్తి,ముక్తి కలుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ పురాణాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భాగవతోత్తముల ప్రసంగాలు వినడం ద్వారా భాష, మాట్లాడే విధానం, జ్ఞానం లభిస్తాయన్నారు. సంస్థ గౌరవాధ్యక్షుడు కొలను మంగనాధరావు మాట్లాడుతూ హరినామస్మరణ ఎన్నిమార్లు, ఏ విధంగా చేసినా నిత్యనూతనంగానే ఉంటుందన్నారు. హరినామస్మరణే ముక్తికి మార్గమన్నారు. అనంతరం శివరామయ్యను సంస్థ పక్షాన దుశ్శాలువా, మెమెంటో, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించారు. సాక్షి శ్రీ భావనారాయణస్వామి దేవాలయం అర్చకస్వామి గోవర్ధనం రామకృష్ణ కార్యక్రమంలో పాల్గొని శివరామయ్యకు శ్రీ భావదేవుని చిత్రపటాన్ని అందచేసి, వేదాశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఆర్‌కెవిస్టీ సాయి, దేశిరాజు బలగంగాధరతిలక్, చింతలపల్లి రామకృష్ణ, విశ్రాంత తెలుగు పండితులు సూరా రామారావు, పరాశరం శేషకుమారి, పరాశరం మురళీధర తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో విఖనస మహర్షి జయంతి

**పొన్నూరు, ఆగస్టు 10,ప్రభాతవార్త:** శ్రీ విఖనస మహర్షి జయంతిని హిందూ పర్వదినమైన శ్రావణ పౌర్ణమి(జంధ్యాల పౌర్ణమి) రోజున వైఖానస అర్చకులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని విఖనస మహర్షి జయంతి కమిటీ కన్వీనర్ నారాయణం రాధాకృష్ణమూర్తి తెలిపారు. మండల కేంద్రమైన కాకుమానులో శ్రీ విఖనస మహర్షి జయంతి వేడుకలను ఘనంగా, భక్తిశ్రద్ధలతో, శాస్త్రోక్తంగా నిర్వహించారు. నారాయణం రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారితోపాటు అనేక వైష్ణవ దేవాలయాల్లో భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవాన్ని నిర్వహించుకోవడం పురాతన కాలం నుంచి వస్తున్న సంప్రదాయమన్నారు. ఆలయాల్లో శ్రీ విఖనస మహర్షి అందించిన వైఖానస ఆగమశాస్త్రం ప్రకారమే జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. తిరుమల శ్రీ వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధిని సభ, కాకుమాను ప్రాంతీయ కార్యాలయం, ప్రాంతీయ విఖనస మండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలలోని ప్రముఖ దేవాలయాల్లో ఉత్సవాల సందర్భంగా విశేష అలంకరణలు చేసే కళాకారులను సత్కరించారు. నారాయణం వెంకట వరాహ నరసింహ దీక్షితులు(వరప్రసాద్)కు అలంకార శౌరి అనే బిరుదును ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ అలంకార ప్రియో విష్ణు: అన్నట్లుగా భగవంతున్ని ఉన్న రూపంలో కాకుండా వివిధ రూపాలలో అలంకారాలు చేసి భక్తులకు కనువిందు కలిగేటట్లు, భక్తులలో భక్తిభావాన్ని నింపే విధంగా చూడడం కూడా ఒక కళేనన్నారు. చిన్ననాటి నుండి స్వామివారికి వివిధ రకాల అలంకారాలు చేసే స్వామివారి సేవలో తరించాలన్నదే తన చిన్న ఆశ అని చెప్పారు. పొన్నూరులోని సాక్షి భావనారాయణస్వామి దేవాలయంలో మా బాబాయి యన్.వి.ప్రసాద్ చేస్తున్న అలంకరణలు చూసి ముగ్ధుడనై, పట్టుదలతో నేర్చుకొని అనేక ప్రముఖ దేవాలయాలలో స్వామివారి అలంకరణల్లో



పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాన్నారు. సభకు అధ్యక్షత వహించిన హిందూ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, సంస్కృత పండితులు, వ్యాఖ్యాత, డాక్టర్ దీవి నరసింహ దీక్షితులు మాట్లాడుతూ ప్రతి ఏటా విఖనసాచార్య జయంతిని నిర్వహిస్తున్నామన్నారు. జయంతి సందర్భంగా ఉత్తమ అర్చకస్వాములను, ఉత్తమ అలంకారం చేసేవారిని సత్కరిస్తున్నామన్నారు. అనంతరం గానకోకిల నారాయణం వరలక్ష్మి ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ నారాయణం రాధాకృష్ణమూర్తి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వాలంటీర్లు పాల్గొని ఏర్పాట్లు చేశారు.

# పిజిఆర్ఎస్‌కు 6అర్జీలు

**పొన్నూరు, ఆగస్టు 10,ప్రభాతవార్త:** స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)కు వివిధ సమస్యలకు సంబంధించి ఆరు అర్జీలు అందినట్లు ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు తెలిపారు. అందులో సాంఘిక సంక్షేమశాఖకు సంబంధించి మన్నెం కిషోర్ అనే వ్యక్తి అర్జీ అందజేశారు. విద్యుత్‌శాఖకు సంబంధించి రెండు ఫిర్యాదులు అందులో నిడుబ్రోలుకు చెందిన పి.దేవమణి కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని అర్జీ అందజేశారు. అదే గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాసరావు విద్యుత్ బిల్లుకు సంబంధించిన సమస్య పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు. పోలీసుశాఖకు సంబంధించి పట్టణానికి చెందిన ఎండి షాహిదా ఆస్తి ఆక్రమణకు



సంబంధించి ఫిర్యాదు చేశారు. పంచాయితీరాజ్‌కు సంబంధించి కసుకర్రు గ్రామానికి చెందిన కె.భాగ్యంతోపాటు పలువురు ప్రధాన రహదారి పక్కన వర్షపు నీరు నిల్వ ఉండడం, డ్రైనేజి, కాలువ సౌకర్యం లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు అర్జీని అందజేశారు. రెవెన్యూ శాఖకు సంబంధించి పట్టణంలోని భావనగర్ కాలనీ, ఒకటో వార్డుకు చెందిన కోట రాంబాబు పట్టా భూములు,భూమి ఆస్తి హక్కులు, సంబంధిత రికార్డులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ వేముల శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు, వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్ తదితరులున్నారు.

# డిఎస్సీ అవకతవకలపై సిబిఐ విచారణ జరిపించాల్సిందే

### -విద్యాశాఖామంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి -పోలీసులు అత్యుత్సాహం మానుకోవాలి -వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

**పొన్నూరు, ఆగస్టు 10,ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వహించిన డిఎస్సీ-2025 నియామకాలపై వచ్చిన అవినీతి, ఆరోపణలపై సిబిఐ విచారణ జరిపించాలని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ డిమాండ్ చేశారు. వైకాపా పార్టీ ఆదేశాల



మేరకు సోమవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ డిఎస్సీపై వచ్చిన ఆరోపణలతో లక్షలాదిమంది నిరుద్యోగ యువతలో తీవ్ర ఆందోళన ఉందని, ప్రశ్నాపత్రాల లీకేజి, ఎంపిక ప్రక్రియలో అవకతవకలు, మెరిట్‌కు అన్యాయం జరిగిందనే తదితర ఆరోపణలపై ప్రభుత్వం సిబిఐ విచారణ జరిపించి ప్రభుత్వం తమ సచ్చీలతను నిరూపించుకోవాలని డిమార్ చేశారు. ఉద్యోగాల కోసం ఎన్నో ఏళ్ళు కష్టపడి సిద్ధమైన అభ్యర్థుల భవిష్యత్తుతో ఎవరికీ చెలగాటమాడే హక్కులేదన్నారు. డిఎస్సీలో వచ్చిన అవినీతి, అక్రమాల ఆరోపణలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖామంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తొలుత ఐలాండ్ సెంటర్‌లో ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో సాగింది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అంబటి రాఘవయ్య, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి, వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచి చుండూరు వీరయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ నాజర్, వాణిజ్యవిభాగం అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు, దక్కుమళ్ళ రవి, చింతలపూడి మురళీకృష్ణ, లంకపోతు పిచ్చిరెడ్డి, చిర్రా అక్కిరెడ్డి, గోపిశెట్టి వాసు, ఆళ్ళ శ్రీరామిరెడ్డి, దాసరి దానమ్మ, కొల్లి శేషిరెడ్డి, బద్ధూరి భాస్కరరెడ్డి, కురాకుల ముత్యమేశ్వరరావు, తాడిబోయిన వేణుగోపాల్, ఉయ్యూరు సతీష్‌రెడ్డి, గోళ్ళ జ్యోతి, మందాల శివారెడ్డి, దంతాల శ్రీను, యాతం మమత, షేక్ మౌలాలి తదితరులున్నారు.


**పోలీసుల తీరుపై మండిపడ్డ నాయకులు:**

శాంతియుతంగా నిరసన తెలుపుకునే హక్కు భారత రాజ్యాంగం కల్పించిదని, అలాంటి హక్కును కాలరాసే విధంగా అర్బన్ పోలీసులు వ్యవహారించడం తీవ్ర అభ్యంతరకరమని అంబటి మురళీకృష్ణ మండి పడ్డారు. ఐలాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద టెంట్ వేసి శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే అర్బన్‌ఎస్సై బలగాని జగన్మోహనరావు వచ్చి టెంట్‌ను తొలగించాలని, లేకపోతే తాము తొలగిస్తామని టెంట్‌కు సంబందించిన బొంగులను లాగడం న్యాయా? అని ప్రశ్నించారు. తమ కార్యకర్తలు ఎంత చెప్తున్నా ఎస్సై పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. పోలీసుల తీరుపై ప్రైవేట్ కేసు వేసి న్యాయం కోసం న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు. పోలీసుల తీరు పట్ల అంబటి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఇండియా-తైవాన్ విద్యా సహకారానికి కొత్త అధ్యాయం

### -విజ్ఞాన్స్‌ను సందర్శించిన తైవాన్ ఏషియా ప్రతినిధి బృందం

**పొన్నూరు, ఆగస్టు 10,ప్రభాతవార్త:** ఇండియా-తైవాన్ విద్యా సహకారానికి మరింత బలం చేకూర్చే దిశగా తైవాన్‌కు చెందిన ఏషియా యూనివర్సిటీ ప్రతినిధి బృందం సోమవారం విజ్ఞాన్స్ యూనివర్సిటీని సందర్శించింది. ఈ పర్యటన ఇండియా-తైవాన్ అకడమిక్ కోలాబరేషన్ కార్యక్రమంలో భాగంగా వారం రోజులపాటు నిర్వహించనున్నారు. విజ్ఞాన్ విశ్వవిద్యాలయానికి చేరుకున్న ప్రతినిధి బృందానికి యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రెండు విశ్వవిద్యాలయాల మధ్య విద్యా, పరిశోధన, అంతర్జాతీయ భాగస్వామ్య అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. తైవాన్ ప్రతినిధి బృందంలో ప్రొఫెసర్ లిన్ చున్-వెయ్(డీన్, అకడమిక్ అఫైర్స్ అండ్ ఇంటర్నేషనల్ అఫైర్స్), ప్రొఫెసర్ డాక్టర్ చార్లెస్ సి.ఎన్.వాంగ్(డీన్ ఆఫీస్ ఆఫ్ ఇండస్ట్రీ-అకడమియా కోలాబరేషన్), ప్రొఫెసర్ డాక్టర్ చింగ్-హ్సియన్ హ్సు, మిస్ జిల్ లై, డాక్టర్ యింగ్-రాంగ్ హో పాల్గొన్నారు. సమావేశంలో ఇరు విశ్వవిద్యాలయాల మధ్య విద్యా సహకారాన్ని మరింత విస్తరించడంతోపాటు సంయుక్త పరిశోధనలు, సెమీకండక్టర్, కృత్రిమ మేధస్సు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో సంయుక్త విద్యా కార్యక్రమాలు, అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ ఇంటర్న్‌షిప్‌లు, విద్యార్థుల గ్లోబల్ మొబిలిటీ, ద్వైపాక్షిక డిగ్రీ అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. విజ్ఞాన్స్ వర్సిటీ వీసి కేవీ క్రిష్ణకిషోర్ మాట్లాడుతూ ప్రపంచస్థాయి విద్యా సంస్థలతో భాగస్వామ్యాల ద్వారా విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్య, పరిశోధన, పరిశ్రమ అనుసంధాన



అవకాశాలను అందించడమే విజ్ఞాన్ లక్ష్యమని తెలిపారు. తైవాన్ సాంకేతిక నైపుణ్యాన్ని భారత యువత ప్రతిభతో కలిపితే ప్రపంచస్థాయి ఆవిష్కరణలకు మార్గం సుగమమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైకాపా నిరసన ర్యాలీకి అనూహ్య స్పందన

## నినాదాలతో హోరెత్తిన ప్రత్తి పాడు

**ప్రత్తిపాడు, ఆగస్టు 10, ప్రభాతవార్త :** వైఎస్ఆర్సిపి అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గ కేంద్రంలో సోమవారం వైసిపి ఇన్చార్జ్ బలసాని కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు నిర్వహించిన భారీ నిరసన ర్యాలీకి ప్రజల నుండి అనూహ్య స్పందన లభించిందని ఆ పార్టీ శ్రేణులు తెలియజేశాయి. ఈ ర్యాలీలో వైసీపీ శ్రేణులు చేసిన నినాదాలు హోరెత్తాయి.






దిక్కులు పిక్కటిల్లేటట్లు నినాదాలు చేశారు. మండల కేంద్రంలోని పాత మద్రాస్ రోడ్ ఈ ర్యాలీతో స్తంభించిపోయింది. ప్రయాణికులు ఇబ్బందులకు గురైనారు. ఈ సందర్భంగా ప్రతిపాడులో వైసీపీ శ్రేణులు చేస్తున్న భారీ నిరసన ర్యాలీ విజయవంతం కావడంతో నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. తాము అడిగిన దాంట్లో వాస్తవం లేకపోతే ప్రజల నుండి ఇంత స్పందన ఎలా వస్తుందని ప్రశ్నించారు. డీఎస్సీ అక్రమాలపై కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పకుండా దాటవేస్తూ, వైసిపి నిరసనలపై తప్పుడు ప్రచారం చేయడం సమంజసం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా పోరాటాలను అణిచివేయాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని, ఈ నిరసన కార్యక్రమాన్ని ఓ ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. అందుకే వైసిపి పోరాటాలను కూటమి ప్రభుత్వం కడగదొక్కాలనే ప్రయత్నం చేస్తుందని వివరించారు. డిఎస్సి లో అక్రమాలు జరిగింది వాస్తవం కాబట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉలిక్కిపడుతున్నారని చెప్పారు. ఈ స్కామ్ నుండి చంద్రబాబు, లోకేష్ తప్పించుకోలేరని డీఎస్సీ అక్రమాలపై కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పకుండా వైసిపి చేస్తున్న నిరసనపై తప్పుడు ప్రచారం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటివరకు ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించ లేదన్నారు. డీఎస్సీ 2025లో అక్రమాలు జరిగినట్లు స్పష్టంగా తెలుస్తుంది. అక్రమాలు జరిగాయి కాబట్టే సిబిఐ విచారణకు తండ్రి, కుమారుడు భయపడుతున్నారని పేర్కొన్నారు. లీకేజీ జరిగిందనడానికి తిరుగులేని ఆధారాలు మా వద్ద ఉన్నాయని వివరించారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త జీవోలో డైరెక్టుగా ఉద్యోగాలు ఇచ్చే వెలుసుబాటు ఉందా? లేదా? అని అడుగుతున్నామని వివరించారు. ఆటలు ఆడకపోయినా ధ్రువపత్రాలను కూటమి అనుయాయులకు ఇచ్చారని విమర్శించారు. ఔట్సోర్సింగ్ చేస్తున్న ఉద్యోగికి ర్యాంకు వచ్చిన మాట వాస్తవం కాదా? ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరచి ప్రజలకు వాస్తవాలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ పథకానికి తూట్లు పొడిచారని, విద్య, వైద్య రంగాలను పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు.డీఎస్సీ అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ శ్రేణులు చేస్తున్న నిరసన ర్యాలీలు విజయవంతం అయ్యాయని ఆనందం వ్యక్తం చేశారు. డిఎస్సీ అక్రమాలపై విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామాతో పాటు థర్డ్ పార్టీ విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల వైసిపి పార్టీ నేతలు కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి

### మాజీ ఎమ్మెల్యే శివకుమార్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ.

**తెనాలి ఆగస్ట్ 10(ప్రభాతవార్త):** మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, డీఎస్సీ2025 లో జరిగిన లీకేజీలు మరియు అక్రమాలపై సమగ్రంగా సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎంఎల్ఏ అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో తెనాలి పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ అక్రమాలకు పూర్తి బాధ్యత వహిస్తూ మంత్రి లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ, డీఎస్సీ పరీక్షలో జరిగిన అక్రమాలు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడటమేనని, దీనిపై ప్రభుత్వం పూర్తి వివరణ ఇవ్వాలని అన్నారు. అలాగే, ఈ మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని,మంత్రి లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ స్కాం పై సమగ్ర విచారణ జరిగితేనే



నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని, ఈ పోరాటం నిరంతరం కొనసాగుతుందని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో వైసీపీ విద్యార్థి విభాగం,రాష్ట్ర, జిల్లా, పట్టణ, నియోజకవర్గ వివిధ విభాగాలు, యువజన, విద్యార్థి విభాగాల అధ్యక్షులు, సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, నిరుద్యోగులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# మున్సిపల్ కార్యాలయంలో గ్రీవెన్స్

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 10(ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే,ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (గ్రీవెన్స్) కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.స్వీకరించిన అర్జీలను సంబంధిత విభాగాధిపతులకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా పంపించారు. ప్రధానంగా టౌన్ ప్లానింగ్ సెక్షన్ కి సంబంధించి,డి. ఎస్. ఎస్.ప్రసాద్ తన గృహం నందు అనుమతులు లేకుండా



కూల్చివేస్తున్నారని తెలియజేసిన విన్నపము., అలాగే రెవెన్యూ సెక్షన్ కు సంబంధించి,కగ్గా నాగరాజు హౌస్ హోల్డ్ మ్యాపింగ్ లో 7వ వార్డు నందు నమోదు అయినది. కావున 7వ వార్డు నుండి 6వ వార్డులోకి వారి హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేయాలసినదిగా చేసిన వినతి.వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

# పదోన్నతిపై మలేరియా అధికారి ఉమాకాంత్ బదిలీ

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 10(ప్రభాతవార్త):** తెనాలి పట్టణ మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ గా పనిచేస్తున్న శ్రీకంఠ ఉమాకాంత్ ఉద్యోగోన్నతి పై పిడుగురాళ్ల మెడికల్ కళాశాలకు లెక్చరర్ ఇన్ సోషల్ సైన్స్ పోస్టుకు బదిలీ అయ్యారు.విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి, అందరి మన్ననలు పొంది, తోటి సిబ్బందితో కలుపుగోలు తనంతో పనిచేసి,ఉద్యోగ నిర్వహణలో భాగంగా బదిలీపై వెళుతున్న



ఉమకాంత్ కి శుభాకాంక్షలు తెలుపుతూ, తెనాలి పట్టణ యుఎల్ బి ఆరోగ్యవిస్తరణాధికారి అందెబాలచంద్రమోళి, మైలా అప్పారావు, మలేరియా సిబ్బంది, అభినందనలు తెలియజేశారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన తెదేపా నేతలు

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 10(ప్రభాతవార్త):** మానవత్వమే ధ్యేయంగా, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత అందించిన తెలుగుదేశం పార్టీ నాయకులు. తెనాలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్,మాజీ మంత్రి, శాసనమండలి సభ్యులు ఆలపాటి



రాజేంద్రప్రసాద్ చొరవ మరియు ప్రత్యేక సహకారంతో తెనాలి నియోజకవర్గానికి చెందిన, కందలం ప్రసన్న,షేక్ ఖాదర్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 2,52,834/,షేక్ బాజీ గారి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1,02,009/ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మొత్తం రూ. 3,54,843/ మంజూరైంది.ఈ ఆర్థిక సహాయానికి సంబంధించి సోమవారం, బాధిత కుటుంబసభ్యులకి 3,54,843/ ల చెక్కులను స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు అందజేశారు.ఆపద సమయంలో ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి,అలాగే ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి,బాధిత కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.పట్టణ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్ చెక్కులను అందజేయగా, ఈ కార్యక్రమంలో,వసంతం అశోక వర్ధన,జొన్నాదుల మహేష్,మల్లవరపు విజయ్,షావుల్ సయ్యద్, దోగుపర్తి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పెదరావురులో విద్యుత్ సరఫరా నిలిపివేత


**తెనాలి ఆగస్ట్10(ప్రభాతవార్త):** తెనాలి మండలం పెదరావురు గ్రామంలో మంగళవారం విద్యుత్ లైన్ల మారమ్మత్తుల మరియు లైన్లకు అడ్డుగా ఉన్న చెట్టుకొమ్మలు తొలగింపు పనులు జరుగు తున్న,దృష్ట్యా ఉదయం 8గం.నుండి మధ్యాహ్నం 2గం.వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయ బడు



తుందని, కావున వినియోగదారులు గమనించి సహకరించ వలసిందిగా, ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌తెనాలి,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# తహశీల్దార్‌ను సత్కరించిన రైతులు

**తెనాలి ఆగస్ట్ 10(ప్రభాతవార్త):** ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న పంట కాలువ మరమ్మత్తులను,రైతుల విజ్ఞప్తి మేరకు మరమ్మత్తులు చేయించి సాగునీటి పారుదలకు ఆటంకం లేకుండా రైతుల సమస్యను పరిష్కరించిన తెనాలి మండల తహసిల్దార్ కేవీ. గోపాలకృష్ణ కి పెదరావూరు గ్రామ రైతులు తమ కృతజ్ఞతలు తెలిపారు.పెదరావూరు పెరవలి కాలువకి సంబందించి అనుబందముగా ఉన్న వ్యవసాయ పంట కాలువ తూము మరమత్తులకు సంబందించి,తహసీల్దార్ కేవీ.గోపాలకృష్ణ ని కలువగా వెంటనే స్పందించి సత్వరం పరిష్క లించి ఇరిగేషన్ అధికారుల సమక్షంలో రైతుల సమశ్య పరిష్క రించినారు. కావున పెదరావురు గ్రామ రైతులందరి



తరుపున,రైతు చొప్పర సుధాకర్ ఆధ్వర్యంలో,తహసీల్దార్ కేవీ.గోపాలకృష్ణ కి ధన్యవారాలు తెలుపుతూ,పుష్పగుచ్చం శాలువాతో చిరు సత్కారము చేశారు. ఈ కార్యక్రమంలో చొప్పర సుధాకర్, చెంచారెడ్డి, గోపీ, పిచ్చయ్య, కే.ఉదయ్ శంకర్ ,కే.పరశు రాంబాబు, పి.ప్రసాద్,జి.కిశోర్,జె. నరేంద్ర, పి.సురేంద్ర,ఇతర రైతులు పాల్గొన్నారు.

# రెండేళ్ళ కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి,సంక్షేమం

**వేమూరు ఆగస్టు 10 (ప్రభాతవార్త) :**

రెండేళ్ళ కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర అభివృద్ధి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలియజేశారు. సోమవారం సాయంత్రం రెండేళ్ళ అభివృద్ధి సంక్షేమం ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా బూతుమల్లి గ్రామంలో ఎమ్మెల్యే ఆనందబాబు, జిల్లా పరిషత్ ఛైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినాలు పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ గ్రామాలలో కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి కార్యక్రమాల అమలతో పాటు ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలు కూడా అనేకం రాష్ట్రంలో అమలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ఇటువంటి ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలని ఆనందబాబు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా 92లక్షల రూపాయలతో ఎంతో నూతనంగా నిర్మించిన బిటి రోడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, టిడిపి నాయకులు జొన్నలగడ్డ విజయబాబు, గ్రామ మాజీ సర్పంచ్ వేమూరి పద్మావతి, శేషుబాబు, మండల పార్టీ అధ్యక్షులు గాజుల వెంకట సుబ్బయ్య, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ అమ్మిశెట్టి కిషోర్, నీటి సంఘం అధ్యక్షులు వరప్రసాద్, సీనియర్ నాయకుల గోగినేని కేశవరావు, తుమ్మల మదన్‌మోహన్‌రావు, కన్నెగంటి ప్రసాద్, వేమూరి మురళీకృష్ణ, షేక్ హనీఫ్, వేల్పుల రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నీరు ఎంతో విలువైనది

**నిజాంపట్నం, ఆగస్టు 10, ప్రభాతవార్త:** మానవ జీవితానికి నీరు ప్రధానమైనదని జల్ సంచయ్ జల్భాగ్దారి నోడల్ అధికారి పి హరీష్ అన్నారు. సోమవారం మండలంలోని కూచినపూడి,



అడవులదీవిలలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలవలలో పూడికతీసే పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీటిని చాలా భద్రంగా వాడుకోవాలని సూచించారు. వర్షపు నీటిని వడిసి పట్టుకుని చెరువులకు మళ్ళేలా చూడాలన్నారు. నీటిని వృధా చేయకూడదన్నారు. నీరు సక్రమంగా పారుదల ఉంటే పంట పొలాలకు, చెరువులకు సులభంగా చేరుతుందన్నారు. నీటి వృధాను అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టిఏ షేక్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్‌కు 10 అర్జీలు

**రేపల్లె, ఆగస్టు 10, ప్రభాతవార్త:** పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆర్డీవో బి.శ్రీదేవికి 10 అర్జీలను అందజేశారు. విద్యుత్ సర్వీస్‌ను తొలగించాలని, విద్యుత్ కనెక్షన్‌లను మంజూరు చేయించాలని, పంట కాల్వను పునరుద్ధరించాలని, రహదారిలో బహిరంగంగా మత్స్యసంపదను ఎండబెట్టడం వలన



దుర్వాసనతో అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నందున చర్యలు తీసుకోవాలని, మోసం చేసిన ధాన్యం ఏజెంటుపై చర్యలు చేపట్టాలని, అంగన్వాడీ కార్యకర్తలకు సామాజిక పెన్షన్ విధులను రద్దు చేయాలని, విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయించాలని, సిమెంట్ రోడ్డు మరమ్మతులు పూర్తి చేయించాలని కోరుతూ ఎం.వెంకటేశ్వరరావు(రేపల్లె), వి.రవికుమార్, వి.రాఘవేంద్రరావు (ఓలేరు), టి.జగదీష్(గోవాడ), కె.నాగరాజు(నిజాంపట్నం), కె.శ్రీనివాసరావు(బొందలగరువు), కె.నరోజిని(రేపల్లె అర్బన్), కె.అనూరాధ(అరవపల్లి), జి.మనోహర్(ఉప్పూడి)లు అర్జీలు అందజేశారు. సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్డీవో బి.శ్రీదేవి తెలిపారు.

# విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్ళొద్దు

## -డిఎస్పీ అబ్దుల్ అజీజ్

**రేపల్లె, ఆగస్టు 10, ప్రభాతవార్త:** సమాజంలో విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి వెళ్ళరాదని రేపల్లె డిఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ చెప్పారు. సోమవారం పట్టణంలోని ఎబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో




మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, డిగ్రీ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యా లక్ష్యాలను మాత్రమే సాధించాలని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన విద్యార్థుల భవిష్యత్ నాశనమవుతుందని, తల్లిదండ్రుల పేరు ప్రతిష్టలు దెబ్బతింటాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మానవత సేవా సంస్థ అధ్యక్షుడు కోడె గౌరీశంకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సి.రవిచంద్ర కుమార్, ఐక్యూఎసి సేవా కోఆర్డినేటర్ ఎం.నరసయ్య, ఎన్‌సిసి ఆఫీసర్ కె.బాలగురవయ్య, ఎం.బుజ్జిబాబు, అధ్యాపకురాలు కె.అనూష, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రస్తుత వర్షాభావ పరిస్థితులకు ఆరుతడి పంటలు మరియు చిరుధాన్యాలు సాగు రైతులకు లాభదాయకం : ఏ ఓ

**కాకుమాను ఆగస్టు 10 (ప్రభాత వార్త) :**



మండల పరిధిలోని గార్లపాడు, గరికపాడు, అప్పాపురం గ్రామాలను లాం ఫాం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ రత్నం మరియు డాక్టర్ వి మనోజ్ కుమార్ సందర్శించినట్లు మండల వ్యవసాయాధికారి వి. సుధాకర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ నినో కారణంగా వరికి ప్రత్యామ్నాయంగా అపరాల పంటలైన మినుములు లేదా నీరు అవసరం తక్కువగా ఉన్న చిరు ధాన్య పంటల ను వేసుకోవాలని డా. రత్నం, ప్రధాన శాస్త్రవేత్త సూచించారు. ప్రత్తిలో బెట్ట ను తట్టుకుంటానికి మల్టీ కె (13045) లీటరు నీటికి 10 గ్రాములుపిచికారీ చేసుకోవాలి. మరియు నేలలో నీటిని నిలుపుకుంటానికి నేలపై ఆచ్ఛాదన సూచించారు. రసాయన ఎరువులను పంట సమర్థవంతంగా వినియోగించుకుంటానికి నేలలో సేంద్రీయ కార్బన్ ఆవశ్యకతను గురించి వివరించారు. పంట అవశేషాలను సద్వినియోగం చేసుకుంటానికి ప్రడ్డర్ తో నేలలో కలియ దున్ని డికంపోజరు ను వినియోగించాల్సింది గా సూచించారు. బెట్ట పరిస్థితి దృష్ట్యా అనవసర పంట ఖర్చు లు తగ్గించి వ్యవసాయం లాభసాటిగా చేసుకోవాలన్నారు. డా. మనోజ్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త తెగుళ్ల విభాగం పురుగులు తెగుళ్ల యాజమాన్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పవన్, జరీనా, భాస్కరరెడ్డి, మహేంద్ర నాయక్ ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోపై రైతులు అవగాహన పెంచుకోవాలి

## -మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని

**చేబ్రోలు(పొన్నూరు), ఆగస్టు 10,ప్రభాతవార్త:** ప్రస్తుతం రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఎల్‌నినో పరిస్థితులపై పూర్తి అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని సూచించారు. చేబ్రోలు మండల పరిధిలోని శేకూరు గ్రామంలో రైతన్న మీ కోసం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రియదర్శిని మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని పంటలను సంరక్షించుకునే విధానాలపై రైతులకు అవగాహన కల్పించేందుకే రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో కాంపెయిన్ మోడ్‌లో నిర్వహిస్తామన్నారు. పిఎం కిసాన్ లబ్దిదారులు ఫారమ్ ఐడి పొందడం అత్యంత ఆవశ్యకమన్నారు. ఐడీ లేకపోతే పిఎం కిసాన్ ప్రయోజనం అందే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదముందన్నారు. ఐడీ పొందని రైతులు రైతు సేవా కేంద్రానికి వెళ్ళి వ్యవసాయ సహాయకులను కలవాలని, వారు సూచించిన విధంగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, వెలుగు సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు

**చేబ్రోలు(పొన్నూరు), ఆగస్టు 10,ప్రభాతవార్త:** చేబ్రోలు మండల పరిధిలోని శలపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ చంద్రశేఖరస్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత స్వామివారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకాలంకరణ చేశారు. వర్షాలు సకాలంలో పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, పాడి పంటలతో తులతూగాలని స్వామివారిని వేడుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కమిటి సభ్యులు ఏర్పాట్లు



# ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయం

## -ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, ఆగస్టు 10,ప్రభాతవార్త:** ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని జీబిసిరోడ్డు చింతలపూడి గ్రామం నుంచి గోపాపురం-పెదపాలెం-కోతివానిపాలెం వరకు రహదారి అభివృద్ధి పనులకు సోమవారం శంఖుస్థాపన చేశారు. సుమారు రూ.4.15కోట్ల ఖర్చుతో ఈ రహదారి నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలకు మరింత సౌకర్యంగా ఉంటుందన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్ వడ్రాణం మార్కండేయబాబు, ఎస్సీ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బండ్లమూడి బాబూరావు, దాసరి విజయకుమార్, పఠాన్ పిరోజ్‌ఖాన్, యరసాని శ్రీరామమూర్తి, శెట్టి లింగేశ్వరరావు, మగు బ్ఎల్‌బేగ్, షేక్ బాజిసాహెబ్ తదితరులున్నారు.



# కాలానుగుణ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

## కెఎల్ యు డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్.

తాడేపల్లి, ఆగస్టు 10, ప్రభాతవార్త. వర్షాకాలంలో ఇంటి పరిసరాలు చెత్త, బురద, నీటి నిల్వలత్తో అపరిశుభ్రంగా మారుతుంటాయని, దీంతో కాలానుగుణంగా అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం పొంచివుందని, తదనుగుణంగా ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కెఎల్ యూనివర్శిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్ సూచించారు. సోమవారం దుగ్గిరాల మండలంలోని రేవేంద్రపాడు గ్రామంలో యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ మరియు బయోటెక్నాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ అభియాన్ కింద వాలంటీర్లు "పరిసరాల శుభ్రతతో మన ఆరోగ్యం" అనే కార్యక్రమంతో ఇంటింటికి వెళ్లి శుభ్రత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించినట్లు డీన్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లాఖాన్ వివరించారు. పరిసరాలలో ఖాళీ కొబ్బరి బోండాలు, పాత టైర్లు, కుండీలు, నీటి తొట్టెలు ఉంచటంతో దోమలకు ఆవాసాలుగా మారి ప్రమాదకరమైన డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వంటి జ్వరాలు, కలుషిత నీటి వలన టైఫాయిడ్, కలరా, హెపటైటిస్ఎ, చర్మవ్యాధులు వస్తాయని పేర్కొన్నారు. పరిసరాల్లోని చెత్తను ఎప్పటికప్పుడు తొలగించటం, మల, మూత్ర విసర్జనకు మరుగుదొడ్లు వాడటం, మురుగు నిల్వ వుండకుండా చర్యలు తీసుకోవటం, దోమ తెరలు వాడటం, వాడుక నీటి ట్యాంకులు, డ్రమ్ములపై మూతలు వుంచటం ద్వారా వ్యాధులు దరిచేరవని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమం సమన్వయకర్త పి.సురేష్, వాలంటీర్లను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రవీణ్ తదితరులు అభినందించారు.



# బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పుట్టినరోజు వేడుకలు

**తాడేపల్లి, ఆగస్టు 10, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ జన్మదినం సందర్భంగా సోమవారం సాయంత్రం శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు నిండు నూరేళ్ల ఆయురారోగ్య ఐశ్వర్యాలతో ఉండాలని వారి గోత్రం పేరు మీద ప్రత్యేక పూజలు చేపించడం అనంతరం శ్రీకృష్ణ చైతన్య వృద్ధాశ్రమం లో పండ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. వృద్ధాశ్రమంలోని వృద్ధులందరూ పివిఎన్ మాధవ్



ఆయురారోగ్యాలతో తులతూగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల నాగేశ్వరరావు, కోస్తాంధ్ర ఓబీసీ మోర్చా జోనల్ ఇంచార్జ్ తుల్లిమిల్లి రామకృష్ణ, మంగళగిరి రూరల్ అధ్యక్షులు మణికంఠ, పట్టణ కార్యదర్శి సోమశేఖర్, రూరల్ ఉపాధ్యక్షులు కటకం వెంకటేశ్వరావు, రూరల్ ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్ రెడ్డి, ఓబీసీ మోర్చా రూరల్ అధ్యక్షులు కర్ణ రోశయ్య, పట్టణ కోశాధికారి సంగేపు రామ మల్లేశ్వరరావు, సంగాబత్తుల నరసయ్య, అచ్చికర్ల రాము, నాగేశ్వరరావు, జగదీష్. రామారావు, అరుణకుమారి, విజయ సాయి, విజయబాబు, బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఏఎన్‌యులో ఉచితమొబైల్ శిక్షణ ప్రారంభం


ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్10, ప్రభాతవార్త: ఏఎన్‌యులో సిఎస్ఆర్ విభాగం ఆధ్వర్యంలో రూసా 2.0 సహకారంతో 5రోజుల ఉచిత మొబైల్ రిపేర్ శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ తరగతులను పొన్నూరు ఎంఎల్ఏ డి.నరేంద్రకుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాత రోజుల్లో చదువు ఉంటే ఉద్యోగాలు వచ్చేవి. నేటి రోజుల్లో నైపుణ్యాలకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. చదువుతోపాటు నైపుణ్యాలు నేర్చుకోవాలని సూచించారు. రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ వర్సిటీ గోల్డెన్ జూబ్లీ సంబరాలు నిర్వహిస్తున్న ఈసందర్భంలో సిఎస్ఆర్ సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆచార్య బబిత, ఇసి మెంబర్‌లు ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, ఆచార్య పి.సుధాకర్, సీనియర్ ప్రోగ్రాం అధికారి ఎం.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.



# ఈనెల 14 నుంచి ఒలంపియన్ సర్కస్

**గుంటూరు విద్య ఆగస్టు 10 ప్రభాతవార్త :**

గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 14 నుండి 23 వరకు ఒలంపియన్ సర్కస్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గాంధీ, జార్జ్ తెలిపారు. సోమవారం విజ్ఞాన మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ సోమవారం నుండి శుక్రవారం వరకు రెండు ప్రదర్శనలు, శని, ఆది, సెలవు దినాల్లో మూడు ప్రదర్శనలు జరుగుతాయన్నారు. ఆన్లైన్ బుక్ మై షో లో కూడా టికెట్స్ బుకింగ్ చేసుకోవచ్చని చెప్పారు.




# ఏఐ బిల్డ్ 2026 హ్యాక థాన్ కు అనూహ్య స్పందన

## పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులు..

## కెఎల్ యులో జరిగిన హ్యాక్ థాన్ లో ప్రథమ విజేతగా కేఎల్ యు..

## ద్వితీయ స్థానంలో డీఎన్ఆర్ కళాశాల, విజ్ఞాన్ నిరులా సంస్థలు..

**తాడేపల్లి, ఆగస్టు 10, ప్రభాతవార్త.**

శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు నిర్వహించిన ఎఐ బిల్డ్ 2026 హ్యాక థాన్ లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆయా ఇంజనీరింగ్ విద్యా సంస్థల నుండి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అయితే స్థానిక కెఎల్ యూనివర్శిటీ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి రికార్డు సృష్టించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఇంజనీరింగ్ విద్యార్థుల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సాంకేతిక నైపుణ్యాలను వెలుగులోకి తీసుకు వచ్చే లక్ష్యంతో




42 లెర్న్, కేఎల్ విశ్వవిద్యాలయం, అసోచామ్‌లు సంయుక్తంగా నిర్వహించిన ఏఐ బిల్డ్-2026 ఆదివారం నాడు విజయవంతంగా ముగిసింది. స్థానిక వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్శిటీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. 75కు పైగా ఇంజినీరింగ్ కళాశాలలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఫైనల్ ఇయర్ విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల తరువాత వెయ్యి మందిని ఎంపిక చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఏజెంటిక్ ఏఐ, జెనరేటివ్ ఏఐ మరియు ఎమర్జింగ్ టెక్నాలజీస్ కు సంబంధించిన రియల్ వరల్డ్ ఇండస్ట్రీ సమస్యల మీద పరిష్కారాలను రూపొందించారు. విద్యార్థుల్లోని సాంకేతిక, విశ్లేషణాత్మక, సృజనాత్మక సామర్థ్యాలను పరిశ్రమ ప్రముఖుల సమక్షంలో ప్రదర్శించేలా ఈ పోటీని 42 లెర్న్ రూపొందించింది. విద్యాసంస్థల్లోని ప్రతిభను నేరుగా పరిశ్రమ అవసరాలతో అనుసంధానం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా ఉంది.

పరిశ్రమ ప్రముఖులతో నిర్ణయక మండలిని ఏర్పాటు చేశారు. ఏఐ బిల్డ్-2026 కార్యక్రమానికి సూపర్ మనీ చీఫ్ హ్యూమన్ రీసోర్స్ ఆఫీసర్ డాక్టర్ వరద రాజు జె, సూపర్ మనీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ కౌశిక్ ఎం, ఫ్లిప్ కార్ట్ చీఫ్ ఆర్కిటెక్ట్ హనుమంతరావు, బజార్ వాయిస్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీని బసవ, నార్తర్న్ ట్రస్ట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాయడన్, బ్రిల్లియో ఆసియా పసిఫిక్ టాలెంట్ ఎక్విజిషన్ హెడ్ రితూ, రేజర్ పే ప్రపంచ టాలెంట్ ఎక్విజిషన్ హెడ్ సుమిత్ ప్రేమీ సభ్యులుగా వ్యవహరించారు. పరిశ్రమకు సంబంధించిన సమస్యలను విద్యార్థులకు అందించడంతో పాటు, వారు రూపొందించిన పరిష్కారాలను నిర్ణాయక మండలి సభ్యులు పరిశీలించి మూల్యాంకనం చేశారు. 42 లెర్న్ ప్రెసిడెంట్ కోగంటి రాజశేఖర్ మాట్లాడుతూ, "ఏఐ బిల్డ్-2026 ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్ ప్రతిభ ఎంత విస్తృతంగా ఉందో చాటి చెప్పిందన్నారు. వాస్తవిక పరిశ్రమ సమస్యలు, అవకాశాల ద్వారా ఈ ప్రతిభను నేరుగా పరిశ్రమతో అనుసంధానం చేయడమే 42 లెర్న్ లక్ష్యం" అని తెలిపారు.

**విజేతలు**

**ప్రథమ విజేత : కేఎల్ విశ్వవిద్యాలయం.**

టీమ్ మెంబర్లు : ఎం. శేష్మ, సయ్యద్ మస్తాన్ వలీ, ఎల్ శ్రావ్య.

ద్వితీయ విజేతలు 2 : డీఎన్ఆర్ కళాశాల ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, భీమవరం. టీమ్ మెంబర్లు : టీ వేణుమాధవ్, ఎస్ ఎస్ రామరాజు, ఎస్ వీ కే కళ్యాణీ దుర్గ, బి. శ్రీనివాస్.

విజ్ఞాన్ నిరులా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్, గుంటూరు , టీమ్ మెంబర్లు : ఎల్ లాశ్య, టి.నందినీ లక్ష్మి, ఏ హెచ్ జయ లక్ష్మి, పి.మైత్రేయి.

తృతీయ విజేతలు 2: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ (ఐఐఐటీడీఎం), కర్నూలు నిలిచాయి. టీమ్ మెంబర్లు : ఎన్ సూజల్, సీఆర్ వైష్ణవీ. లు కాగా , నదింపల్లి సత్యనారాయణరాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, విశాఖపట్నం టీమ్ మెంబర్లు : పి. అచ్యుతరావు, ప్రతిక్ పటేల్, ఎం. చైతన్యమూర్తి.

ఏఐ బిల్డ్-2026 ద్వారా విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య ప్రత్యక్ష అనుసంధానాన్ని ఏర్పాటు చేయాలన్న 42 లెర్న్ విస్తృత లక్ష్యం మరోసారి స్పష్టమైందని 42 లెర్న్ ప్రెసిడెంట్ కోగంటి రాజశేఖర్ చెప్పారు. వాస్తవిక సమస్యల పరిష్కారంలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించడంతో పాటు, పరిశ్రమలకు భవిష్యత్ ప్రతిభావంతులను గుర్తించే అవకాశం కల్పించిందన్నారు. 42 లెర్న్ పరిశ్రమ ఆధారిత ప్రతిభ, నైపుణ్య అభివృద్ధి వేదికగా పనిచేస్తోందన్నారు. విశ్వవిద్యాలయాలు, విద్యార్థులను ప్రముఖ సంస్థలు, వాస్తవిక సమస్యలు, పరిశ్రమ మార్గదర్శకులు, ఉద్యోగ అవకాశాలతో అనుసంధానిస్తూ రాబోయే తరం సాంకేతిక ప్రతిభను తీర్చిదిద్దడంపై దృష్టి సారిస్తోందన్నారు. విద్యాసంస్థలు, సంస్థలకు అధిక సామర్థ్యం కలిగిన ప్రతిభను గుర్తించడం, అభివృద్ధి చేయడం, విస్తృత స్థాయిలో అనుసంధానం చేసుకోవడానికి అవసరమైన కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేసిన కెఎల్ యూనివర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కెఐ.పవన్ కుమార్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ సూపర్ మనీ కౌశికర్ ముకర్జీ, ఎస్విపి ఎల్ అండ్ డి నోర్తర్న్ ట్రస్ట్ బ్యాంక్ డాక్టర్ రోయ్ డాన్ గోన్సల్ వెజ్ , గ్లోబల్ టిఏ హెడ్ రీతు శర్మ బ్రిలియో, ప్రముఖ ఆర్కిటెక్ట్ విపి. ఫ్లిప్ కార్ట్ హనుమంతరావు సూసర్ల , చీఫ్ హ్యూమన్ రీసోర్స్ ఆఫీసర్, సూపర్ మనీ డాక్టర్ వరదరాజు జనార్ధన్ , గ్లోబల్ టిఏ హెడ్ రాజోర్ పే సుమిత్ ప్రేమి, బజార్ వాయిస్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీని బసవ , కెఎల్ యూనివర్శిటీ ప్లేస్ మెంట్ విభాగం సీనియర్ డైరెక్టర్ జె.శరవణ బాబు, 42 లెర్న్ సిఇఒ కోగంటి రాజ్ తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

# నేడు మాల మృతవీరుల సంస్మరణ సభ

**గుంటూరు విద్య ఆగస్టు 10 ప్రభాతవార్త :** ఈ నెల 11 వ తేదిన బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగే మాల మృత వీరుల సంస్మరణ సభ కు గుంటూరు ప్రకాశం నెల్లూరు కృష్ణ ఉభయగోదావరి ఉత్తరాంధ్ర రాయలసీమ ప్రాంతాల నుంచి మాలలు తరలి రావాలని మాల సామాజిక వర్గం కు మాలమహానాడు పిలుపు ఇచ్చింది. ఈ మేరకు మాలమహానాడు కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవేందర్. రాష్ట్ర కార్యదర్శి పి. మోహన్ రావు లు మృత వీరుల సంస్మరణ సభ గురించి తెలియ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం కు ముఖ్య అతిధులు గా మాలమహానాడు జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ : డాక్టర్. వి. ఎల్. రాజు. ఎస్బిఐ రిటైర్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నపపాల. నర్సింహా పాల్గొంటారని.. ప్రధాన వక్త గా సుప్రీం కోర్టు అడ్వకేట్. వడ్లమూరి. కృష్ణ స్వరూప్ హాజరవుతారని. సభ కు మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జె. ఎన్. రావు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. 1997 ఆగష్టు 11 తేదిన చలో హైదరాబాద్ సచివాలయం ముట్టడి లక్షలాది మంది పాల్గొన్న కార్యక్రమం లో ఆనాటి ప్రభుత్వ చేత మాలమహానాడు కార్యకర్తలు మీద దారుణం గా దాడులు, లాఠీ చార్జీ లు జరిపించారన్నారు. ఈ సంఘటనలో పలువురు మాల మహానాడు నాయకులు చనిపోయారని ఎస్సి వర్గీకరణ కు వ్యతిరేకంగా జరిగిన పోరాటం లో వీర మరణం పొందిన మాల మృత వీరులకు ఘనంగా నివాళులు అర్పించడానికి మాలలు పెద్ద ఎత్తున తరలి రావాలని మాలమహానాడు నాయకులు పిలుపు ఇచ్చారు.

# వరల్డ్ పీస్ స్పోర్ట్స్ ఇండియన్ కోఆర్డినేటర్‌గా పాల్‌కుమార్

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్10, ప్రభాతవార్త: ఏఎన్‌యు వ్యాయామ విద్య డైరెక్టర్, వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆచార్య పి.పి.ఎస్.పాల్‌కుమార్‌కు అరుదైన గౌరవం దక్కింది. నార్త్ కొరియా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న వరల్డ్ సొసైటీ ఫర్ పీస్ స్పోర్ట్స్ ఇండియన్ కోఆర్డినేటర్‌గా పాల్‌కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు సంస్థ కార్యనిర్వాహకుల నుంచి నియామక ఉత్తర్వులు వర్సిటీకి అందాయి. పాల్‌కుమార్ ప్రస్తుతం వరల్డ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అలయన్స్ (చైనా) సభ్యునిగా, నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ వైస్- ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఈ సందర్భంగా పాల్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంప ప్రతిష్టాత్మక సంస్థలో భాగస్వామిగా ఉంటూ క్రీడా సేవలు చేసే అవకాశం వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. వీసి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, పలువురు కోఆర్డినేటర్‌లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



# భక్తిప్రపత్తులతో తాజ్ బాబా ఛబ్బీస్ వేడుకలు

## -కులమతాలకు అతీతంగా వేలాది మందికి అన్నదానం

**ఎ కొండూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు ఎఎంటికె దర్బార్ బాబె-ఎ-బాగ్దాద్ చీమలపాడు షరీఫ్‌లో మహారాష్ట్రలోని నాగ్‌పూర్ షరీఫ్‌లో ఉన్న హుజూర్ హాజరత్ సయ్యద్ బాబా తాజుద్దీన్ తాజుల్ ఔలియా మహాతుల్లా ఛబ్బీస్ వేడుకలను అలుపెరగని దువా (వేడుకోలు)నిర్వహించారు. బాబావారి కృపకు భక్తులు పాత్రులయ్యారు. ఈ సందర్భంగా భక్తులకు మహా అన్నసమారాధన(అన్నదానం) నిర్వహించాలని హుజూర్ తాజుద్దీన్ బాబా , అతాప్రవల్ల బాబా వార్ల కృప వల్ల అన్నదాన సేవలో పునీతులయ్యారు. ఈ కార్యక్రమంలో వాస్తు శిల్పి జాఫర్ షరీన్, బాగ్దాది, తాజ్ ఖాదర్ బాబు, ఖాదర్‌షా, మదని తదితరులు పాల్గొని భక్తులకు సేవలందించారు.



# వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో పూజా ఓటమి




**న్యూఢిల్లీ:** మహిళల హైజంప్ ఫైనల్‌లో జాతీయ సీనియర్ రికార్డు హోల్డర్ పూజా సింగ్ ఓటమితో ఏడవ స్థానంలో నిలవడంతో, భారత్ తన ప్రపంచ అథ్లెటిక్స్ అండర్20 ఛాంపియన్‌షిప్ ప్రచారాన్ని మూడు పతకాలతో(2 రజత, 1 కాంస్య) ముగించింది. ఈ ఏడాది ఆరంభంలో 1.93 మీటర్ల జాతీయ సీనియర్ రికార్డు నెలకొల్పిన 19 ఏళ్ల ఆ క్రీడాకారిణి, అగ్రశ్రేణి పోటీదారులలో ఒకరిగా ఈ పోటీలోకి ప్రవేశించింది. అయితే, ఫైనల్‌లో ఆమె 1.84 మీటర్లు మాత్రమే సాధించగలిగింది, ఆ తర్వాత 1.87 మీటర్ల వద్ద చేసిన మూడు ప్రయత్నాలలోనూ విఫలమైంది. దీంతో ఆస్ట్రేలియాకు చెందిన ఇజోబెల్ లూయిసన్‌రో 1.92 మీటర్ల ఎత్తును అధిగమించి స్వర్ణం గెలుచుకోగా, హంగేరీకి చెందిన లిలియానా బటోరి, స్పెయిన్‌కు చెందిన ఐటానా అలోన్సో 1.90 మీటర్ల ఎత్తును అధిగమించి మిగిలిన పోడియం స్థానాలను పంచుకున్నారు. కాగా భూమిక నెహటే, తహురా ఖాతున్, తను చౌదరి, థియా అరుముగంలతో కూడిన భారత మహిళల 4న400 మీటర్ల రిలే క్వార్టెట్ ఫైనల్‌లో 3:45.28 సమయంతో తొమ్మిదవ స్థానంలో, చివరి స్థానంలో నిలిచింది. యునైటెడ్ స్టేట్స్ 3:29.15 సమయంతో స్వర్ణం గెలుచుకోగా, ఆస్ట్రేలియా 3:31.39 సమయంతో రజతం, గ్రేట్ బ్రిటన్ 3:32.08 సమయంతో కాంస్యం గెలుచుకున్నాయి. అంతకు ముందు పురుషుల జావెలిన్ త్రోలో ఆశిష్ యాదవ్ రజతంతో దేశానికి ఖాతా తెరవగా, పురుషుల హైజంప్‌లో బసంత్ కుమార్ మేఘ్వాల్ మరో రజతం గెలుచుకున్నాడు. పురుషుల లాంగ్‌జంప్‌లో షానవాజ్ ఖాన్ కాంస్యం సాధించాడు.

## బల్లారట్ స్క్వాష్ ఓపెన్‌లో
# రన్నరప్‌గా సాన్య

**న్యూఢిల్లీ:** పిఎస్ఎ ఉమెన్స్ ఛాలెంజర్ టూర్ 3 ఈవెంట్ అయిన 2026 బల్లారట్ ఓపెన్ ఫైనల్లో, సాన్యా వాట్స్ పరాజయంతో టోర్నీ నుండి నిష్క్రమించింది. ఆస్ట్రేలియాలోని విక్టోరియాలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో 24 ఏళ్ల రెండో సీడ్ క్రీడాకారిణి, టాప్ సీడ్, స్వదేశీ అభిమాన క్రీడాకారిణి అయిన సారా కార్డ్‌వెల్ చేతిలో 24 నిమిషాల్లో 6-11, 8-11, 6-11 తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. గత వారం విక్టోరియా ఓపెన్ ఛాలెంజర్ 6కె ఈవెంట్ 2026లో రన్నరప్‌గా నిలిచిన తర్వాత, ఈ నెలలో ఆమెకు ఇది వరుసగా రెండవ ఫైనల్. పాకిస్థాన్‌కు చెందిన వజీహా అల్తాఫ్ వాకోవర్ ఇవ్వడంతో ఆమె రెండో రౌండ్‌లో తన ప్రచారాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత దక్షిణ కొరియా ప్రత్యర్థులపై వరుసగా రెండు విజయాలు సాధించింది. క్వార్టర్ ఫైనల్స్‌లో, ఆమె సుంగీ ఓహ్‌పై 6-11, 11-9, 12-10, 11-4 స్కోరుతో నాలుగు గేమ్‌ల హోరాహోరీ పోరులో గెలిచింది. ఆ తర్వాత సెమీస్‌లో ఐన్ జున్‌పై 11-5, 11-8, 11-4 స్కోరుతో స్ట్రెయిట్ గేమ్‌లలో విజయం సాధించింది. గత వారం విక్టోరియా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన తర్వాత ఏడు స్థానాలు ఎగబాకిన ఆమె, ప్రస్తుతం తన కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రపంచ ర్యాంకింగ్ అయిన 136వ స్థానంలో ఉంది.







## ప్లేయర్ ఆఫ్ ద మంత్‌లో..
# టీమిండియా స్టార్లకు నో ప్లేస్

**న్యూఢిల్లీ:** ఐసీసీ ప్రకటించిన ప్లేయర్ ఆఫ్ ద మంత్ నామినీస్‌లో టీమిండియాకు చెందిన స్టార్ ప్లేయర్లకు చోటు దక్కలేదు. ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్, వెస్టిండీస్ ఆల్ రౌండర్ జస్టిన్ గ్రీవ్స్, బంగ్లాదేశ్ బ్యాటర్ తంజిద్ హసన్ జూలై నెల పురుషుల నామినీస్ జాబితాలో ఉన్నారు. ఇంగ్లండ్ పర్యటనలో రాణించకపోవడంతో ఈ జాబితాలో టీమిండియా ప్లేయర్లు ఎవరికీ ప్లేస్ దొరకలేదు. ఇక ఇంగ్లండ్ వైట్‌బాల్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ జూలైలో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. భారత్‌తో జరిగిన పరిమిత ఓవర్ల సిరీస్‌లలో విశేషంగా రాణించాడు. అతడి కెప్టెన్సీలో ఇంగ్లండ్ భారత్‌పై వన్డే, టీ20 సిరీస్‌లను కైవసం చేసుకుంది. భారత్‌పై విజయాలు, వ్యక్తిగత ప్రదర్శన బ్రూక్‌ను ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డు రేసులో నిలబెట్టాయి. అలాగే వెస్టిండీస్ ప్లేయర్ జస్టిన్ గ్రీవ్స్ జూలైలో ఆల్ రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. బ్యాటింగ్‌లో సెంచరీలతో పాటు, బౌలింగ్‌లో 5 వికెట్ల ఘనత కూడా సాధించాడు. బాంగ్లదేశ్ యువ బ్యాటర్ తంజిద్ హసన్ కూడా ఆ నెలలో వైట్‌బాల్ క్రికెట్‌లో మంచి ప్రదర్శన ఇచ్చాడు. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో కీలక ఇన్నింగ్స్‌లు ఆడిన తంజిద్ జూలైలలో మరోసారి చూపించి నామినీల్లో చేరేలా చేసుకున్నాడు. కాగా గత నెలలో భారత్ జట్టు ఇంగ్లండ్‌లో ఐదు టీ20లు, మూడు వన్డేలు ఆడింది. కానీ ఈ పర్యటనలో ఆశించిన స్థాయి ప్రదర్శన ఇవ్వలేకపోయింది. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో భారత్ టీ20లో ఒక్క మ్యాచ్ కూడా గెలవలేకపోయింది. ఐదు మ్యాచ్చుల సిరీస్‌ను 0-4తో కోల్పోయింది. వన్డే సిరీస్‌లో భారత్ మంచి ఆరంభాన్నిచ్చి ఇంగ్లండ్‌ను ఓడించినా, తర్వాత వరుసగా ప్రత్యర్థి చేతిలో 2-1తో ఓటమి చెందింది. ఈ సిరీస్‌లో భారత్ తరఫున రోహిత్ శర్మ మాత్రమే ఓ వన్డే సెంచరీతో ఆకట్టుకున్నాడు.

# డ్యూరాండ్ కప్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు మోహన్ బగాన్

**న్యూఢిల్లీ:** సహల్ అబ్దుల్ సమద్ మొదటి అర్ధభాగంలో సాధించిన అద్భుతమైన హ్యాట్రిక్‌తో, మోహన్ బగాన్ సూపర్ జెయింట్ జట్టు సిఐఎస్ఎఫ్ ప్రొటెక్టర్స్‌పై 6-0 తేడాతో ఆధిపత్య విజయం సాధించి డ్యూరాండ్ కప్ క్వార్టర్ ఫైనల్స్‌లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో సహల్ అబ్దుల్ సమద్ తొలి అర్ధభాగంలోనే హ్యాట్రిక్ (17 నిముషం, 19, 37) సాధించి స్టార్‌గా నిలిచాడు. అలాగే మన్వీర్ సింగ్ (24), జేమీ మెక్లారెన్ (68), టెక్చమ్ అభిషేక్ సింగ్ (73) కూడా గోల్స్ చేశారు. ఈ విజయంతో మోహన్ బగాన్ జట్టు 9పాయింట్లతో గ్రూప్ ఎ లో అగ్రస్థానంలో నిలవగా, సిఐఎస్ఎఫ్ ప్రొటెక్టర్స్ ఒక్క పాయింట్ కూడా లేకుండా టోర్నమెంట్ నుండి నిష్క్రమించింది. మోహన్ బగాన్, ఆరంభం నుంచే దాడిని ప్రదర్శించింది. అయినప్పటికీ



ప్రొటెక్టర్స్ జట్టు రక్షణ విభాగం పటిష్టంగా నిలిచింది. డెజాన్ డ్రాజిక్ అభిషేక్ సింగ్‌కు అద్భుతమైన పాస్ ఇవ్వడంతో సహల్ గోల్ ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. ఆ తర్వాత మన్వీర్, టెక్చమ్ అందించిన అద్భుతమైన క్రాస్‌ను నియంత్రించి స్కోరును 3-0కి పెంచాడు. బంతిని అందుకున్న సహల్ అద్భుతమైన రీతిలో తన హ్యాట్రిక్‌ను పూర్తి చేశాడు. మోహన్ బగాన్ మొదటి అర్ధభాగంలో 75%బంతిని తమ ఆధీనంలో ఉంచుకుని ఆధిపత్యం చెలాయించి,విరామసమయానికి 4 గోల్స్ ఆధిక్యంలోకి వెళ్ళింది. మోహన్ బగాన్ చివరకు ఐదవ గోల్ జోడించడానికి ముందు మన్వీర్ మరియు లిస్టన్ గోల్ చేసేందుకు దగ్గరగా వచ్చారు. లిస్టన్‌తో కలిసి ఆడిన టెక్చామ్, బంతిని నెట్ పైకప్పులోకి పంపి ఘన విజయాన్ని పూర్తి చేశాడు.



# సూపర్ జెయింట్స్ కన్నేసిన ముంబయి
## వచ్చే సీజన్‌లో టైటిల్ లక్ష్యంగా ఎంపిక

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ దారుణంగా విఫలమైంది. టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ 14 మ్యాచ్‌ల్లో పదింటిలో ఓడి తీవ్రంగా నిరాశపర్చింది. దాంతో పాయింట్స్ టేబుల్‌లో 9వ స్థానంతో సరిపెట్టుకుంది. ఐదు సార్లు ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్‌కు ఇది ఏ మాత్రం స్థాయికి తగ్గ ప్రదర్శన కాదు. జట్టు నిండా స్టార్లు ఉన్నా అంచనాలకు తగ్గట్లు రాణించలేకపోయింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ వైఫల్యం ముంబై పతనాన్ని శాసించింది. ఈ ఘోర పరాజయాన్ని సీరియస్‌గా తీసుకున్న ముంబై ఇండియన్స్ వచ్చే సీజన్‌లో టైటిల్ గెలవడమే లక్ష్యంగా జట్టును సిద్ధం చేస్తోంది. జట్టును వీడాలని నిర్ణయించుకున్న కెప్టెన్ హార్దిక్ పాండ్యాను అడ్డుపెట్టుకొని తమకు కావాల్సిన ఆటగాళ్లను ఇతర జట్ల నుంచి ట్రేడ్ చేసుకునేందుకు ప్రయత్నాలను ప్రారంభించింది. ఇప్పటికే చెన్నై సూపర్ కింగ్, కోల్‌కత్తా నైట్ రైడర్స్‌తో ట్రేడ్ డీల్ గురించి చర్చలు జరిపిన ముంబై ఇండియన్స్ ఇతర ఫ్రాంచైజీలను కూడా సంప్రదించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా లక్నో సూపర్ జెయింట్స్‌కు చెందిన ప్రిన్స్ యాదవ్, మొహ్సిన్ ఖాన్‌తో పాటు, నికోలస్ పూరన్‌లపై ముంబై కన్నేసినట్లు తెలుస్తోంది. హార్దిక్ పాండ్యాను ఇచ్చి ఈ ముగ్గురి ఆటగాళ్లను జట్టులోకి తెచ్చుకోవాలనే ప్రయత్నాల్లో ముంబై ఉన్నట్లు సమాచారం. నికోలస్ పూరన్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముంబై ఫ్రాంచైజీల తరఫున ఆడుతాడు. ఐపీఎల్‌లో కూడా అతన్ని తమ జట్టులోకి తీసుకోవాలనే యోచనలో ముంబై మేనేజ్‌మెంట్ ఉంది. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్‌కు కూడా కెప్టెన్ అవసరం ఉంది. రిషభ్ పంత్ ఆ జట్టును వీడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. టీమిండియా మాజీ క్రికెటర్ అశ్విన్ కూడా లక్నోతో ముంబై సంప్రదింపులు జరపవచ్చని అభిప్రాయపడ్డాడు. హార్దిక్ పాండ్యాకు బదులుగా ప్రిన్స్ యాదవ్, మోహ్సిన్ ఖాన్‌తో పాటు నికోలస్ పూరన్‌ను ముంబై అడగవచ్చని అంచనా వేసాడు. లక్నో జట్టుకు కూడా కెప్టెన్ అవసరం ఉందని, హార్దిక్ పాండ్యాను తీసుకోవడం వారికి ప్రయోజనకరంగా ఉంటుందని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. అయితే ఒక్క హార్దిక్ పాండ్యా కోసం లక్నో సూపర్ జెయింట్స్ ముగ్గురు స్టార్ ఆటగాళ్లను వదులుకుంటుందా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అయితే లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా, ముంబై ఇండియన్స్ ఓనర్స్ ముఖేష్ అంబానీ మధ్య మంచి వ్యాపారా లావాదేవీలున్నాయి. గత సీజన్‌కు ముందు శార్దూల్ ఠాకూర్‌ను ముంబై ఇండియన్స్ ట్రేడ్ చేసుకుంది. ఈ ట్రేడ్ అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఈ తరహాలోనే ముంబై తమకు కావాల్సిన ఆటగాళ్లను లక్నో నుంచి తీసుకోవచ్చే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# సెబీ ఆంక్షలపై శాట్ ఆశ్రయించిన జీ ఎంటర్‌ప్రైజెస్

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** సెక్యూరిటీస్ మార్కెట్‌లో ప్రవేశించకుండా సెబీ విధించిన ఆంక్షలను సవాల్ చేస్తూ జీ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ, సీఈఓ పునీత్ గోయెంకా సెక్యూరిటీస్ అప్పీలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. అత్యవసర విచారణ, మధ్యంతర ఉపశమనం కోరడంతో ఈ కేసును బుధ వారం విచారించనుంది. తుది తీర్పువెలువడే వరకు మార్కెట్ యాక్సెస్ నిషేధాన్ని నిలిపివేయాలని వారు కోరారు. ప్రమోటర్ గ్రూప్ సంస్థ సన్‌బ్రైట్ మారిషస్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు



3,143.5 కోట్ల విలువైన పూర్తిగా కన్వర్టిబుల్ వారెంట్ల ప్రిఫరెన్షియల్ ఇష్యూను కొనసాగించేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.గతనెల 31న సెబీ జీ ఎంటర్‌ప్రైజెస్‌పై రెండు నెలల మార్కెట్ నిషేధం విధించగా, పునీత్ గోయెంకా, ప్రమోటర్ సుభాష్ చంద్రపై 12 నెలల చొప్పున ఆంక్షలు విధించింది.
జీపై రూ.30 లక్షలు, గోయెంకాపై రూ.58 లక్షలు, చంద్రపై రూ.60 లక్షలు జరిమానా విధించింది. జూబ్లీహిల్స్‌లోని జీ ఆస్తిని ఎస్సెల్ గ్రూప్‌కు చెందిన నాలుగు సంస్థలు ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ నుంచి తీసుకున్న సుమారు ..726 కోట్ల రుణాలకు భద్రతగా ఉపయోగించడమే కేసుకు ప్రధాన కారణం.

# ఇంటెల్ షేర్ల పతనం..
## రూ.15 బిలియన్ల సేకరణకు నిర్ణయం

**న్యూఢిల్లీ,ఆగస్టు 10:** చిప్ తయారీ దిగ్గజం ఇంటెల్ కార్పొరేషన్ షేర్లు సోమవారం ప్రీమార్కెట్ ట్రేడింగ్‌లో దాదాపు 5 శాతం పడిపోయాయి. కంపెనీ సుమారు 15 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.1.3 లక్షల కోట్లు సమీకరించేందుకు కొత్తగా షేర్లను జారీ చేయనున్నట్లు ప్రకటించడంతో ఇన్వెస్టర్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. గత ఏడాది కాలంలో ఇంటెల్ షేర్ ధర 400 శాతానికి పైగా పెరగడంతో, అధిక విలువల వద్ద తాజా మూలధనాన్ని సమీకరించేందుకు కంపెనీ ఈ అవకాశాన్ని వినియోగించు కుంటోంది. ప్రీ మార్కెట్ ట్రేడింగ్‌లో ఇంటెల్ షేరు 4.67 శాతం క్షీణించి 96.90 డాలర్లకు చేరింది. గత




సెషన్‌లో ఇది 101.65 డాలర్ల వద్ద ముగిసింది.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా టెక్నాలజీ రంగంలో వేగవంతమైన మార్పులు చోటుచేసుకుంటున్నప్పటికీ, తమ ఉత్పత్తులకు కస్టమర్ల నుంచి డిమాండ్ బలంగా, స్థిరంగా కొనసాగుతోందని ఇంటెల్ తెలిపింది. ఫిజికల్ ఎఐ, కస్టమ్ సిలికాన్, అడ్వాన్స్‌డ్ చిప్ ప్యాకేజింగ్, ఇతర సంస్థల కోసం వాఫర్ తయారీ వంటి విభాగాల్లో గణనీయమైన వృద్ధి అవకాశాలను కంపెనీ గుర్తించింది.కొత్త షేర్ల విక్రయం ద్వారా లభించే నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు, ముఖ్యంగా క్యాపిటల్ వ్యయాలకు వినియోగించనున్నట్లు ఇంటెల్ వెల్లడించింది.

## వాణిజ్యం




# స్వల్పలాభాలకే సెన్సెక్స్, నిఫ్టీ పరిమితం

**ముంబయి,ఆగస్టు 10:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఫలితాలపై ఇన్వెస్టర్లు ఫోకస్ పెంచడంతో సోమవారం దేశీయ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప లాభాలతో ముగిశాయి. గత వారం ప్రవేశపెట్టిన క్లోజింగ్ ఆక్షన్ సెషన్ విధానం చివరి నిమిషాల్లో మార్కెట్లో అధిక అస్థిరతకు కారణం కావడంతో ఇన్వెస్టర్లలో అప్రమత్తత కొనసాగింది. అమెరికా-ఇరాన్ పరిణామాలు, రుతుపవనాల పురోగతిని ఇన్వెస్టర్లు నిశితంగా పరిశీలించారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితి, దాని ప్రభావంతో ముడిచమురు ధరలు పెరిగే అవకాశాలు మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. దీంతో సూచీల లాభాలు పరిమితమయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 43.27 పాయింట్లు పెరిగి 78,542.44 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 13.15 పాయింట్లు లాభపడి 24,583.80 వద్ద స్థిరపడింది. ప్రైవేట్ బ్యాంకులు, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలో కొనుగోళ్లు నిఫ్టీకి మద్దతుగా నిలిచాయి. మరోవైపు పీఎస్‌యూ బ్యాంకులు, చమురు-గ్యాస్ షేర్లలో బలహీనత లాభాలను పరిమితం చేసింది. మిడ్‌క్యాప్ షేర్లలోనూ స్వల్ప లాభాలు నమోదయ్యాయి. బీఎస్ఈ 150మిడ్‌క్యాప్ సూచీ 0.17 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.04 శాతం పెరిగాయి. బీఎస్ఈలో 2,225 షేర్లు లాభపడగా, 2,226 షేర్లు నష్టపోయాయి. మరో 207 షేర్లలో మార్పు లేదు. టైటాన్ కంపెనీ 3.02 శాతం కంపెనీ కన్సాలిడేటెడ్ పన్ను తర్వాత లాభం 62.9 శాతం పెరిగి రూ.1,777 కోట్లకు చేరింది. బజాజ్ ఫైనాన్స్ 2.24 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 0.76 శాతం లాభపడ్డాయి.స్కై గోల్డ్ అండ్ డైమండ్స్ 8.42 శాతం ర్యాలీ చేసింది. ఏకీకృత నికర లాభం 136.94 శాతం పెరిగి రూ.103.28 కోట్లకు చేరింది.ఆయిల్ ఇండియా 2.30 శాతం పెరిగింది. ఏకీకృత నికర లాభం 252.83 శాతం పెరిగి రూ.2,870.21 కోట్లకు చేరింది. పవర్ మెక్ ప్రాజెక్ట్స్ 3.26 శాతం పడిపోయింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 44 శాతం తగ్గి రూ.79.78 కోట్లకు చేరింది.కేన్స్ టెక్నాలజీ ఇండియా 3.14 శాతం క్షీణించింది. ఆర్తి ఫార్మాల్యాబ్స్, యూనివర్సల్ కేబుల్స్ బలమైన త్రైమాసిక ఫలితాలతో 20 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి.డెల్హివరీ 1.07 శాతం లాభపడింది.సాల్జర్ ఎలక్ట్రానిక్స్ బలహీన లాభదాయకత నేపథ్యంలో 5.58 శాతం పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో అక్టోబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర 46 సెంట్లు లేదా 0.55 శాతం పెరిగి బ్యారెల్‌కు 84.01 డాలర్లకు చేరింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి స్వల్పంగా బలహీనపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 95.3050 వద్ద కొనసాగింది. గత సెషన్‌లో ఇది 95.1750 వద్ద ముగిసింది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 డెలివరీ బంగారం ఫ్యూచర్స్ 0.38 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,52,400 వద్ద కొనసాగింది.

# జూలైలో ఇ-వే బిల్లుల జోరు.. 5.98 శాతం వృద్ధి

**న్యూఢిల్లీ,ఆగస్టు 10:** దేశ ఆర్థిక వ్యవస్థలో వస్తువుల రవాణా, వాణిజ్య కార్యకలాపాలు స్థిరంగా కొనసాగుతున్నాయనడానికి సంకేతంగా గత జులైనెలలో ఈవే బిల్లుల జారీ పెరిగింది. జీఎస్టీ ట్యాక్స్ నెట్‌వర్క్ డేటా ప్రకారం జులైలో 13.979 కోట్ల ఈవే బిల్లులు జారీ అయ్యాయి. గత ఏడాది ఇదే నెలలో నమోదైన 13.191 కోట్లతో పోలిస్తే ఇది 5.98 శాతం వృద్ధిగారికార్డయింది. ఈ ఏడాది మార్చిలో నమోదైన 14.060 కోట్ల ఈవే బిల్లులే ఇప్పటివరకు అత్యధికం. జూన్‌లో నమోదైన 13.677 కోట్లతో పోలిస్తే జూలైలో ఈవే బిల్లుల జారీ 2.21 శాతం పెరిగింది.అయితే, త్రైమాసిక ప్రాతిపదికన వృద్ధి వేగం కొంత తగ్గింది. ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ఈవే బిల్లుల వృద్ధి 15.7 శాతంగా ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అది 12.4 శాతానికి తగ్గింది.రాష్ట్రాల మధ్య రూ.50వేలకు మించి విలువైన సరుకుల రవాణాకు ఈవే బిల్లు తప్పనిసరి. అంతర్రాష్ట్ర రవాణాకు సంబంధించిన ఈ పరిమితి రాష్ట్రాలను బట్టి మారుతూ ఉంటుంది.పన్ను వసూళ్లకు సానుకూల సంకేతాలుశ్రిది ఇండియా భాగస్వామి ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. జూలైలో ఈవే బిల్లుల సంఖ్య వార్షిక ప్రాతిపదికన 5.98 శాతం పెరగడంతో పాటు, నెలవారీగా కూడా వృద్ధి నమోదు కావడం దేశీయ వాణిజ్యం, సరఫరా గొలుసులు పటిష్ఠంగా ఉన్నాయనే విషయాన్ని సూచిస్తోందన్నారు. ఆగస్టు జీఎస్టీ వసూళ్లు కూడా బలంగా ఉండే అవకాశం ఉందని, అయితే తుది ఆదాయం లావాదేవీల విలువ, వాటి స్వభావంపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన నెలవారీ ఆర్థిక సమీక్షలో ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ, 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగాన్ని కొనసాగించింది. దీనికి దేశీయ డిమాండ్‌లోని స్థిరత్వం ప్రధానంగా దోహదపడింది.అయితే కొన్ని హైఫ్రీక్వెన్సీ సూచీలు, ముఖ్యంగా ఈవే బిల్లుల జారీ, తయారీ రంగ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ వృద్ధి వేగంలో కొంత మందగమనాన్ని చూపించాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది.ఇదే సమయంలో సేవల రంగం మరింత బలపడిందని, దేశీయ, అంతర్జాతీయ డిమాండ్‌కు అనుకూల పరిస్థితులు దీనికి మద్దతుగా నిలిచాయని పేర్కొంది.







# రోజుకు రూ.7700 కోట్లు పెరిగిన మస్క్ సంపద

**న్యూయార్కు,ఆగస్టు 10:** ట్రిలియనీర్ ఎలాన్ మస్క్ సంపద ఏడాది కాలంలో భారీగా పెరిగింది. 2025 జులై నుంచి 2026 జులై మధ్య ఆయన సంపద ఏకంగా 320 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.27 లక్షల కోట్లకు పైగాపెరిగింది. రోజుకు సగటున 875 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.7,700 కోట్లు చొప్పున ఆయన సంపద పెరిగినట్లు బెస్ట్‌బ్రోకర్స్ వెల్లడించింది. ఫోర్బ్స్ రియల్‌టైమ్ బిలియనీర్ జాబితాను ఆధారంగా చేసుకుని అధ్యయనం జరిగింది. 2025 జులై 27న, 2026 జులై 27న ప్రపంచ కుబేరుల సంపదను పోల్చి చూశారు. గత ఏడాది కృత్రిమ మేధ, టెక్నాలజీ రంగాల్లో భారీ వృద్ధి కనిపించింది. దీంతో ఈ రంగాలకు చెందిన పలువురు వ్యాపారవేత్తల సంపద గణనీయంగా పెరిగింది. మస్క్ తర్వాత అత్యధికంగా సంపద పెరిగిన వ్యక్తిగా డెల్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు మైఖేల్ డెల్ నిలిచారు. ఆయన సంపద ఏడాదిలో 107.6 బిలియన్ డాలర్లు పెరిగింది. డీప్‌సీక్ వ్యవస్థాపకుడు లియాంగ్ వెన్‌ఫెంగ్ సంపద 2025లో 1బిలియన్ డాలర్ల నుంచి 2026లో 39.5 బిలియన్ డాలర్లకు చేరింది. అంటే ఏడాదిలో ఏకంగా 3,850 శాతం పెరిగింది. దీంతో ఆయన ప్రపంచంలోని టాప్50 కుబేరుల జాబితాలో చేరారు. మస్క్ తొలిసారి 2021లో ఫోర్బ్స్ కుబేరుల జాబితాలోచోటు సంపాదించారు. అప్పటి నుంచి ఆయన సంపద కొత్త రికార్డులు సృష్టిస్తూనే ఉంది.

# నాన్‌లైఫ్ బీమా ప్రీమియం వృద్ధి 5.7%కే పరిమితం

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** దేశంలోని నాన్‌లైఫ్ బీమా సంస్థల స్థూల ప్రత్యక్ష ప్రీమియం వృద్ధి జూలైలో మందగించింది. గత ఏడాది ఇదే నెలలో దాదాపు 16 శాతంగా ఉన్న వృద్ధి, ఈ ఏడాది జూలైలో 5.7 శాతానికి పరిమితమైంది. మల్టీలైన్ సాధారణ బీమా సంస్థల ప్రీమియం వృద్ధి తగ్గడం ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది.నాన్‌లైఫ్ బీమా సంస్థల పరిశ్రమ సంఘం జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ విడుదల చేసిన డేటా ప్రకారం మల్టీలైన్ సాధారణ బీమా సంస్థలు, స్టాండలోన్ హెల్త్ ఇన్సూరర్లు, ప్రత్యేక ప్రభుత్వ రంగ బీమా సంస్థలను కలిపి జూలైలో మొత్తం స్థూల ప్రత్యక్ష ప్రీమియం 31,397.6 కోట్లుగా నమోదైంది.మల్టీలైన్ జనరల్ ఇన్సూరర్ల ప్రీమియం ఏడాది ప్రాతిపదికన 7.7 శాతం పెరిగి 26,335.3 కోట్లకు చేరింది. హెల్త్ ఇన్సూరర్ల ప్రీమియం ఒక్కటే 28.8 శాతం వృద్ధితో 4,666 కోట్లుగా నమోదైంది. అయితే ప్రత్యేక ప్రభుత్వ రంగ బీమా సంస్థల ప్రీమియం 75 శాతానికి పైగా క్షీణించి రూ. 396 కోట్లకు పడిపోయింది. జూన్‌లో నాన్‌లైఫ్ బీమా సంస్థల స్థూల ప్రత్యక్ష ప్రీమియం 27,196.3 కోట్లుగా ఉండగా, వార్షిక వృద్ధి 15.9 శాతంగా నమోదైంది. మేలో ప్రీమియం 24,195 కోట్లుగా, 8.7 శాతం వృద్ధితో నమోదైంది. ఏప్రిల్‌లో 8.4 శాతం పెరిగి 36,417.7 కోట్లకు చేరింది. ప్రముఖ బీమా సంస్థల్లో న్యూ ఇండియా అస్యూరెన్స్ జూలైలో ప్రీమియం 4.5 శాతం పెరిగి రూ.4,322.66 కోట్లకు చేరుకుంది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14